


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక — ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 86 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ శుక్రవారం 6 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 86 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD FRI 6 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur



## బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది
# ఫెవికాల్ బంధం

- కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను అరెస్టు చేయాలి: బీజేపీకి రేవంత్ రెడ్డి డిమాండ్
- ఏపీలో అధికారం కోల్పోతామని తెలిసినా సోనియా తెలంగాణ ఇచ్చారని వ్యాఖ్య
- అసెంబ్లీకి రాని కేసీఆర్‌కు వేతనం కట్ చేయవద్దా అని ప్రశ్న

**హైదరాబాద్ పెన్ పవర్:**కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి కేసులో కేసీఆర్, హరీశ్ రావును, ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో కేటీఆర్‌ను అరెస్టు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధమని విమర్శించారు. బీఆర్ఎస్ అగ్ర నాయకులను అరెస్టు చేసిన తర్వాతనే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ నేతలు ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లా గుమ్లాపూర్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ, రాష్ట్రంలో 123 మున్సిపాలిటీలు, ఏడు కార్పొరేషన్లలో అభివృద్ధి పనులకు రెండేళ్లలో రూ. 17,442 కోట్లు ఖర్చు చేశామని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తామని సోనియా గాంధీ కరీంనగర్ గడ్డ నుంచే హామీ ఇచ్చి నెరవేర్చారని అన్నారు. ఏపీలో అధికారం కోల్పోయినా మాట తప్పలేదని అన్నారు. ఏపీ పెట్టుబడిదారులు అడ్డుపడినా ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణను కాంగ్రెస్ ఇచ్చినప్పటికీ ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టారని, కానీ ప్రజల ఆకాంక్షలను వారు నెరవేర్చలేకపోయారని విమర్శించారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ప్రజాపాలన అందిస్తుంటే తమపై కొంతమంది విషం చిమ్ముతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని ఆ కుటుంబం దాడి చేస్తోందని మండిపడ్డారు. కేసీఆర్ నెల నెలా వేతనం తీసుకుంటున్నారు కానీ సభకు మాత్రం రావడం లేదని, ఒక్కరోజు కూడా అసెంబ్లీకి రాని ఆయనకు వేతనం కట్ చేయవద్దా అని ప్రశ్నించారు. లోక్ సభ ఎన్నికల్లో ఎనిమిది మంది బీజేపీ ఎంపీలను బీఆర్ఎస్ గెలిపించిందని ఆరోపించారు. మున్సిపల్ ఎన్నికల కోసం బీజేపీ జాతీయ అధ్యక్షుడిని తీసుకువచ్చిందని, కానీ

వివరాలు 2లో..



### గ్రూప్ 1 అభ్యర్థులకు
## లైన్ క్లియర్

- గ్రూప్ 1 నియామకాలపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు
- సింగిల్ జడ్జి ఉత్తర్వులను రద్దు చేసిన హైకోర్టు
- గ్రూప్ 1కు ఎంపికైన అభ్యర్థులకు ఊరట
- టీజీపీఎస్సీ, అభ్యర్థుల అప్పీల్ పై సీజే బెంచ్ తీర్పు

వివరాలు 2లో..



## బీజేపీని గెలిపిస్తే రూ.500 కోట్లు తీసుకొస్తాం

హుజూరాబాద్‌లో బండి సంజయ్ ప్రకటన

- గ్రామ పంచాయతీలకు కేంద్రం రూ.259 కోట్లు విడుదల చేసిందని వెల్లడి
- కేంద్రం నుంచి వందల కోట్ల రూపాయల నిధులు తెచ్చామన్న బండి సంజయ్
- బీజేపీని గెలిపిస్తే మినీ స్టేడియం నిర్మిస్తామని హామీ

వివరాలు 2లో..



## బొగ్గు గనిలో పేలుడు... 16 మంది మృత్యువాత

- మేఘాలయలోని బొగ్గు గనిలో భారీ పేలుడు
- ఘటనలో 16 మంది కార్మికులు మృతి
- మృతుల్లో ఎక్కువ మంది అసోం వాసులుగా అనుమానం
- ఘటనా స్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:**మేఘాలయలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. తాష్ఖె ప్రాంతం లోని ఓ బొగ్గు గనిలో గురువారం పేలుడు సంభవించడంతో, 16 మంది కార్మికులు మరణించారు. ఈ దుర్ఘటనతో స్థానికంగా తీవ్ర విషాదం నెలకొంది. వార్తా సంస్థల కథనాల ప్రకారం, గని లోపల ఈ పేలుడు జరగడంతో కార్మికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా అసోం రాష్ట్రానికి చెందిన వలస కార్మికులుగా అధికారులు అనుమానిస్తున్నారు. వీరిలో ఒకరిని కటిగొరా ప్రాంతానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. మిగతా వారి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ దుర్ఘటన గురించి తెలియగానే మేఘాలయ పోలీసులు, సహాయక బృందాలు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గనిలోపల చిక్కుకున్న వారిని బయటకు తీసుకొచ్చేందుకు సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి. మేఘాలయలో తరచూ జరుగుతున్న చట్టవిరుద్ధమైన 'ర్యాట్-హోల్' మైనింగ్ వల్లే ఇలాంటి

- మిగతా 2లో...



## తిరుమల లడ్డూపై దుష్ప్రచారం చేస్తున్నారు

### ఢిల్లీలో వైసీపీ ఎంపీల మీడియా సమావేశం

- లడ్డూ నెయ్యిలో కొవ్వు ఆరోపణలు పూర్తిగా అవాస్తవమన్న వైసీపీ ఎంపీలు
- సీబీఐ, సిట్ నివేదికల్లో క్లీన్ చిట్ వచ్చిందని వెల్లడి
- సత్యశోధన పరీక్షకు సిద్ధమన్న టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- రాజకీయ లబ్ధి కోసమే కూటమి విషప్రచారం చేస్తోందని ఆరోపణ
- ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టి మళ్లించేందుకే ఈ కుట్రలన్న వైసీపీ

- మిగతా 2లో...


# మున్సిపల్ ఎన్నికల బరిలోకి రాజకీయ వారసులు



- వికారాబాద్ నుంచి పోటీలో స్పీకర్ కుమార్తె
- ఖేడ్ నుంచి ఎంపీ సురేశ్ షెట్కర్ తమ్ముడు, అన్న కుమారుడు
- ఆదిలాబాద్ నుంచి జోగు రామన్న కొడుకు ప్రేమేందర్
- రామగుండం నుంచి మాజీ ఎమ్మెల్యే మాలెం మల్లేశం కుమారుడు

**హైదరాబాద్ పెన్ పవర్:**మున్సిపల్ ఎన్నికల బరిలోకి రాజకీయ వారసులు దిగారు. దీంతో పురపోరు ఆసక్తికరంగా మారింది. అగ్రనాయకులు పట్టణాల్లోనే బైఠాయించి తమ వారసులను గెలిపించుకునే ప్రయత్నం చేస్తుండటం విశేషం. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కుమార్తె అనన్య వికారాబాద్ మున్సిపల్ 17వ వార్డు అభ్యర్థిగా బరిలోకి దిగారు. ఆమె గెలు పుకోసం స్పీకర్ ప్రసాద్ కుమార్ తీవ్రంగా యత్నిస్తున్నారు. అక్కడ ఆమె విజయం సాధిస్తే మున్సిపల్ చైర్ పర్సన్ అయ్యే అవకాశాలున్నాయని సమాచారం.

వివరాలు 2లో..



### పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో
## భారత్ 'వాయు' గర్జన

- పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో వాయుసేన భారీ విన్యాసాలు
- ఫిబ్రవరి 27న జైసల్మేర్‌లో 'వాయు శక్తి 2026' పేరిట ప్రదర్శన
- 'ఆపరేషన్ సిందూర్' తరహాలో సాగనున్న ఎక్సర్‌సైజ్
- రఫేల్, సుఖోయ్, తేజస్, మిగ్-29 యుద్ధ విమానాలతో ప్రదర్శన
- తొలిసారిగా మిగ్-21 లేకుండా జరగనున్న వైమానిక విన్యాసాలు

వివరాలు 2లో..

### మరో రెండేళ్లలో కేసీఆర్
## సీఎం అవుతారు...


అప్పుడు మిగిలిన పనులు చేసుకుందాం: హరీశ్ రావు



- గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హరీశ్ రావు
- మనల్ని బాగా చూసుకునే వారికి ఓటు వేయాలని పిలుపు
- ధైర్యం ఉంటే అభివృద్ధిలో కేసీఆర్‌తో పోటీ పడాలని ముఖ్యమంత్రికి సవాల్

- మిగతా 2లో...

### నిరసనల మధ్య... రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసంగం...
## విపక్షాల వాకౌట్



- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో ప్రధాని ప్రసంగం
- మాజీ ఆర్మీ చీఫ్ నరవణే పుస్తకంపై చర్చకు పట్టుబట్టిన విపక్షాలు
- ప్రధాని మాట్లాడుతుండగా నినాదాలు.. సభ నుంచి వాకౌట్ చేసిన విపక్ష సభ్యులు
- వికసిత భారత్ లక్ష్యంగా దేశం ముందుకు సాగుతోందన్న ప్రధాని మోదీ
- భారత్‌తో వ్యాపారానికి ప్రపంచ దేశాలు ఆసక్తి చూపుతున్నాయని వ్యాఖ్య

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. గురువారం రాజ్యసభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమాధానం ఇస్తుండగా, విపక్ష సభ్యులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

- మిగతా 2లో...



### వాణిజ్య ఒప్పందంపై త్వరలో
## ఉమ్మడి ప్రకటన

- రెండు దేశాల నుంచి వచ్చే వారంలో సంయుక్త ప్రకటన
- ఒప్పందానికి సంబంధించి ముసాయిదా తుది రూపు సిద్ధమవుతోందని వెల్లడి
- మార్చి నెల మధ్యలో సంతకాలు జరిగే అవకాశముందన్న పీయూష్ గోయల్

- మిగతా 2లో...

## ఎడిటర్ వ్యూ

# దేశ రక్షణ పరిశోధనలో ఆద్యుడు

సూరి భగవంతం (అక్టోబరు 14, 1909 – ఫిబ్రవరి 6, 1989) (వయసు 79) ప్రముఖ శాస్త్రవేత్త. దేశ రక్షణకు సంబంధించిన పరిశోధనల్లో ఆద్యుడు. ఆయన కృష్ణా జిల్లా ఆగిరిపల్లి గ్రామంలో అక్టోబరు 14, 1909 న జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం అనంతరం హైదరాబాదు నిజాం కళాశాలలో డిగ్రీ (బి.ఎస్సీ) చదువు పూర్తిచేసి, మద్రాసు యూనివర్సిటీ నుండి బి.ఎస్.సి (భౌతిక శాస్త్రము) డిగ్రీని ప్రథమ శ్రేణిలో ప్రథముడుగా అందు కున్నారు. ఈ సందర్భంగా అనేక పతకాలను అందుకున్న విద్యార్థిగా కలకత్తాలో సర్ సి.వి.రామన్ దగ్గర రీసెర్చ్ స్కాలర్ గా చేరారు. ఆయన తన మేథో సంపత్తితో, శాస్త్రీయ దృక్పథంతో, ఆలోచనా సరళితో, ప్రయోగ శీలతతో సి.వి.రామన్ అభిమానాన్ని చూరగొని ప్రియ శిష్యుడయ్యారు. అక్కడే మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.ఎస్సీ. పట్టాను సంపాదించారు.ఆయన 1932లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో అధ్యాపకుడుగా చేరారు. 1938లో ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు. బోధనా విధానంలో వీరిది చాలా సులభ శైలి. స్పష్టమైన వ్యక్తీకరణ, విశేషమైన ఆలోచన, కచ్చితమైన అనువర్తన, సమగ్రమైన దృష్టి, అద్భుతమైన ప్రతిభ లన్నీ కలగలిపి అయన బోధనా విధానాన్ని ఇతర శాఖల అధ్యాపకులు కూడా నేర్చుకునే వారని చెబుతారు. తన 28 వ యేటనే యింతటి ఉన్నత పదవిని అదిష్టించటం విశేషం. దీనికి కొద్ది కాలం ముందే యూనివర్సిటీ ఆయనకు డి.ఎస్సి డిగ్రీ ప్రదానం చేసింది. ఈయన 1948 వరకు ఈ పదవిలోనే ఉన్నారు. భగవంతం 1941లో కళాశాల ప్రిన్సిపాల్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తన పరిపాలనా కౌశలం చూపి కళాశాలను విజయ వంతంగా నడిపారు. 1948–49 మధ్య లండన్ లోని భారత రాయబారి వి.కె. కృష్ణ మీనన్ కార్యాలయంలో వైజ్ఞానిక సలహాదారుగా పని చేశారు. చాలా ఐరోపా దేశాల్లో పర్యటించి వివిధ విజ్ఞాన విషయాల మీద ప్రసంగాలు చేశారు. 1949లో స్వదేశం తిరిగి వచ్చి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో భౌతిక శాఖాధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు.పరిశోధన వైపు దృష్టి కేంద్రికరించి 12 మంది డాక్టరేట్ లను తయారు చేశారు. తరువాత 1952లో విశ్వవిద్యాలయ ఉప కులపతిగా పదవిని చేపట్టారు. 1957లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) సారథిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రొఫెసర్ సూరి భగవంతం బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. అక్కడ పని చేస్తుండగా కృష్ణ మీనన్ ఒత్తిడి మీద 1961లో రక్షణ శాఖ పరిశోధనా సంస్థకు అధిపతిగాను, తనకు వైజ్ఞానిక సలహాదారుగా చేరారు. ఆ సమయంలో ప్రొఫెసర్ భగవంతం రక్షణ అవసరాలను తీర్చడానికి అనువర్తిత పరిశోధన, అభివృద్ధి దిశలో డీఆర్డీఓ ను నైపుణ్యంగా నడిపించారు. సుమారు ఎనిమిది సంవత్సరాలు డిఆర్‌డిఓ హెడ్‌గా పనిచేశారు. అక్టోబర్ 1969 లో తన పదవి నుండి పదవీ విరమణ చేసే సమయానికి, సంస్థ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. 1962 చైనా–భారత్ యుద్ధం తర్వాత వై. బి. చవాన్ రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఒ.) అధిపతిగా చేరి ఎంతో ప్రగతి సాధించారు. భారత దేశమంతా ఇరవైకి పైగా ప్రయోగ శాలలను ప్రారంభించి యుద్ధ రంగానికి అవసరమైన క్షిపణులు, విమానాలు, ట్యాంకులు, రాడార్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలైన అనేక విషయాలలో విజయం సాధించారు. 1969లో పదవీ విరమణ చేశారు. ఆయన 300 పైగా పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. ఇవి కాక గ్రూపు థియరీ, రామన్ ఎఫెక్ట్, క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్ అనే మూడు గ్రంథాలు రచించారు. 1961 జూలైలో కేంద్ర ప్రభుత్వ సర్వీస్ లో ప్రవేశించిన ప్రొఫెసర్ భగవంతం రక్షణ మంత్రికి సైంటిఫిక్ అడ్వయిజర్ గా నియమితు లైనప్పటికీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఓ) కు డైరక్టర్ జనరల్ గా కూడా వ్యవహరించారు. భూతలం మీద, సముద్ర జలాల మీద, గాలిలో దేశ పోరాట శక్తులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేయటానికి డి.ఆర్.డి.ఓని ఒక సమర్థవంతమైన పనిముట్టుగా రూపొందించారు. శక్తివంతమైన అయుధంగా మలిచారు. ఆర్.డి.ఓను పటిష్ఠ పరచడంలో ఈయన చేసిన కృషి అసమానం. ఆర్గనైజేషన్ బ్రహ్మాండమైన ఎదుగుదలను సాధించింది. అనేకానేక ల్యాబరేటరిలను, సుశిక్షితులను రూపొందించారు. రక్షణ శాఖ పరిశోధనలలో అనేక మంది శాస్త్రవేత్తలకు ప్రవేశం కల్పించి, వారి మేధస్సుకు పదును పెట్టారు. డి.ఆర్.డి.ఓకు నేతృత్వం వహించిన 9 సంవత్సరాల వ్యవధిలో మిస్సైల్స్, ఎయిర్ క్రాఫ్ట్స్, ఏరో ఇంజన్స్, కొంబాట్ వెహికల్స్ (ట్యాంకులు మొదలైనవి) ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ సిస్టమ్స్, హై ఎక్స్‌ప్లోజివ్స్, అండర్ వాటర్ వెపన్స్ మొదలగు వాటిని అభివృద్ధి చేయటానికి ల్యాబరేటరీలను స్థాపించారు. ఆధునిక యుద్ధ తంత్ర సాంకేతిక నైపుణ్య రంగంలో ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇప్పించారు. వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు. దేశ రక్షణ శాఖకు అద్వితీయమైన సేవలు అందిస్తూనే మరోపక్క అవాంఛనీయ పోకడలను గమనిస్తూనే ఉన్నారు. ఒకసారి నోబెల్ బహుమతి గ్రహీత, భారత మిత్రుడు ప్రొఫెసర్ పి.ఎం.ఎస్.బ్లాకెట్ ప్రధాని నెహ్రూకు ఒక సలహా యిచ్చారు. దేశ రక్షణ శాఖ అభివృద్ధి చెందడానికి దేశీయ ఉత్పత్తుల రూపకల్పనను మినహాయించి ప్రత్యామ్నాయంగా దిగుమతులు చేసుకోవలసినదని, రాడార్స్, మిస్సైల్స్, యుద్ధ ట్యాంకుల కోసం దిగుమతుల మీద ఆధారపడటం ఉత్తమమని సలహా యిచ్చారు. ఈ సలహాను పూర్తిగా నిర్లక్ష్య పరిచేలా చేసిన ప్రొఫెసర్ భగవంతం మన దేశం సర్వదా కృతజ్ఞతగా ఉండాలి. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు శాస్త్ర సలహాదారునిగా విశేష కృషి చేసి, జాతీయ భావాలకు పరిపుష్టి కల్పించి అఖండ పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. భౌతిక శాస్త్ర రంగంలో మూడు ప్రామాణిక గ్రంథాలను, అనేక పరిశోధనా పత్రాలను వెలువరించారు. రామన్ ఎఫెక్ట్ అంశం మీద వివిధ కోణాలలో అధ్యయనం చేశారు. పునః పరిశోధనలు జరిపారు. "మాలిక్యులర్ లాటిస్ వైబ్రేషన్" అంశం మీద గ్రూప్ థియరిటికల్ అప్లికేషన్స్, వాయువుల గూర్చి రామన్ ఎఫెక్ట్ కు సంబంధించిన పరిశోధనలు మీద సునిశిత కృషి జరిపారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ లలో ఫెలోషిప్ మీద పరిశోధనలు నిర్వహించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోషియేషన్ వారి భౌతిక శాస్త్ర విభాగానికి అధ్యక్షులుగా (1946) వ్యవహరించారు. "1961 లో క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్" అనే బృహత్తర గ్రంథ రచన చేసి అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు. కమిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ద డెవలపింగ్ కంట్రీస్ అధ్యక్షులుగా సి.వి.రామన్ పరిశోధించిన రామన్ ఎఫెక్టు అంశం మీద ప్రామాణిక పరిశోధనలు చేసిన అద్వితీయ శాస్త్రవేత్తగా కీర్తి గడించారు. రామన్ ఎఫెక్ట్, క్రిష్టల్ స్ట్రక్చర్ మొదలగు అంశాల మీద అవిశ్రాంత పరిశోధనలు జరిపి గ్రంథ రచనలు చేశారు. ఆయన 300 పైగా పరిశోధనా పత్రాలను వెలువరించారు. గ్రూప్ థీరీ, రామన్ ఎఫెక్టు అనే రెండు ఉత్తమ గ్రంథాలను కూడా చేశారు. ఇవి ప్రామాణిక గ్రంథాలుగా అంతర్జాతీయ ఖ్యాతిని పొంది, అనేక భాషలలోకి అనువదించటం జరిగింది. జాతీయ అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక సైంటిఫిక్, ప్రొఫెషనల్ సంస్థలు అనేకంలో ఆయన ఎలెక్టెడ్ ఫెలోగా ఉన్నారు. పలు యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. సి.వి.రామన్ అనుంగు శిష్యునిగా, దేశ రక్షణ శాఖను బలోపేతం చేసిన దేశభక్తునిగా పేరొందిన ప్రొఫెసర్ భగవంతం తన 80 వ యేట 1989, ఫిబ్రవరి 6 వ తేదీన మరణించారు.

# బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధం

- మొదటి పేజి తరువాయి

కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను అరెస్టు చేశాకే వారు ఓట్లు అడగాలని డిమాండ్ చేశారు. రెండేళ్లు మీరేం చేశారని బీజేపీ ప్రశ్నిస్తోందని, కానీ పదేళ్లు వారేం చేశారో చెప్పడం లేదని చురక అంటించారు. మోదీ, అమిత్ షా ఎవరిని తీసుకొచ్చినా మున్సిపల్ ఎన్నికల్లో ఒక్క సీటు బీజేపీ గెలవదని అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు.అలాంటప్పుడు బీజేపీ జాతీయ అధ్యక్షుడు తెలంగాణకు ఎందుకోసం వచ్చినట్లని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో సీబీఐ విచారణ చేయించాలని అసెంబ్లీ తీర్మానం చేసి పంపిస్తే కేంద్రం స్పందించలేదని మండిపడ్డారు. ఫార్ములా ఈ రేసు కేసులో చర్యలు తీసుకోవాలని కోరినా స్పందించడం లేదని ఆరోపించారు. మెట్రో రైలు మంజూరు చేయలేదని, మూసీ ప్రక్షాళనకు నిధులు ఇవ్వలేదని అన్నారు. కాళేశ్వరం బీఆర్ఎస్‌కు ఏటీఎంలా మారిందని మోదీ, అమిత్ షా కూడా అన్నారని గుర్తి చేశారు. తాము అధికారంలోకి వచ్చాక ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టామని, ఎంతో అభివృద్ధి చేశామని అన్నారు. వెయ్యి బస్సులకు ఆడబిడ్డలను యజమానులుగా చేశామని, రెండేళ్లలో 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని వెల్లడించారు. రైతులకు రుణమాఫీ చేశామని అన్నారు. కానీ బీఆర్ఎస్ హయాంలో ఆడబిడ్డల చీరల్లో కూడా కమీషన్లు తీసుకున్నారని ఆరోపించారు.

# గ్రూప్ 1 అభ్యర్థులకు లైన్ క్లియర్

తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షపై నెలకొన్న వివాదంలో హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. గతంలో సింగిల్ బెంచ్ జడ్జి ఇచ్చిన తీర్పును సీజే ధర్మాసనం రద్దు చేసింది. ఈ రోజు ఉదయం వెలువరించిన తీర్పు ప్రకారం.. 2024 అక్టోబర్ లో జరిగిన మెయిన్స్ పరీక్షల్లో అవకతవకలు జరగాయన్న ఆరోపణలను తోసిపుచ్చింది. జవాబు పత్రాలను మళ్లీ మూల్యాంకనం చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. దీంతో గ్రూప్ – 1 ఉద్యోగాలకు ఎంపికైన 562 మంది అభ్యర్థులకు ఊరట లభించింది. 2024 లో నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షల్లో మొత్తం 562 మంది అభ్యర్థులను టీజీపీఎస్సీ ఎంపిక చేసింది. ఎంపికైన అభ్యర్థులకు 2025 సెప్టెంబర్ 27న సీఎం రేవంత్ రెడ్డి నియామక పత్రాలు అందించారు.

**ఏంటీ వివాదం..**

టీజీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్–1 మెయిన్స్ పరీక్షలకు సంబంధించి మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని, మార్కుల కేటాయింపులో పారదర్శకత లేదని పలువురు అభ్యర్థులు

హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ ను విచారించిన సింగిల్ బెంచ్ జడ్జి.. గ్రూప్–1 మెయిన్స్ ర్యాంకింగ్ లను రద్దు చేశారు. జవాబుపత్రాలను రీ వాల్యుయేషన్ చేయాలని ఆదేశించారు. ఈ తీర్పుపై గ్రూప్ 1 కు ఎంపికైన అభ్యర్థులతో పాటు టీజీపీఎస్సీ కూడా హైకోర్టులో అప్పీల్ చేసింది.

# బీజేపీని గెలిపిస్తే రూ.500 కోట్లు తీసుకొస్తాం

మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే మొదటి విడతగా తెలంగాణకు రూ.500 కోట్లు తీసుకొస్తామని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ వెల్లడించారు. హుజూరాబాద్‌లో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడుతూ, గ్రామ పంచాయతీలకు ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ.259 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

గత కొన్నేళ్లుగా హుజూరాబాద్ అభివృద్ధి చెందలేదని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని మండిపడ్డారు. కేంద్రం నుంచి అభివృద్ధి పనుల కోసం వందల కోట్ల రూపాయలు తీసుకొచ్చామని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని పరికరాలను తీసుకొస్తే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అవసరమైన సిబ్బందిని నియమించడం లేదని విమర్శించారు.కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక హుజూరాబాద్ అభివృద్ధికి పైసా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తే మినీ స్టేడియం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఢిల్లీ నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అన్ని రకాల పన్నులు పెంచుతారని ఆరోపించారు.రాబోయే బడ్జెట్‌లో మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనపై బండి సంజయ్ స్పందించారు. కాంగ్రెస్ ఇచ్చిన ఇతర హామీల్లాగే ఇదీ ఉందని ఎద్దేవా చేశారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద మాత్రమే తెలంగాణకు ఇళ్లు వచ్చాయని అన్నారు. కేసీఆర్‌కు, ఆయన కుటుంబానికి చర్లపల్లి జైలులో రెండు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారని, కానీ ఎర్రవల్లి ఫామ్ హౌస్ నుంచి కూడా కదిలించలేకపోయారని అన్నారు.

**కిషన్ రెడ్డి, నేను కలిసి నిధులు తీసుకొచ్చాం**

తెలంగాణలోని గ్రామపంచాయతీలకు కేంద్రం నుంచి రూ.259 కోట్ల నిధులు తీసుకువచ్చామని బండి సంజయ్ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కిషన్ రెడ్డి, తాను నిరంతరం సంప్రదింపులు జరిపి ఈ నిధులు తెచ్చామని అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం కేవలం ప్రకటనలతో సరిపెట్టదని, కిందిస్థాయి వరకు నిధులు చేరుతాయని అన్నారు. రాజకీయాలకు అతీతంగా నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. నిధులు ఇంతటితో ఆగవని, దశలవారీగా వస్తూనే ఉంటాయని అన్నారు. అభివృద్ధి చేసే పార్టీలకు ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

# మున్సిపల్ ఎన్నికల బరిలోకి రాజకీయ వారసులు

- మొదటి పేజి తరువాయి

తన తండ్రి స్పీకర్ గా ఉన్నందున తాను స్థానిక సమస్యలపై దృష్టి సారించలేక పోతున్నారని, తనను గెలిపి స్తే తాను అందరికీ అందుబాటులో ఉండి వికా రాబాద్ అభివృద్ధికి కృషి చేస్తానంటున్నారు. ఇదిలా ఉండగా నారాయణ్ ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షట్కార్ తమ్ముడు నగేష్ షట్కార్ 8 వార్డు కౌన్సి లర్ గా పోటీ చేస్తున్నారు. ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్ అన్న కొడుకు సాగర్ షెట్కర్ ఏడో వార్డు నుంచి బరిలోకి దిగారు. ఎంపీ తమ్ముడు నగేష్ షట్కర్ ఖేడ్ చైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్నా రని సమాచారం. దీంతో పాటు ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలో మాజీ మంత్రి, బీఆర్ఎ స్ సీనియర్ నేత జోగు రామన్న తనయుడు ప్రేమేందర్ పోటీ చేస్తున్నారు. 34వ వార్డునుం చి బరిలోకి దిగిన ఆయన మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని ఆశిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 48వ డివిజన్ స్వతంత్ర అభ్యర్థిగా దివంగత మాజీ ఎమ్మెల్యే మాలెం మల్లేశం కుమారుడు మధు బరిలోకి దిగడం ఆసక్తికరంగా మారింది. 2020 ఎన్నికల్లో మధు 33వ డివిజన్ నుంచి స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేసి ఓటమి పా లయ్యారు. ఈ సారి గెలుపే లక్ష్యంగా మరో ప్ర యత్నం చేస్తుండటం గమనార్హం. ఏది ఏమైనా మున్సిపల్ ఎన్నికల్లో ముఖ్యనేతల వారసులు బరిలోకి దిగడంతో ఆయా స్థానాలపై అందరి దృష్టి నెలకొంది.

# మరో రెండేళ్లలో కేసీఆర్ సీఎం అవుతారు...

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో రెండేళ్లలో మరోసారి ముఖ్యమంత్రి అవుతారని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మిగిలిన అభివృద్ధి పనులు పూర్తి చేసుకుందామని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు ఏమీ చేయరని విమర్శించారు. గజ్వేల్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న హరీశ్ రావు మాట్లాడుతూ, మనల్ని బాగా చూసుకునే వారికే ఈ మున్సిపల్ ఎన్నికల్లో ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు.ఒకప్పుడు పందులతో ఉన్న గజ్వేల్ ఆసుపత్రి కేసీఆర్ వచ్చాక ఎలా అయిందో అందరూ గుర్తుంచుకోవాలని అన్నారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఎన్నో హామీలు ఇచ్చింది కానీ వాటిని అమలు చేయలేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కల్యాణ లక్ష్మి ఇవ్వలేదు కానీ బంగారం ధర మాత్రం భారీగా పెరిగిందని అన్నారు. అప్పుడు బంగారం ఆశపెట్టిన ముఖ్యమంత్రి ఇప్పుడు మాట్లాడటం లేదని విమర్శించారు.

కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులపై తిట్ల వర్షం కురిపించడం తప్ప రేవంత్ రెడ్డికి తెలిసిందేమీ లేదని అన్నారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం గజ్వేల్‌లో ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. ఎన్నికల తర్వాత రైతు బంధు ఇస్తామని ముఖ్యమంత్రి అంటున్నారని, కానీ ఈ నెల 11 లోపు ఇవ్వకపోతే ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే అభివృద్ధి విషయంలో కేసీఆర్‌తో పోటీ పడాలని సవాల్ చేశారు.

# వాణిజ్య ఒప్పందంపై త్వరలో ఉమ్మడి ప్రకటన

భారత్, అమెరికా మధ్య జరిగిన వాణిజ్య ఒప్పందంపై త్వరలో ఉమ్మడి ప్రకటన ఉంటుందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. రెండు దేశాల మధ్య జరిగిన అతిపెద్ద ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో ఇది మొదటి అంకమని ఆయన అన్నారు. రెండు దేశాల నుంచి వచ్చే వారంలో సంయుక్త ప్రకటన వెలువడుతుందని కేంద్ర మంత్రి వెల్లడించారు.ఒప్పందానికి సంబంధించి ముసాయిదా తుది రూపు సిద్ధమవుతోందని పీయూష్ గోయల్ అన్నారు. ఈ ఒప్పందానికి సంబంధించి మార్చి నెల మధ్యలో సంతకాలు జరిగే అవకాశముందని వెల్లడించారు.ఉమ్మడి ప్రకటన వెలువడిన అనంతరం, భారతదేశంపై సుంకాలను 18 శాతానికి తగ్గిస్తూ అమెరికా ఒక కార్యనిర్వాహక ఉత్తర్వును విడుదల చేస్తుంది.

మూడు రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ ఫోన్‌లో మాట్లాడడం తెలిసిందే. అనంతరం ట్రంప్ "భారతదేశానికి చెందిన ఉత్పత్తులపై ఇక నుంచి అమెరికాలో 18 శాతం సుంకాలు మాత్రమే ఉంటాయి" అని పోస్టు చేశారు. భారత్‌తో వాణిజ్య ఒప్పందానికి ఆమోదం తెలిపినట్టు ప్రకటించారు.

# నిరసనల మధ్య... రాజ్యసభలో ప్రధాని మోదీ ప్రసంగం... విపక్షాల వాకౌట్

పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ సభా కార్యకలాపాలకు అడ్డంకి కలిగించి, చివరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో సభ నుంచి వాకౌట్ చేశారు.మాజీ సైన్యాధిపతి జనరల్ ఎం.ఎం. నరవణే తన ఆత్మకథలో రాసిన కొన్ని కీలక అంశాలపై లోక్‌సభలో చర్చకు అనుమతించకపోవడమే ఈ గందరగోళానికి ప్రధాన కారణం. 2020లో చైనాతో సరిహద్దు ఘర్షణల సమయంలో రాజకీయ నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు అందలేదని నరవణే పేర్కొన్నారని, ఆ భాగాలను చదివి వినిపించేందుకు లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీకి అవకాశం ఇవ్వలేదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇదే అంశంపై గత మూడు రోజులుగా లోక్‌సభ దద్దరిల్లుతోంది. బుధవారం లోక్‌సభలో మహిళా ఎంపీలు ప్లకార్డులతో నిరసన తెలపడంతో సభ వాయిదా పడి, ప్రధాని ప్రసంగం నిలిచిపోయింది.

ఇవాళ రాజ్యసభలోనూ విపక్షాలు భగ్గుమన్నాయి. రాజ్యసభలో విపక్షాల నినాదాలు, అల్లరి మధ్యే ప్రధాని తన ప్రసంగాన్ని కొనసాగించారు. 'వికసిత భారత్' నిర్మాణంలో దేశం సరైన దిశలో వేగంగా పయనిస్తోందని అన్నారు. "గత కొన్ని సంవత్సరాలు దేశ వేగవంతమైన అభివృద్ధికి సాక్ష్యంగా నిలిచాయి. ప్రతి రంగంలోనూ ఇది మార్పుల యుగం" అని పేర్కొన్నారు. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు వృద్ధాప్యంలోకి వెళుతుంటే, యువశక్తితో ఉరకలేస్తున్న భారత్ ప్రపంచానికి కొత్త ఆశను అందిస్తోందని వ్యాఖ్యానించారు. ఒకప్పుడు 11వ స్థానంలో ఉన్న భారత ఆర్థిక వ్యవస్థ, ఇప్పుడు ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా సాగుతోందని ధీమా వ్యక్తం చేశారు.

అంతర్జాతీయంగా భారత్ ప్రతిష్ఠ పెరిగిందని, ఇటీవలే 9 కీలక వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని ప్రధాని తెలిపారు. ముఖ్యంగా యూరోపియన్ యూనియన్‌తో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని 'మదర్ ఆఫ్ ఆల్ డీల్స్'గా అభివర్ణించారు. గత కొన్నేళ్లుగా చేపట్టిన సంస్కరణల కారణంగా ప్రపంచ దేశాలు ఇప్పుడు భారత్‌తో వ్యాపారం చేయడానికి ఎంతో ఆసక్తిగా ఉన్నాయని స్పష్టం చేశారు. ప్రధాని మాట్లాడుతున్నంత సేపు విపక్ష సభ్యులు 'విపక్ష నేతను మాట్లాడనివ్వండి', 'నియంతృత్వం నశించాలి' వంటి నినాదాలతో హోరెత్తించారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ, విపక్ష నేత మల్లికార్జున ఖర్గేపై సరదాగా వ్యాఖ్యలు చేశారు. "ఖర్గే జీ వయసు, సీనియారిటీని దృష్టిలో ఉంచుకుని ఆయన కూర్చునే నినాదాలు చేసేందుకు అనుమతి ఇవ్వాలి" అని ప్యానెల్ స్పీకర్ ను కోరుతున్నట్లు చమత్కరించారు. ఈ క్రమంలో విపక్షాలు సభ నుంచి నిష్క్రమించాయి. పార్లమెంటరీ సంప్రదాయాలను ప్రభుత్వం కాలరాస్తోందని విపక్షాలు ఆరోపిస్తుండగా, అభివృద్ధి అజెండానే తమకు ముఖ్యమని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

# బొగ్గు గనిలో పేలుడు... 16 మంది మృత్యువాత

- మొదటి పేజి తరువాయి

ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తు ప్రారంభమైంది. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు పూర్తి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

# పాకిస్థాన్ సరిహద్దు సమీపంలో భారత్ 'వాయు' గర్జన

భారత వాయుసేనద తన సైనిక శక్తిని, వ్యూహాత్మక సంసిద్ధతను ప్రదర్శించేందుకు సిద్ధమైంది. రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో, పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలో ఫిబ్రవరి 27న 'వాయు శక్తి 2026' పేరిట భారీ వైమానిక విన్యాసాలు నిర్వహించనుంది. గతంలో సరిహద్దు దాటి ఉగ్ర స్థావరాలను ధ్వంసం చేసిన 'ఆపరేషన్ సిందూర్' తరహాలో ఈ విన్యాసాలను రూపొందించారు. ఈ ప్రదర్శన ద్వారా భారత వాయు శక్తి సామర్థ్యాలు మరోసారి ప్రపంచం దృష్టిని ఆకర్షించనున్నాయి.ఈ విన్యాసాల్లో వందకు పైగా విమానాలు పాల్గొననున్నాయని రక్షణ శాఖ అధికారులు తెలిపారు. రఫేల్, సుఖోయ్–30, తేజస్, మిగ్–29, జాగ్వార్, మిరాజ్–2000, హాక్ వంటి యుద్ధ విమానాలు లక్ష్యాలను అత్యంత కచ్చితత్వంతో ఛేదించనున్నాయి. వీటితో పాటు స్వదేశీ పరిజ్ఞానంతో తయారైన ప్రచండ్ అటాక్ హెలికాప్టర్ కూడా రాకెట్లను ప్రయోగిస్తుంది. వాయుసేన నుంచి వైదొలిగిన మిగ్–21 విమానం ఈ తరహా విన్యాసాల్లో కనిపించకపోవడం ఇదే తొలిసారి.ఒక కృత్రిమ యుద్ధ వాతావరణాన్ని సృష్టించి, ఇంటిగ్రేటెడ్ ఎయిర్ కమాండ్ అండ్ కంట్రోల్ సిస్టమ్ (ఐఏసీసీఎస్) ద్వారా ఈ మొత్తం విన్యాసాలను పర్యవేక్షించనున్నారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ విమానాలు, క్షిపణుల గమనాన్ని గుర్తించింది ఈ వ్యవస్థే. ఈ ఎక్సర్‌సైజ్‌లో భాగంగా సి–295 రవాణా విమానం మొదటిసారిగా రాత్రిపూట అసాల్ట్ ల్యాండింగ్ డ్రిల్ నిర్వహించనుంది. సి–130జె సూపర్ హెర్క్యులస్ విమానం చిన్న రన్‌వేపై ల్యాండ్ అయి, గరుడ్ కమాండోలను దించి, వెంటనే టేకాఫ్ అవుతుంది.

ఈ విన్యాసాల గురించి పాకిస్థాన్‌కు ముందస్తు సమాచారం అందించినట్లు, 'నోటీస్ టు ఎయిర్‌మెన్' జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పలువురు వీఐపీలతో పాటు, ఢిల్లీలోని సుమారు 40 మిత్రదేశాల రాయబార కార్యాలయాల అధికారులు కూడా హాజరుకానున్నారు.

# బీజేపీ అధ్యక్షులు తెలంగాణకు గాడిద గుడ్డే తీసుకొచ్చారు

**హైదరాబాద్ పెన్ పవర్:** బీజేపీ అధ్యక్షులు తెలంగాణకు గాడిద గుడ్డే తీసుకొచ్చారు తప్ప ఏం తేలేదని అన్నారు సీఎం రేవంత్ రెడ్డి. గురువారం (ఫిబ్రవరి 05) కరీంనగర్ జిల్లాలో పర్యటించిన సీఎం.. రుక్మాపూర్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ డిగ్రీ కళాశాల ప్రారంభించారు. కరీంనగర్ జిల్లాలో ఏటీసీ సెంటర్ కు శంకుస్థాపన చేసిన చేశారు. ఈ సందర్భంగా చొప్పదండి సెగ్మెంట్ గుమ్లాపూర్ లో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ



- మిగతా 4లో...

పెన్ పవర్
తెలంగాణ రౌండప్

- కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ దుండిగల్ తరలింపుకు సన్నద్ధం..
- ఒకవైపు అద్దె భారం..! మరోవైపు అక్రమ పార్కింగ్‌ల ట్రాఫిక్ సమస్యలకు విముక్తి..
- సూరారం అద్దె భవనం నుంచి దుండిగల్‌కు తరలించే ప్రతిపాదనల నేపథ్యంలో పరిశీలన.
- ఇకపై పార్కింగ్ సమస్యలకు చెక్..! విశాల ప్రభుత్వ భవనంలోనే సబ్ రిజిస్ట్రార్..
- జిల్లా రిజిస్ట్రార్ అశోక్‌కుమార్‌తో కలిసి ఐజి రాజీవ్‌గాంధీ ఖాళీ ప్రభుత్వ భవనాల పరిశీలన.
- దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వెంకటేష్ నాయక్ పాల్గొన్నారు..

ఖాళీగా ఉన్న దుండిగల్ సర్కిల్ పాత కార్యాలయాన్ని పరిశీలించిన అధికారులు..





# అద్దె భవనానికి వీడ్కోలు..!

# సొంత భవనంలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్..!

## కొత్త భవనాన్ని పరిశీలించిన 'స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్' ఐజి రాజీవ్‌గాంధీ హన్మంతు..

ఎట్టకేలకు సూరారం ఎక్స్ రోడ్డులో ఉన్న కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని దుండిగల్ గండిమైసమ్మ, మున్సిపల్ కార్యాలయాల వద్దకు తరలించే ప్రతిపాదనలు విజయవంతం అయ్యాయి.. ఈ నేపథ్యంలో సంబంధిత శాఖ ఉన్నతాధికారులతో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి గురువారం దుండిగల్‌లో ప్రతిపాదనల ఖాళీ భవనాలను పరిశీలించారు.. ప్రస్తుతం సూరారం కార్యాలయం అద్దె భవనం, పార్కింగ్ సౌకర్యం లేక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే.. త్వరలో కార్యాలయం తరలింపుపై అధికారిక నిర్ణయం తీసుకోనున్నట్టు సూచనా ప్రాయంగా తెలిపారు.. దుండిగల్, పెన్ పవర్, ఫిబ్రవరి 5:



అక్కడే మరో ఖాళీ భవనాన్ని కూడా అధికారులు పరిశీలించారు..



కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని క్రయవిక్రయ దారులకి శుభవార్త.. సూరారం ఎక్స్ రోడ్డులో కొన్నేండ్లుగా పలు సమస్యలతో అద్దె భవనంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, ఇప్పుడు దుండిగల్ సర్కిల్ కార్యాలయం పక్కకు చేరుకుంటుంది.. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల కేటాయింపుకు చేసిన ప్రతిపాదనల నేపథ్యంలో ఉన్నతాధికారులు కూడా అంగీకరించారు.. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా రిజిస్ట్రార్ అశోక్ కుమార్‌తో కలిసి స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజి రాజీవ్‌గాంధీ హన్మంతు గురువారం కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపుపై, దుండిగల్ సర్కిల్‌లో నూతన భవనాన్ని అధికారులతో సందర్శించి పరిశీలించారు.. ప్రస్తుతం సూరారంలో కొనసాగుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలో ఉండటంతో పాటు పార్కింగ్ సౌకర్యం లేకపోవడం వల్ల క్రయ-విక్రయదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు గుర్తించారు.. వేరే గత్యంతరం లేక, అక్రమ పార్కింగ్‌లకు వేలల్లో చలాన్లు, ట్రాఫిక్ జామ్ సమస్యలు, ఇరుకైన ప్రదేశం వంటి అంశాల కారణంగా కార్యాలయాన్ని మార్పిడి చేయాలన్న ప్రతిపాదనలు అందినట్లు ఐజి తెలిపారు..

## దుండిగల్‌లో అనువైన భవనం..

దుండిగల్ సర్కిల్ కార్యాలయ పరిధిలో పరిశీలించిన నూతన ప్రభుత్వ భవనం విశాలంగా ఉండటంతో పాటు సరిపడా పార్కింగ్ సౌకర్యం ఉన్నట్లు వెల్లడించారు. అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసి త్వరలోనే కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని దుండిగల్‌కు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా రిజిస్ట్రార్ అశోక్ కుమార్, జిహెచ్‌ఎంసి డిప్యూటీ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్ నాయక్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం

- మిగతా 4లో...

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# హన్మకొండలో మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

- కొబ్బరికాయ కొట్టి ప్రారంభించిన మంత్రి కొండా సురేఖ
- టీటీడీ కల్యాణ మండపంలో హుండీల లెక్కింపు
- లెక్కింపునకు పది రోజుల సమయం పట్టే అవకాశం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆసియా అతిపెద్ద గిరిజన జాతర మేడారం హుండీల లెక్కింపు ప్రారంభమైంది. హుండీల లెక్కింపునకు పది రోజుల సమయం పడుతుందని భావిస్తున్నారు. రెండేళ్లకోసారి వచ్చే ఈ మహా జాతర గత నెల 28 నుంచి 31 వరకు జరిగింది. సమ్మక్క, సారలమ్మలను కోట్లాది మంది భక్తులు దర్శించుకుంటారు. జాతరకు నెల రోజుల ముందు, జాతర అనంతరం మరికొన్నిరోజులు మేడారంను భక్తులు సందర్శిస్తారు. ఈ మహా జాతర హుండీలను హన్మకొండలోని టీటీడీ కళ్యాణ మండపానికి తీసుకువచ్చారు. ఈరోజు మంత్రి కొండా సురేఖ కొబ్బరికాయ కొట్టి లెక్కింపును ప్రారంభించారు. మేడారం జాతరకు తరలి వచ్చిన భక్తులు అమ్మవార్లకు కానుకలు సమర్పించుకున్నారు. క్రితంసారి మేడారం జాతరకు రూ.13 కోట్ల ఆదాయం సమకూరింది.

# తెలంగాణను రక్షించుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలి

- ఏపీలో ఎన్నో విమానాశ్రయాలు ఉన్నా తెలంగాణలో ఎందుకు లేవని ప్రశ్న
- కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు అయిందని విమర్శ
- దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా తెలంగాణ నుంచే వెళుతున్నాయని ఆగ్రహం



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణను రక్షించుకోవాలంటే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఇన్నాళ్లు తెలంగాణలో అధికారంలో ఉన్నది కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలేనని, ఏపీలో విమానాశ్రయాలు ఉన్నాయి కానీ తెలంగాణలో ఎందుకు లేవని ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఏం చేసిందని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ బంగారు బాతు అయిందని విమర్శించారు. దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా, తెలంగాణ నుంచే డబ్బులు వెళుతున్నాయని ఆరోపించారు. తెలంగాణను కాపాడుకోవాలంటే బీజేపీకి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో త్వరలో మున్సిపల్ ఎన్నికలు ఉన్న విషయం తెలిసిందే.

# బీజేపీ అధ్యక్షులు తెలంగాణకు గాడిద గుడ్డే తీసుకొచ్చారు

-3 పేజి తరువాయి

సభలో బీఆర్ఎస్, బీజేపీ నేతలపై నిప్పులు చెరిగారు. కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం.. మెట్రో, మూసీ, ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టులకు ఒక్క రూపాయి ఇవ్వట్లేదన్నారు. పాలమూరు ప్రాజెక్టు జాతీయ హోదాపై ప్రధాని మోదీ హామీ ఏమైందని ప్రశ్నించారు. 2014లో ఇచ్చిన హామీ ఇంకెప్పుడు నెరవేరుస్తారో చెప్పాలన్నారు. బీజేపీ అధ్యక్షులు తెలంగాణకు గాడిద గుడ్డే తీసుకొచ్చారు.. ఏం తేలేదని విమర్శించారు. బీజేపీ నేతలు ఎంత మంది వచ్చినా ఒక్క మున్సిపాలిటీ గెలవలేరన్నారు. BRS, BJP బంధం వీణావాణి లాంటిదని విమర్శించారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ ఓట్లు ట్రాన్స్ ఫర్ చేశారని ఆరోపించారు. కరీంనగర్ నుంచి తెలంగాణ మలిదశ ఉద్యమం ప్రారంభమైందన్నారు సీఎం రేవంత్. కరీంనగర్ సభలోనే సోనియా గాంధీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర వాగ్దానం చేశారని గుర్తు చేశారు. ఆంధ్రలో పార్టీ నష్టపోయినా తెలంగాణ ఇచ్చారని కొనియాడారు. 60 ఏళ్ల స్వరాష్ట్ర కలలను సోనియా సాకారం చేశారని చెప్పారు. కాంగ్రెస్ హయాంలోనే రైతులకు ఉచిత కరెంట్ వచ్చిందనీ.. ఉచిత కరెంట్ పథకం పేటెంట్ కాంగ్రెస్ దేనన్నారు. కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తే.. బీఆర్ఎస్ నేతలు కుటుంబ ఆస్తులు పెంచుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ రెండేళ్ల పాలన చూసి బీఆర్ఎస్ నేతలు ఓర్వలేకపోతున్నారని చెప్పారు. ప్రజలకు మంచి చేయడం చూసి ఓర్వలేక దిగిపోవాలని అంటున్నారన్నారు. బీఆరెఎస్ హయాంలో చొప్పదండిలో ఒక్క డబుల్ బెడ్ రూం ఇల్లు కూడా ఇవ్వలేదని అన్నారు.

## మారథాన్ ఈవెంట్లలో పాల్గొన్న బండ అనిల్ కానిస్టేబుల్



### బండ అనిల్ ను అభినందించిన జిల్లా ఎస్పీ బి.మహేష్ గితే

**రాజన్న సిరిసిల్ల: పెన్ పవర్:** రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినపల్లి మండలంలోని కొత్త పేట గ్రామానికి చెందిన బండ అనిల్ రాజన్న సిరిసిల్ల జిల్లాలో పోలీస్ కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్నాడు. బండ అనిల్ కానిస్టేబుల్ వివిధ రాష్టాలలో నిర్వహిస్తున్న మారథాన్ ఈ వెంట్లలో పాల్గొని ఎంతో మంది యువ సిబ్బందికి ఆదర్శంగా నిలిచిన బండ అనిల్ ను రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ బి మహేష్ గీతే ( ఐపీఎస్ ) అభినందించారు .ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ గితే మాట్లాడుతూ భవిష్యత్తులో కూడా ఇటువంటి పోటీలలో ప్రావీణ్యం సంపాదించి,రాష్ట్ర, దేశ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా బండ అనిల్ కానిస్టేబుల్ మాట్లాడుతూ ఈ యొక్క మారథాన్ లో పాల్గొనడానికి ప్రధాన కారణం ప్రతి ఒక్కరూ ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని వయసుతో సంబంధం లేకుండా,జాయిన్ రన్నింగ్ వంటివి చేయాలని ఇలా చేయడం వల్ల ఆరోగ్యానికి శారీరకంగా మానసికంగా ఇంకా మేలు జరుగుతుం దని, ముఖ్యంగా యూత్ డ్రగ్స్ కి దూరంగా ఉండాలని. అన్నారు అనంతరం ఇటీవల ముంబాయిలో జరిగిన మారథాన్ పోటిల్లో పాల్గొని 42.2 కిలోమీటర్లు 3 గంటల 26 నిముషాలలో,రాజస్థాన్ రాష్టంలో జరిగిన ఇండియా బాడర్ లో అత్యంత చలిలో 100కిలోమీటర్లు 14 గంటలలో చేరుకున్నారు. అలాగే కోల్ కత్తా రాష్ట్రం లో జరిగిన మారథాన్ లో పాల్గొని 25 కిలోమీటర్లు 1గంట 56 నిమిషాలలో చేరుకున్నారు. ఢిల్లి లో జరిగిన మారథాన్ లో పాల్గొని 21 కిలోమీటర్లు 1 గంట ముప్పై ఎనిమిది నిముషాలలో చేరుకున్నానని తెలిపారు

## పట్టణాల అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం.



**వనపర్తి. పెన్ పవర్:** వనపర్తిలో కాంగ్రెస్ ఎమ్మెల్యే రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి,ఎంపీ కాంగ్రెస్ పార్టీనే,నేడు ప్రతిపక్షాలకు ఓటేసిన ప్రయోజనం లేదు.హస్తం గుర్తుపై ఓటేద్దాం అభివృద్ధిని సాధిద్దాం.మీూా మేఘారెడ్డితెలంగాణ రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా ఆయన గురువారం వనపర్తి పట్టణంలోని 12వ వార్డు రాజనగరంలో, వనపర్తి పట్టణంలోని 11వ వార్డులో ఇంటింటి ప్రచారం చేపట్టారు.రాజనగరం 12వ వార్డు అభ్యర్థి అయిన నక్క రాణి రాజు ని, 11వ వార్డు అభ్యర్థి అయిన తులసి తిరుపతయాదవ్ ని గెలిపించాలని కోరుతూ ఆయన ఇంటింటి ప్రచారం చేపట్టారు.
ఎన్నికల ప్రచారానికి ఆయా వార్డుల్లోకి వెళ్లిన ఎమ్మెల్యే గారికి కౌన్సిలర్ గా పోటీలో ఉన్న అభ్యర్థులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు డప్పు వాయిద్యాలతో, మంగళహారతులతో, కుంకుమ తిలకం దిద్ది, పూల వర్షం కురిపిస్తూ ఘనంగా స్వాగతం పలికారు
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..ప్రస్తుతం మూడు సంవత్సరాలు కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉంటుందని, రానున్న మరో 5 సంవత్సరాలు కలుపుకొని మొత్తం 8 సంవత్సరాల కాలం కాంగ్రెస్ పార్టీని అధికారంలో ఉంటుందని అధికార పార్టీకి ఓటేస్తేనే వాడ వాడన అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రతి ఒక్కరు హస్తం గుర్తుపై ఓటేసి పోటీలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని ఆయన పిలుపునిచ్చారు.
వనపర్తి లో ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ నుంచి,నేనున్నానని రాష్ట్ర ముఖ్యమంత్రిగా.ఎనుముల రేవంత్ రెడ్డి ఉన్నారని.
మన ఎంపీగా డా: మల్లురవి ఉన్నారని.కౌన్సిలర్లుగా కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు ఉంటేనే పట్టణాల్లో వేగవంతంగా అభివృద్ధి సాధ్యమవుతుందని.ఇతర పార్టీల అభ్యర్థులకు ఓటేసిన ఎలాంటి ఉపయోగం ఉండదని ప్రజలు దీనిని గమనించి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు.పది సంవత్సరాల దీ=ూ పాలనలో వార్డులలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని, కేవలం కమిషన్ను దండుకోవడం కోసం చెరువు కట్టల మరమ్మత్తు చేపట్టి ప్రజాధనాన్ని దోచుకున్నారని ఆయన విమర్శించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కేవలం రెండు సంవత్సరాలలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టిందన్నారు.33 వార్డులల్లో కేవలం మౌలిక సదుపాయాల కోసం దాదాపు 100 కోట్ల రూపాయలతో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణం, కాలనీలలో విద్యుద్దీకరణ, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారులిబి
బిలివనపర్తి పట్టణంలోని 33 వార్డులలో పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థులందరూ విజయం సాధిస్తారని కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఇందుకు సహకరించగలరని ఆయన సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు యువకులు పార్టీ పెద్దలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## 33 వ వార్డు బిజెపితో పార్టీతోనే అభివృద్ధి

### బిజెపి అభ్యర్థి బచ్చు సౌజన్యరాం



**వనపర్తి పెన్ పవర్:** వనపర్తి పట్టణంలో ఉన్న కన్నాకాపరమేశ్వరి గుడిని కూల్చుడానికి వచ్చిన నాయకులు ఏ విధంగా ఓట్లడుగుతారు.-బిజెపి అభ్యర్థి బచ్చు సౌజన్య రామ్వనపర్తి మున్సిపాలిటీ లోని 33 వార్డు వల్లబ్ నగర్ బిజెపి అభ్యర్థి బచ్చు సౌజన్య రామ్ వార్డు పర్యటన చేసి ప్రజలను బిజెపి కి ఓటు వేసి గెలిపిస్తే మీ ఇంటికి వచ్చి పని చేస్తా అభివృద్ధి బిజెపితోనే సాధ్యమవుతుంది అని బిజెపి అభ్యర్థి బచ్చు సౌజన్య రామ్ అన్నారు. కాంగ్రెస్ కల్లిబల్లి మాటలు విని వారి మాటలకు ఓటు వేస్తే వారి ఇంటికి వెళ్లి కాంగ్రెస్కు పని చేయాలి గతంలో కూడా ఒకసారి అనుభవం అయింది వారు కాంగ్రెస్ వారు గేటు దగ్గర కూడా రానివ్వరు. ప్రజల యొక్క కష్టసుఖాలను తెలుసుకొని వారికి అండగా ఉంటానని ఈ దేశంలో నరేంద్ర మోడీ చేసిన పథకాలను, భారత దేశ అభివృద్ధిని తెలియ పరచుకుంటూ ఇంటికి ప్రతి ఇంటికి గడప గడపకు తిరుగుతూ ప్రచారం చేయడం జరిగింది. దేశం బాగుండాలంటే బిజెపికి ఓటు వేసి గెలిపించాలని రాబోయే కాలం భారతదేశం మొత్తం బిజెపి కమలం విశ్వసిస్తుందని కాంగ్రెస్ చేసిన మోసపూరిత కుట్రలను తిప్పి కొట్టాలని డబ్బు బలంతో ముందరికి కొస్తున్న అధికార దహనంతోనా ఆరు గారెంటీ అమ్ములు అవ్వకుండా ప్రజలను మభ్యపెట్టి మోసం చేసి ఓట్లు వేసుకోవడానికి వస్తుంది కాబట్టి ప్రజలకు తెలియజేసి వారికి నమ్మొద్దని వారి మాటలు నమ్మొద్దని రేవంత్ రెడ్డి చెప్పిన మాటలు ఒక్కమాట ఒక్కటి కూడా నిజం లేదు కాబట్టి బీజెపి వారికి అవకాశం ఇవ్వకండి బిజెపి బలపరిచిన అభ్యర్థులను కమలం పువ్వుకు ఓటేసి గెలిపించండి అని కోరడం జరిగింది. ప్రజలు కూడా ప్రతి ఒక్కరు ఆదరణతో బిజెపి తప్పకుండా ఓటు వేస్తామని మాట ఇవ్వడం జరుగుతుంది. బిజెపికి ఓటు వేస్తే ప్రశాంతంగా ఉంటామని ప్రజలే తెలియజేస్తున్నారు.

## ఉద్రిక్తత.. రహదారిపై రైతుల ఆందోళన

**సూర్యాపేట, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** మేళ్లచెరువు మండలం కందిబండ గ్రామంలో యూరియా కొరతపై రైతులు ఆందోళనకు దిగారు. కోదాడ-మేళ్లచెరువు రహదారిపై రాస్తారోకో నిర్వహించడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. ఆన్లైన్లో కేవలం మూడు నిమిషాలే స్టాక్ చూపించి యూరియాను మాయం చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుకింగ్ చేసిన ఎరువు రాకపోవడంతో పంటలు యూరియా లేక ఎర్రబడుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం, ఆన్లైన్లో యూరియా బుక్ చేసుకున్న ఇతర మండలాల రైతులు తీసుకువెళ్లడం వల్ల స్థానికులకు సరైన సమయానికి అందించలేకపోతున్నామని తెలిపారు.

## కాపుగల్లు విద్యార్థి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

**తుంగతుర్తి, ఫిబ్రవరి 5 పెన్ పవర్:**సూర్యాపేట జిల్లా కాపుగల్లు గ్రామానికి చెందిన పీఎం శ్రీ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల విద్యార్థి బాలెబోయిన శరత్ కుమార్ నిజామాబాద్లో జరిగే రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీడీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు శరత్ కుమార్ను అభినందించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

## కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం

**హుజూర్నగర్, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ పార్టీ 14వ వార్డు అభ్యర్థి కందుల కోటేశ్వరరావు వార్డులో విస్తృతంగా పర్యటించారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని, తనను గెలిపిస్తే వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలోనే పట్టణ అభివృద్ధి సాధ్యమైందని, ప్రజలు ఈసారి తనకు మద్దతు తెలపాలని కోరారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు.

## అరూర్ గ్రామంలో పాఠశాల ప్రహరి గోడ నిర్మాణం ప్రారంభం

**భువనగిరి, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** యధాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం అరూర్ గ్రామంలోని బీసీ కాలనీలో ప్రాథమిక పాఠశాల వద్ద నూతన ప్రహరి గోడ నిర్మాణాన్ని గ్రామ సర్పంచ్ సుక్క ముత్యాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు బుర్ర నరసింహ, వార్డ్ సభ్యులు రేఖ మచ్చగిరి, వేముల అనిల్, పులగలా మచ్చగిరి, ఆవుల బిక్షం, స్కూల్ హెడ్ మాస్టార్, స్కూల్ చైర్మన్ బొగరం మాధవి, నర్సింహా రెడ్డి, కొడితల కరుణాకర్, భ్రమయ, అంజయ్య, విష్ణుమూర్తి, మధు, శ్రీను తదితరులు పాల్గొన్నారు. ఈ నూతన నిర్మాణం పాఠశాల భద్రతకు దోహదపడుతుందని భావిస్తున్నారు.

## బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న తీన్మార్ మల్లన్న

**ఆలేరు, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం మాదాపూర్ గ్రామంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తన సొంత గ్రామంలోని ఈ జాతరలో పాల్గొన్నారు. ఆయన స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులు, గ్రామ ప్రజలతో ముచ్చటించి వారి సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన కాంగ్రెస్ అధ్యక్షులు రమేష్



**కామారెడ్డి, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఫరీద్ పేట్ గ్రామంలో దేవోల్లా శ్యామల-సురేష్ ల కుమార్తె సంగీత-భానుల వివాహానికి పాల్వంచ మండల కాంగ్రెస్ అధ్యక్షులు పల్లె రమేష్ గౌడ్ గురువారం హాజరయ్యారు. ఆయన నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల సర్పంచులు, వార్డ్ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, మండల నాయకులు, సీనియర్ నాయకులు, గ్రామ నాయకులు, కుల పెద్దలు, బంధుమిత్రులు పాల్గొన్నారు.

## కామారెడ్డిలో ఎన్నికల ప్రచారం: అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యం

**ఎల్లారెడ్డి, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని టేక్రియల్ గ్రామంలో గురువారం మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్యే రమణారెడ్డి, పట్టణ అభివృద్ధి, అవినీతి రహిత పాలన కేవలం బీజేపీతోనే సాధ్యమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ గెలిస్తే భూ కబ్జాలు పెరుగుతాయని ఆయన తెలిపారు. టేక్రియల్ లో బీజేపీ అభ్యర్థి ఎడ్ల జయమ్మకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించి, కేంద్ర నిధులతో పట్టణ రూపురేఖలు మారుస్తామని, జయమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

## కాంగ్రెస్ అభ్యర్థి బిట్ల సురేందర్ కు మద్దతుగా ప్రచారం

**బాన్సువాడ, ఫిబ్రవరి 5 పెన్ పవర్:**బాన్సువాడ మున్సిపాలిటీ 16వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి బిట్ల సురేందర్ కు మద్దతుగా మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నార్ల సురేష్ ఆధ్వర్యంలో నాయకులు ప్రచారం నిర్వహించారు. రుద్రూర్, బోర్లం గ్రామాల నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. చేతి గుర్తుకు ఓటు వేసి అభ్యర్థిని గెలిపించవలసిందిగా వారు ప్రజలను కోరారు.

## కాంగ్రెస్ ప్రచారంలో బాలరాజు, భాస్కర్ రెడ్డి జోరు

**జుక్కల్, ఫిబ్రవరి 5 పెన్ పవర్:**కామారెడ్డి జిల్లా బాన్సువాడ మున్సిపాలిటీ 1వ వార్డులో కాంగ్రెస్ పార్టీ ప్రచారం ఊపందుకుంది. అగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి కలిసి అభ్యర్థి కాసోజు లావణ్య నర్సన్నకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పార్టీ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, కాంగ్రెస్ కు ఓటు వేసి లావణ్య నర్సన్నను గెలిపించాలని కోరారు. నాయకుల రాకతో కార్యకర్తల్లో ఉత్సాహం పెరిగి ప్రచారం వేగవంతమైంది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సీఎం సభ ఎన్నికల కోడ్ ఉల్లంఘన

## మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

**నల్గొండ: పెన్ పవర్:** మిర్యాలగూడలో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించిన సభ పూర్తిగా నీతి మాలిన రాజకీయాలకు నిదర్శనమని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మండిపడ్డారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా, శంకుస్థాపనలు చేస్తూ హడావుడి చేశారని ఆరోపించారు. ఇది స్పష్టమైన కోడ్ ఉల్లంఘన అని, దీనిపై ఎన్నికల కమిషన్ తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం హోదాలో వచ్చి ఒక్క రూపాయి నిధి కూడా ప్రకటించకుండా, అదే చిల్లర మాటలు, అదే భూతులు మాట్లాడి వెళ్లారని విమర్శించారు. మిర్యాలగూడ సభలో తమ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావుపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి రాజకీయాలు మొత్తం డివర్షన్ పాలిటిక్స్ అని, ప్రజలు ఆయన మాటలను అసహ్యించుకుంటున్నారని జగదీష్ రెడ్డి అన్నారు. డైవర్షన్ చేయడంలో రేవంత్ రెడ్డి దిట్ట అని వ్యాఖ్యానించారు. సీఎం మాటలను ఆహా ఓహో అంటూ వత్తాసు పలుకుతూ కొన్ని మీడియా సంస్థలు వార్తలు రాస్తున్నాయని విమర్శించారు. తెలంగాణ చరిత్రలో ఇంత చెత్త ముఖ్యమంత్రి ఎవరూ ఉండరని, రేవంత్ రెడ్డి ఓ పనికిరాని సీఎం అని తీవ్ర వ్యాఖ్యలుద

చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడే రైతు బంధు ఇస్తామని చెప్పడం మోసపూరిత రాజకీయమని ఆరోపించారు. రైతు బంధు అనేది రైతుల హక్కు అని, తప్పనిసరిగా ఇవ్వాల్సిన నిధులను ఇప్పటివరకు మూడు సార్లు ఎగ్గొట్టారని విమర్శించారు. మున్సిపల్ ఎన్నికలు ఉన్నాయనే కారణంతోనే మరోసారి రైతులను మభ్యపెట్టేందుకు రైతు బంధు ఇస్తామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారని ఆరోపించారు. ఇవన్నీ మోసపు మాటలేనని, ప్రజలు అన్నీ గమనిస్తున్నారని చెప్పారు. రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో రేవంత్ రెడ్డికి చెప్పుతో కొట్టినట్టు సమాధానం ఇవ్వాలని ప్రజలకు జగదీష్ రెడ్డి పిలుపునిచ్చారు.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఆందోల్ జోగిపేట్ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం:



**ఆందోల్, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** ఆందోల్ జోగిపేట్ మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని మండల బీఆర్ఎస్ యువజన నాయకుడు మిద్దెల శ్రీధర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా 20వ వార్డు అభ్యర్థి డి.బి. నాగభూషణంకు మద్దతుగా ప్రచారం చేస్తూ, బీసీ సామాజిక వర్గానికి చెందిన, ఉద్యమ చరిత్ర ఉండి, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సేవలు చేసిన అనుభవం ఉన్న నాగభూషణంను గెలిపించి జోగిపేట్ అభివృద్ధికి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. ఈ ప్రచారంలో బత్తుల వీరప్పతో పాటు బీఆర్ఎస్ శ్రేణులు భారీగా పాల్గొన్నారు.

## రాజంపేట 15వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి సుష్మిత ప్రచారానికి భారీ స్పందన

**నారాయణఖేడ్, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** సంగారెడ్డిలోని రాజంపేట 15వ వార్డులో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి ధర్నారం సుష్మిత ప్రశాంత్ కుమార్ భారీ ఎత్తున ప్రజలు, కార్యకర్తలతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాలనీవాసుల సమస్యలను వెంటనే పరిష్కరించడమే తన లక్ష్యమని తెలిపారు. ఈ ప్రచారంలో కంబాలపల్లి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ రాజు, ఎంఆర్ఎఫ్ శ్రీనివాస్, వాడు ఇంచార్జ్ అశోక్ గౌడ్, ఉపసర్పంచ్ ప్రకాశం, ఆగమయ్య, నాయకులు మజీద్, రఫీ, షఫీ, బిక్షపతి గౌడ్, ఆంజనేయులు గౌడ్, మైనార్టీ మహిళలు, రాజంపేట ప్రజలు పాల్గొన్నారు. కాలనీవాసుల మద్దతు కూడా లభించింది.

## సింగితం దర్గా ఉత్సవానికి భారీగా తరలివస్తున్న భక్తులు

**పటాన్‌చెరు, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని సింగితం గ్రామ శివారులో గల సుల్తాన్ హైమద్ దర్గా వద్ద రాత్రి 8 గంటలకు ఊరు గ్రంధం నిర్వహించబడుతుంది. వివిధ గ్రామాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఐ.శ్రావణి నిరంజన్ మాట్లాడుతూ, ఈ ఉత్సవానికి వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారని తెలిపారు.

## కల్వకుర్తిలో కాంగ్రెస్ ప్రచారం:

## ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించిన అభ్యర్థి కుమార్తెలు



**కల్వకుర్తి, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి బృంగిత్నమాల ఆనంద్ కుమార్ల కుమార్తెలు నికిత, అక్షర ఇంటింటికీ తిరుగుతూ కాంగ్రెస్ పార్టీకి చేతు గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ గోరటి శ్రీనివాసులు, రావుల చెన్నకేశవులు, సామ బంగారయ్య, బీస హుస్సేన్, అంజన్ కుమార్, సామ కిరణ్, కొప్పుల బాలస్వామి, సామ గణేష్ తో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సంఘటన నాగర్ కర్నూల్ జిల్లా, కల్వకుర్తిలో జరిగింది.

## వెంకటేష్ శ్వేతా గౌడ్ మహిళలతో కలిసి ప్రచారం

**నారాయణపేట, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** నారాయణపేట మున్సిపాలిటీ ఎన్నికల నేపథ్యంలో, 20వ వార్డు నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెంకటేష్ శ్వేతా గౌడ్, మహిళలను కలుపుకొని భారీ ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నారు. 'ఆదరించండి, అభివృద్ధి చేస్తాను' అనే నినాదంతో, గెలిస్తే వార్డును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానని, ప్రజల సమస్యల పరిష్కారానికి ముందుంటానని ఆమె హామీ ఇస్తున్నారు. మహిళలు కూడా పెద్ద ఎత్తున ఆమె ప్రచారంలో పాల్గొంటున్నారు.

## జోగులాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయానికి జనసేన నేత తనీష్ అల్లాడి

**అలంపూర్, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** అలంపూర్ పట్టణంలో వెలిసిన 5వ శక్తి పీఠమైన శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర ఉభయ ఆలయాలను జనసేన పార్టీ రాష్ట్ర స్థాయి క్యాంపెయినర్ తనీష్ అల్లాడి దర్శించుకున్నారు. ఆలయ అధికారులచే ఆయనకు ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా ఆయనతో పాటు జనసేన పార్టీ ఒకటో, ఐదో వార్డ్ అభ్యర్థులు కూడా ఉన్నారు. దర్శనం అనంతరం, ఆయన ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో జనసైనికులు పాల్గొన్నారు.

# ప్రధానపార్టీలకు రెబల్స్ టెన్షన్



**అదిలాబాద్, ఫిబ్రవరి 5, పెన్ పవర్:** మంచిర్యాల జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు అభ్యర్థుల్లో వేడిని రేకెత్తిస్తున్నాయి. జిల్లాలోని కార్పొరేషన్ తో పాటు నాలుగు మున్సిపాలిటీల్లోని 149 వార్డులకు 1061 మంది అభ్యర్థుల లో 368 మంది విత్ డ్రా కాగా693 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. మరోవైపు ఇండిపెండెంట్ల రూపంలో ప్రధాన పార్టీలకు రెబల్స్ బెడద ఎక్కువగా ఉండటంతో ఒకింత ఆందోళనకు గురవుతున్నారు. ఓట్లు చీల్చితే ఇతరులకు లబ్ధి చేకూరే అవకాశం ఉండటం తో రాత్రిళ్లు రెబల్స్‌ను బుజ్జగించి తమకు సపో ర్టు చేయమని బతిమిలాడుతున్నారు. జిల్లాలోని మంచిర్యాల కార్పొరేషన్, బెల్లంపల్లి, చెన్నూర్, క్యాతనపల్లి, లక్షెట్టిపేట మున్సి పాలిటీల్లోని 149స్థానాలకు 1061 మంది అభ్యర్థులు 1177 నామినేషన్లు ఆమోదం పొం దాయి. మంగళ వారం బీ ఫారంల అందజేత, విత్ డ్రాల అనంతరం ప్రధాన పార్టీల నుంచి రెబల్ గా వేసిన అభ్యర్థులు, బీ ఫారంలు ఇవ్వనిఅభ్యర్థులంతా ఇండిపెండెంట్లుగా బరి లో ఉన్నారు. ఇండిపెండెంట్ల సంఖ్య 135 నుంచి 168 (మంచిర్యాలలో 18 మంది, బెల్లంపల్లిలో 66, చెన్నూర్ లో 38, క్యాతనపల్లిలో 35, లక్షెట్టిపేటలో 11) కి పెరిగింది.ఈ ఎన్నికలలో రెబల్స్ ప్రభావం అధికార పార్టీ అభ్య ర్థులపైన పడే అవకాశం ఎక్కువ ఉండనుందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కార్పోరేషన్, మున్సిపాలిటీల్లో కాం గ్రెస్ నుంచి 148 మంది, బీఆర్ఎస్‌నుంచి 139 మంది, బీజేపీ నుంచి 132, ఆల్ ఇండియా ఫార్వర్డ్ పార్టీ (ఏఐఎఫ్బీ) నుంచి 28, బీఎస్పీ నుంచి 18, సీపీఐ నుంచి 17, జనసేన పార్టీ నుంచి 16,ఆప్ నుంచి తొమ్మిది, సీపీఎం నుంచి ఆరుగురు,ఏఐఎంఎం నుంచి నలుగురు, ఇతర గుర్తింపు పొందిన పార్టీల నుంచి ఎనిమిది మంది పోటీ చేస్తుండగా ఇం డిపెండెంట్లు 168 మంది బరిలో నిలబడ్డారు. మంచిర్యాలలో 60 డివిజన్‌లు ఉండగా కేవ లం 18 మంది ఇండిపెండెంట్లుగా పోటీ చేస్తుండగా బెల్లంపల్లిలో అత్యధికంగా 66 మంది, చెన్నూర్‌లో 38, క్యాతనపల్లిలో 35, లక్షెట్టిపేటలో 11 మంది పోటీపడుతున్నారు.మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్లకు 362మంది నామినేషన్లు వేసి 122 మంది విత్ డ్రా చేసుకోగా 240 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ నుంచి 59 మంది, బీఆర్ఎస్ నుంచి 58, బీజేపీ నుంచి 58, ఆప్ నుంచి 8 మంది, బీఎస్పీ నుంచిఏడుగురు, ఏఐఎంఎం నుంచి రెండు, సీపీఎం నుంచి రెండు, ఏఐఎఫ్బీ నుంచి 18, సీపీఐ నుంచి ఒకరు, జనసేన నుంచి నలుగురు, ఇత ర గుర్తింపు పొందిన పార్టీల నుంచి ఐదుగు రు, ఇండిపెండెంట్లు 18 మందిఅభ్యర్థులు పోటీలో ఉన్నారు.బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 34 వార్డులకు 252 మంది అభ్యర్థులు నామినేషన్ వేసి 79 మంది విత్ డ్రా అయ్యారు. ప్రస్తుతం పోటీలో 173 మంది ఉన్నారు. కాంగ్రెస్ నుంచి 34 మంది అభ్యర్థులు, బీఆర్ఎస్ నుంచి 34, బీజేపీ నుంచి 20, బీఎస్పీ నుంచి ఆరుగురు, ఏఐఎంఎం నుంచి ఇద్దరు, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్బీ) నుంచి ఒకరు, సీపీఐ నుంచి ఆరుగురు, జనసేన నుంచిఒక్కరు, ఇతర గుర్తింపు పొందిన పార్టీల నుంచి ముగ్గురు, ఇండిపెండెంట్లు 66 మంది బరిలో ఉండగా చెన్నూర్ మున్సిపాలిటీ పరిధిలోని 18 వార్డులకు 154 మంది అభ్యర్థుల నామినేషన్లు వేయగా 47 మందిఉపసంహరించుకోవడంతో 107 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.కాంగ్రెస్ నుంచి 18 మంది అభ్యర్థులు, బీఆర్ఎస్ నుం చి 18, బీజేపీ నుంచి 18, బీఎస్పీ నుంచి ఒకరు, సీపీఎం నుంచి ఒకరు, ఆల్ ఇండియాఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్బీ) నుంచి ఐదుగురు, సీపీఐ నుంచి ముగ్గురు, జనసేన నుంచి నలుగురు, ఆప్ నుంచి ఒకరు, ఇండిపెండెంట్లు 38 మం ది పోటీలో ఉన్నారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలోని 22 వార్డులకు 193 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసి ఇందులో 80 మంది విత్ డ్రా కాగా 113 మంది పోటీలో ఉన్నారు.ఇందులో కాంగ్రెస్ నుంచి 22 మం ది, బీఆర్ఎస్ నుంచి 15, బీజేపీ నుంచి 22, బీఎస్పీ నుంచి ఇద్దరు,ఏఐఎంఎం నుంచి రెండు, సీపీఎం నుంచి ఇద్దరు, ఏఐఎఫ్బీ నుంచి నలుగురు, సీపీఐ నుంచి ఏడుగురు, జనసేన నుంచి నలుగురు, ఇండిపెండెంట్లు 35 మంది అభ్యర్థులు, లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని 15వార్డులకు వంద మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా ఇందులో 40 మంది ఉపసంహరించుకోవడంతో 60 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు.కాంగ్రె స్ నుంచి 15 మంది, బీఆర్ఎస్ నుంచి 14, బీజేపీ నుంచి14, బీఎస్పీ నుంచి ఇద్దరు, ఏఐఎంఎం నుంచి రెండు, సీపీఎం నుంచి ఒకరు, జనసేన నుంచి ముగ్గురు, ఇండిపెండెంట్లు 11 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు.

# బియ్యానికి రాని టెండర్లు...

### గొడన్లలో 24 లక్షల టన్నులు.. త్వరలో మరో 12 లక్షల టన్నులు..

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, పెన్ పవర్:** దొడ్డుబియ్యం వదిలించుకునేందుకు పౌరసరఫరాల శాఖ మల్లగుల్లాలు పడుతోంది. ఇప్ప టికే మూడేండ్లుగా మూలుగుతున్న 1.5 లక్షల టన్నుల దొడ్డు బియ్యాన్ని ఎలాగైనా వదిలించుకుందామని చూసేంతలో.. మరో24 లక్షల టన్నుల దొడ్డు బియ్యం క్యూలో ఉన్నాయి. ఇదీ కాకుండా.. వచ్చే ఏప్రిల్‌లో మరో 12 లక్ష ల టన్నుల దొడ్డు బియ్యం రానున్నాయి.. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకుంటే.. నష్టం మా ట అటుంచితే..అసలుకే మోసం వచ్చే పరిస్థితి కనపడుతోంది.దీంతో పౌర సరఫరాల విభా గం ఎలాగైనా ఈ దొడ్డురకం బియ్యం ఇబ్బందులను అధిగమించాలనే ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. తక్కువ నష్టంతో అయినాఫరవాలేదు.. పూర్తిగా నష్టపోకుండా చూసుకుంటే అదే పదివేలు అనే పరిస్థితి నెలకొంది. దీనిపైనే మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తీవ్ర ఆలోచన చేస్తున్నారు. అటు ప్రజాధనాన్ని నష్టపోకుండా.. ఇటు సర్కారుకు భారం కాకుండా.. వీలైనంత తక్కువ నష్టంతో బయటపడే మార్గాలను మంత్రి ఉన్నతాధికారులతో సమాలోచనలు చేస్తున్నారు.గడిచిన మూడేండ్లుగా 1.5 లక్షల టన్నుల దొడ్డు రకం బియ్యం గోదాముల్లో మూలుగుతున్నాయి.ప్రజలకు పూర్తిగా సన్నరకం బియ్యం అందిస్తున్న నేపథ్యంలో.. రాష్ట్రంలోని రైతుల నుంచి సేకరించిన దొడ్డురకం ధాన్యా న్ని మిల్లింగు చేసిన తరువాత.. సెంట్రల్ కోటా కింద ఎఫ్‌సీఐకి బియ్యం ఇచ్చిన తరువాత కూడా1.5 లక్షల టన్నుల దొడ్డు బియ్యం మిగిలాయి. వాస్తవానికి మొత్తం ఖర్చు చూసుకుం టే.. కిలో రూ. 36.50 పైసలు పడింది.అయితే, మూడేండ్ల నుంచి కిరాయి చెల్లించి.. వీటిని గోదాముల్లో రక్షిస్తున్నారు. కొంతమొ త్తం రేషన్ డీలర్ల వద్ద, ఎంఎల్ఎస్ పాయింట్ల వద్ద ఉన్నాయి. మూడేండ్లుగా అలాగే ఉండటంతో ఇందులో సుమారు 15 నుంచి 20 వేల టన్నుల బియ్యం ఇప్పటికే ఎలుకలు, పందికొక్కులు బారినపడి, అలాగేముక్కిపోయినట్టుగా అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మిగతావికూడా ఎందుకూ పనికిరానివిగా మారకముందే.. ఏదో ఒక ధర కు విక్రయిస్తే.. తక్కువ నష్టంతో బయటపడవచ్చనే ఆలోచనతో రాష్ట్రప్రభుత్వం కిలో రూ. 24 చొప్పున టెండర్ పిలిచింది.అయితే దీనికి కూడా ప్రైవేటు వ్యాపారస్తులు స్పందించలేదు. అంత ధర తాము పెట్టలేమని ముందుకు రాలేదు. దీనితో ఇప్పుడు మరో రూ. 2 తగ్గిం చి.. కిలోకు రూ.22తో టెండర్లు పిలవడానికి ప్రయత్నాలు మొదలెట్టింది. మొత్తంగా చూసుకుంటే.. 1.5 లక్షల టన్నుల బియ్యంను రూ. 22 తో అమ్మివేస్తే (రూ. 36.50 పైసలకు కిలో చొప్పున కొనుగోలు చేశారు) ఎంతలేదన్నా సుమారు రూ. 180 నుంచి రూ. 200 కోట్ల వరకు ప్రభుత్వానికి నష్టం వాటిల్లుతుంది.అయితే, ఈ నష్టం గురించి ఆలోచిస్తూ.. మరిం త జాప్యం చేస్తే.. మొత్తం బియ్యమే పనికిరాకుండాపోయే ప్రమాదం ఉంది.అలా జరిగితే మొత్తం బియ్యాన్ని సముద్రంలో పారబోయాల్సిందే గానీ.. ఎవరు రూపాయికి కూడా కొన రు. దానికంటే.. రూ. 200 కోట్ల నష్టంతోనైనా ఈ బియ్యాన్ని అమ్మివేయడమే లాభదాయకమని ప్రభుత్వంభావిస్తోంది. మూడేండ్ల కిందటి దొడ్డు బియ్యం పరిస్థితి ఇలా ఉంటే.. మరో ప్రమాదం సివిల్ సప్లై శాఖను వేధిస్తోంది. గడిచిన రెండు సీజన్లలోనూ రైతుల పండించిన దొడ్డురకం ధాన్యా న్ని కొనుగోలు చేసిన సివిల్ సప్లవిభాగం.. కేంద్రం కోటా కింద ఎఫ్‌సీఐకి పంపించాల్సిన బియ్యాన్ని పంపించింది. అయినా.. ఒక్కో సీజన్‌లో సుమారు 12 లక్షల టన్నుల దొడ్డు బియ్యం అలాగే ఉన్నాయి. అంటే మొత్తం 24 లక్షల టన్నుల దొడ్డుబియ్యం గోదాముల్లో రెడీగా ఉన్నాయి. వాటి పరిస్థితి ఏంటనే ప్రశ్నకూడా ఉదయిస్తోంది.దీనిగురించి ఆలోచి స్తుండగానే.. ఈ ఏప్రిల్‌లో.. (ఈ రబీ పంట) మరో 12 లక్షల టన్నుల దొడ్డు బియ్యం రానున్నాయి. అంటే..ఏప్రిల్–మే నాటికి మొత్తం 36 లక్షల టన్నుల దొడ్డు బియ్యం అందుబాటులో ఉండనున్నాయి. మూడేండ్ల కిందటి 1.5 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని వదిలించుకోవ డానికే నానా తంటాలు పడుతున్నపౌరసరఫరాల శాఖ.. రాబోయే నాలుగై దు నెలల్లో 36 లక్షల టన్నుల దొడ్డు బియ్యా న్ని ఏం చేయాలనేది ఇప్పటి నుంచే తొలుస్తున్న ప్రశ్న.ఇప్పటి వరకు పరిస్థితిని పరిశీలిస్తే.. 1.5 లక్షల టన్నుల దొడ్డు బియ్యాన్ని

రూ. 22లకే అమ్మితే.. సుమారు రూ. 200 కోట్ల నష్టం వస్తుంది. అదే విధంగా 36 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని కూడా అమ్మితే మొత్తం సుమారు రూ. 7000 కోట్ల నష్టం వస్తుందని అధికారులు అంచనావేస్తున్నారు. రైతుల నుంచి దొడ్డు రకం ధాన్యం కొనుగోలు చేసి, మిల్లింగ్ చేసి, గోదాములకు తరలించే వరకు ఒక్కో కిలోకు రూ. 36.50 పైసలు ఖర్చు అవుతుంది. అవే దొడ్డు బియ్యా న్ని కిలోకు రూ. 22 లకేఅమ్మివేస్తే.. ఎంత లేదన్నా సుమారు రూ. 5000 కోట్లు నష్టపోయినట్టే. దీనితోపాటు వడ్డీ నష్టం కూడా సుమారు రూ. 1000 కోట్ల వరకు ఉంటుంది. వీటన్నింటినీ అమ్మకం పూర్తయి కొనుగోలు చేసినవారు తీసుకెళ్లే

వరకు గోదాములకు కిరాయి రూపంలో మరో రూ. 350 కోట్ల వరకు ఖర్చవుతుంది. అంటే ఏతావాతా చూసుకుంటే.. మొత్తం సుమారు రూ. 7000 కోట్ల నష్టం వాటిల్లక తప్పని పరిస్థితే కనపడుతోంది. అందుకుప్రభుత్వం సిద్ధంగా ఉండకతప్పదు. ఎందుకంటే.. ఏమాత్రం ఆలస్యం చేసినా.. ఇవన్నీ ముక్కిపోయి.. పనికిరాకుండా పోతే.. మొత్తానికి మొత్తమే మునిగిపోయే పరిస్థితి తలెత్తు తుంది. రూ.7వేల కోట్ల నష్టాన్ని భరిస్తే..

ఇం కో రూ. 7 వేల నుంచి రూ. 8 వేల కోట్లన్నా వస్తాయి. లేదంటే.. మొత్తం సుమారు రూ. 14 వేల నుంచి రూ. 15 వేల కోట్లు మొత్తం మునిగిపోక తప్పదు.ప్రస్తుతం మన రాష్ట్రంతో పాటు.. పక్క రాష్ట్రాల్లో.. సమీపదేశాల్లోనూ దొడ్డు బియ్యానికి డిమాండ్ లేదు. మన రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం సన్నబియ్యమే రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేస్తోంది. ఇక సంక్షేమ హాస్టళ్లలోనూ సరేసరి సన్నబియ్యంతోనే భోజనాలు పెడుతున్నారు.

ఈ నేపథ్యంలో రాష్ట్ర రైతాంగం సన్న రకం ధాన్యం పండించే దిశగా కొంతమేర మళ్లినప్పటికీ.. పూర్తిగా ఇంకా మరలలేదు. దీనితో ప్రతి సీజన్‌లోనూ వస్తున్న దొడ్డు రకం ధాన్యాన్ని ప్రభుత్వం కొనకతప్పని పరిస్థితినెలకొంది.సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 బోనస్‌ను ప్రభుత్వం ఇస్తోంది. దీనితో సుమారు 8 జిల్లాల్లో ఎక్కువ మంది రైతులు సన్నరకం ధాన్యం వైపు మళ్లారు. మిగిలిన జిల్లాల్లోనూ రైతాంగాన్ని దొడ్డురకం నుంచి సన్నరకం ధాన్యం వైపు మళ్లించాల్సిన అవసరం ఉంది. ఇలా ప్రతియేటా నష్టపోయేకన్నా.. అసలు రైతాంగానికి అవగా హన కల్పించి.. వారిని దొడ్డు ధాన్యం నుంచి సన్న ధాన్యం దిశగా మళ్లిస్తే అందరికీమంచిదనే ఆలోచనలో పౌరసరఫ రాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉన్నట్టు సమాచారం.

# ఫోన్ ట్యాపింగ్ కేసు నెక్స్ట్ ఏంటీ...



**హైదరాబాద్, ఫిబ్రవరి 5, పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసు ఇప్పుడు నిర్ణయాత్మక దశకు చేరుకుంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను సిట్ అధికారులు సుదీర్ఘంగా విచారించడంతో ఈ కేసులో ప్రధాన అంకం ముగిసింది. తర్వాత సిట్ ఏమి చేయబోతోందన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. కానీ సిట్ కు అసలు సవాల్ ఇప్పుడే ప్రారంభమైందన్న భావన వినిపిస్తోంది. ఆదివారం కేసీఆర్ నివాసంలో సుమారు ఐదు గంటల పాటుసాగిన సిట్ విచారణ ఈ కేసులో కీలక మలుపు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం తన ప్రభుత్వానికి తెలియకుండానే జరిగిందని, చట్టబద్ధమైన నిఘాకు, అక్రమ ట్యాపింగ్‌కు తేడా ఉందని కేసీఆర్ వాదించినట్లు తెలుస్తోంది.అయితే, సిట్ అధికారులు ఆయన ముందు ఉంచిన సాంకేతిక ఆధారాలు ఈ కేసును మరింత ఆసక్తికరంగా మార్చినట్లుగా చెబుతున్నారు. ముఖ్యంగా ప్రభాకర్ రావు వంటి అధికారుల పునర్నియామకం , రాజకీయనేతలతో పాటు న్యాయమూర్తులు, వ్యాపారులు.. హరీష్ రావు ఫోన్లు ట్యాప్ చేయడంపై అధికారులు సంధించిన ప్రశ్నలకు సంధించినట్లుగా చెబుతున్నారు.ఈ కేసు కేవలం రాజకీయ నిఘాకే పరిమితం కాలేదనేదిసిట్ అధికారుల ప్రధాన ఆరోపణ. ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని ఆసరాగా చేసుకుని కొందరు పారిశ్రామికవేత్తలను భయపెట్టి భారీగా వసూళ్లకు పాల్పడ్డారని, ఇందులో ఒక పోలీస్ మాఫియా పనిచేసిందనిదర్యాప్తులో వెల్లడైంది. బీఆర్ఎస్ పార్టీకి వచ్చిన ఎలక్టోరల్ బాండ్ల విరాళాలకు, ఈ ట్యాపింగ్ బెదిరింపులకు ఏమైనా సంబంధం ఉందా అనే కోణంలో సిట్ ఆరా తీస్తోంది. రాజకీయ అధికారాన్ని ఉపయోగించి వ్యక్తిగతగోప్యతను హరించడమే కాకుండా, దాన్ని ధనార్జనకు వాడుకోవడం ఈ కేసులో అత్యంత తీవ్రమైన అంశం. దర్యాప్తు అధికారుల ముందున్న అతిపెద్ద సవాల్.. ధ్వంసమైన ఆధారాలను పునరుద్ధరించడం. నిందితులు హార్డ్‌డిస్క్‌లను మూసీ నదిలో పడేయడం, కీలక డేటాను డిలీట్ చేయడం ద్వారా కుట్రను కప్పిపుచ్చే ప్రయత్నం చేశారని ఇప్పటికే గుర్తించారు. తాజాగా అందిన ఫోరెన్సిక్ నివేదికలు. క్లౌడ్ డేటా రికవరీ ద్వారా సిట్ కొన్ని కీలక ఫైళ్లను వెలికి తీసినట్లుగా చెబుతున్నారు. ఈ సాంకేతిక ఆధారాలను కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు వంటి నేతల వాంగ్మూలాలతో సరిపోల్చి పక్కాగా చార్జిషీట్ రూపొందించాలని సిట్ భావిస్తోంది.న్యాయస్థానంలోకేవలం నిందితులు లేదా సాక్షుల వాంగ్మూలాలు నిలబడవు. టెలిగ్రాఫ్ చట్టం, టీ చట్టాల ప్రకారం నిబంధనలు ఎలా ఉల్లంఘించారో శాస్త్రీయంగా నిరూపించాల్సి ఉంటుంది. ఎవరి అనుమతితో ట్యాపింగ్ జరిగింది.. అనుమతి లేని నంబర్లను ఎందుకు మానిటర్ చేశారు అనే ప్రశ్నలకు సిట్ ఇచ్చే సమాధానాలే ఈ కేసు భవితవ్యాన్ని నిర్ణయిస్తాయి. ఇప్పటికే ఆరుగురు అధికారులపై మొదటి చార్జిషీట్ దాఖలు చేసిన పోలీసులు, ఇప్పుడు కుట్ర' కోణంలో సప్లిమెంటరీ చార్జిషీట్ వేయనున్నారు. ఇందులో కేసీఆర్ పేరును నిందితుడు గా చేరుస్తారా లేక సాక్షి గా ఉంచుతారా అన్నది సర్వత్రా ఉత్కంఠ రేపుతోంది. ఒకవేళ నేరపూరిత కుట్రలో ఆయన ప్రమేయం ఉందని ఆధారాలు దొరికితే, అరెస్టుల పర్వం మళ్లీ మొదలయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# రెండో దశ మెట్రో పై బిగ్ అప్ డేట్



**హైదరాబాద్, ఫిబ్రవరి 5, పెన్ పవర్:** హైదరాబాద్ నగరవాసులకు మెట్రో గుడ్‌న్యూస్ చెప్పింది. రెండో విడత విస్తరణకు సంబంధించి కీలక అప్‌డేట్ ఇచ్చింది. మొత్తం ఐదు కారిడార్లలో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో రైలు మార్గాలను నిర్మించనున్నారు. నాగోల్–శంషాబాద్.. రాయదుర్గం–నియోపోలిస్.. ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట.. మియాపూర్–పటాన్‌చెరు.. ఎల్బీ నగర్–హయత్ నగర్ మార్గాల్లో మెట్రో అందుబాటులోకి రానుంది. ఈ ప్రాజెక్టుకు రూ.24,269 కోట్ల అంచనా వ్యయం అవుతుందని భావిస్తున్నారు. హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా.. దాని వల్ల పెరుగుతున్న ట్రాఫిక్‌ను పెరగకుండా ఉంచేందుకు ఈ మెట్రో రెండో దశ విస్తరణ చాలా కీలకంకానుంది.హైదరాబాద్ మెట్రో ఫేజ్–2పై బిగ్ అప్‌డేట్ వచ్చింది. మెట్రో విస్తరణలో భాగంగా రెండో దశలో మొత్తం 76.4 కిలోమీటర్ల మేర కొత్త మార్గం నిర్మించనున్నారు.

హైదరాబాద్ నగరవాసులకు మరింత సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడంతోపాటు.. నగరంలోని మరిన్ని ప్రాంతాలకు మెట్రో రైలును విస్తరించేందుకు ఈ హైదరాబాద్ మెట్రో ఫేజ్–2ను ఏర్పాటు చేయనున్నారు. ఈ మెట్రో విస్తరణ జరిగితే.. లక్షలాదిమంది నగరవాసుల ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. మెట్రో ఫేజ్–2కు సంబంధించి హైదరాబాద్ మెట్రో రైల్ కార్పొరేషన్ తాజాగా ఒక ప్రకటనను రిలీజ్ చేసింది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.24,269 కోట్ల ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ హైదరాబాద్ మెట్రో ఫేజ్–2లో భాగంగా కొత్తగా మరో 76.4 కిలోమీటర్ల మేర మెట్రో మార్గాలు ఏర్పాటు కానున్నాయి. ఇక ఈ మెట్రో ఫేజ్–2 నిర్మాణానికి ఇప్పటికే తెలంగాణ సర్కార్.. పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. అంతేకాకుండా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అన్ని వివరాలతో కూడిన రిపోర్ట్‌ను కూడా ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి పంపించారు. ఇక ఈ మెట్రో ఫేజ్–2 నిర్మాణం కోసం కావాల్సిన 2787 ఎకరాల భూమిని సేకరించేందుకు ఈ ఏడాది జనవరిలోనే రాష్ట్ర మంత్రివర్గం భారీగా నిధులు కూడా మంజూరు చేసింది.నాగోల్–శంషాబాద్ కారిడార్మరోవైపు.. ఈ రెండో దశలో 5 కొత్త కారిడార్లను ఏర్పాటు చేయనున్నారు. నాగోల్ నుంచి శంషాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు వరకు 36.6 కిలోమీటర్ల మేర కొత్తగా మెట్రో రైలు పరుగులు తీయనుంది. ఈ మార్గంలో24 స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఎయిర్‌పోర్ట్‌కు వెళ్లే ప్రయాణికులు.. రోడ్లపై ఉండే ట్రాఫిక్ భయం లేకుండా మెట్రోలోనే ఎయిర్‌పోర్టుకు చేరుకునే అవకాశం ఉంటుంది. ఈ నాగోల్–శంషాబాద్ ఎయిర్‌పోర్టు మార్గంలో ఎక్కువ భాగం ఎలివేటెడ్ మార్గాన్నే నిర్మించనుండగా.. కొంత భాగం భూగర్భంలో 1.6 కిలోమీటర్ల మేర నిర్మించనున్నారు.రాయదుర్గం–కోకాపేట్ నియోపోలిస్ కారిడార్ మరోవైపు.. రాయదుర్గం నుంచి కోకాపేట్ నియోపోలిస్ వరకు మరో కారిడార్‌ను ఏర్పాటు చేయనున్నారు. 11.6 కిలోమీటర్ల ఈ మార్గంలో మొత్తం 8 స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఈ రాయదుర్గం– కోకాపేట్‌నియోపోలిస్ కారిడార్ నిర్మాణం పూర్తి అయితే.. ఐటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వారికి భారీ ఉపశమనం కలగనుంది. ఈ ప్రాంతాల్లో ఆఫీసులు ఉన్నవారికి.. మెట్రో అందుబాటులోకి వస్తే ప్రయాణ సమయం భారీగా తగ్గనుంది.ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట కారిడార్ఇక మరో కారిడార్‌లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చంద్రాయణగుట్ట వరకు మెట్రో విస్తరణ చేయనున్నారు. 7.5 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ మార్గంలో 6 మెట్రో స్టేషన్లు ఉండనున్నాయి. ఈ మార్గం పూర్తి అయితేపాతబస్తీలో ఉన్న ప్రాంతాలకు కూడా మెరుగైన మెట్రో కనెక్టివిటీ అందుబాటులోకి వస్తుంది.మియాపూర్–పటాన్‌చెరు కారిడార్‌వీటితోపాటు.. మియాపూర్ నుంచి పటాన్‌చెరు వరకు మరో కారిడార్‌ను విస్తరించనున్నారు. 13.4 కిలోమీటర్ల మేర ఉండే ఈ కారిడార్‌లో 10 మెట్రో స్టేషన్లను నిర్మించనున్నారు. ముంబై హైవేపై ఇప్పటికే ఉన్ననాగోల్–మియాపూర్ రెడ్ లైన్ మార్గాన్ని మరింత దూరం విస్తరించనున్నారు.ఎల్‌బీ నగర్–హయత్‌నగర్ కారిడార్ ఎల్‌బీ నగర్ నుంచి హయత్‌నగర్ వరకు రెండో దశ మెట్రో విస్తరణలో భాగంగా మరో కారిడార్ అందుబాటులోకి రానున్నాయి. 7.1 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ కారిడార్‌లో 6 స్టేషన్లను నిర్మించనున్నారు.మియాపూర్–ఎల్బీ నగర్ రెడ్ లైన్ మార్గాన్ని మరింత విస్తరించి.. విజయవాడ హైవేపై ఈ ఎల్బీనగర్–హయత్‌నగర్ కారిడార్ ఏర్పాటు కానుంది. ఈ 5 కారిడార్లలో మెట్రో అందుబాటులోకి వస్తే.. రోడ్లపై వాహనాల రద్దీ భారీగా తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మెట్రో రెండో దశ ప్రాజెక్టు పూర్తయి.. హైదరాబాద్ శివార్ల వరకు కూడా కనెక్టివిటీ జరిగితే.. ఆయా ప్రాంతాల్లో నివసించే మధ్యతరగతి ఉద్యోగులకు భారీగా ప్రయోజనం కలగనుంది.

## న్యాయవాది స్వప్న హత్యకు నిరసనగా విధుల బహిష్కరణ

**పాలకుర్తి, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** మొయినాబాద్‌లో న్యాయవాది స్వప్న దారుణ హత్యను నిరసిస్తూ వరంగల్ జిల్లా నర్సంపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులను బహిష్కరించారు. కోర్టు పనులకు దూరంగా ఉండి, నల్ల బ్యాడ్జీలు ధరించి తమ నిరసన తెలిపారు. న్యాయవాదులకే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తూ, స్వప్నను హత్య చేసిన నిందితులను తక్షణమే పట్టుకుని శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## మేడారం హుండీల లెక్కింపు ప్రారంభం

**వర్ధన్నపేట, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** హనుమకొండలోని టీటీడీ కళ్యాణ మండపంలో మేడారం హుండీల లెక్కింపు సోమవారం ప్రారంభమైంది. మంత్రి కొండా సురేఖ ఈ లెక్కింపును ప్రారంభించారు. దేవాదాయ శాఖ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థ కార్యకర్తలు 500 మంది ఆధ్వర్యంలో 788 హుండీలలోని కానుకలను లెక్కిస్తున్నారు. గత జాతరలో 540 హుండీలలో 13.25 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ లెక్కింపు సుమారు 10 రోజుల పాటు జరిగే అవకాశం ఉంది.

## సంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం

**జహీరాబాద్, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** జహీరాబాద్ మండల పరిధిలోని రాయిపల్లి చౌరస్తా వద్ద గురువారం ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. తెలంగాణ ఆర్టీసీ బస్సు, కర్ణాటక ఆర్టీసీకి చెందిన రెండు బస్సులు, ఒక డీసీఎం వాహనం ఒకదానికొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన కారణంగా కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

## కోదాడ 31వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి గా కుసుమ కుమారి ఎన్నిక



**కోదాడ, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** కోదాడ మున్సిపాలిటీ 31వ వార్డు కౌన్సిలర్ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఎర్నేని కుసుమ కుమారి (బాబు) ఏకగ్రీవం గా ఎన్నిక కావడంతో కోదాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పందిరి నాగిరెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. గురువారం కోదాడలోని కుసుమ కుమారి స్వగృహంలో నాగిరెడ్డి, యం యస్ విద్యా సంస్థల సీ ఈ వో యస్ యస్ రావు ఆమెను శాలువాతో సన్మానించి, బొకే, స్వీట్స్ అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా నాయకులు బానోతు బాబు నాయక్ కూడా పాల్గొన్నారు.

## వివాహిత సుభాషిణి ఆత్మహత్య

**మేడ్చల్, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్ఎన్ నగర్ కాలనీలో వివాహిత సుభాషిణి ఆత్మహత్య చేసుకున్న ఘటన తీవ్ర విషాదాన్ని కలిగించింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని, అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## అలంపూర్ లో జనసేన అభ్యర్థి ప్రచారం: వార్డుల అభివృద్ధికి హామీ

**గద్వాల, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** అలంపూర్ మున్సిపల్ పరిధిలో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఐదో వార్డు జనసేన పార్టీ అభ్యర్థి, 'వే టు న్యూస్' తో మాట్లాడుతూ, తమ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే, ఆంధ్రప్రదేశ్ లో పవన్ కళ్యాణ్ అభివృద్ధి చేస్తున్న విధంగానే ఈ వార్డులను ఉత్తమ వార్డులుగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## దేవస్థానం వాల్ పోస్ట ఆవిష్కరణ



**పినపాక, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** మణుగూరు శ్రీ నీలకంటేశ్వర స్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 15వ తేదీన మహాశివరాత్రి మహోత్సవాలను పురస్కరించుకుని, దేవస్థానం ఈఓ శేషయ్య, తహసీల్దార్ నరేష్ గురువారం పోస్టర్లు, పాంప్లెట్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీవిద్య విద్యాసంస్థల డైరెక్టర్ బద్దం శ్రీనివాస్ రెడ్డి, మాజీ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఓటర్లను ఆకట్టుకుంటున్న ఎమ్మెల్యే

**అశ్వారావుపేట, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** అశ్వారావుపేట మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ వినూత్న పద్ధతుల్లో ఓటర్లను ఆకట్టుకుంటున్నారు. గురువారం ఆయన బస్తీల్లో పర్యటిస్తూ, ఒక ఇంట్లో మహిళలకు సాయంగా అంట్లు తోమి, మరోచోట కూరగాయలు కోస్తూ సామాన్యుడిలా కలిసిపోయారు. రాజకీయ చైతన్యం పెంచడమే లక్ష్యంగా ఆయన చేస్తున్న ఈ విభిన్న ప్రచారం నియోజకవర్గంలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది.

## నర్సరీని పరిశీలించిన సర్పంచ్, ఉప సర్పంచ్

**భద్రాచలం, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** కొత్తగూడెం, చుంచుపల్లి మండలం, బాబు క్యాంపులో గురువారం ఉదయం సర్పంచ్ నూనావత్ కుమారి, ఉప సర్పంచ్ పోలమూరి శ్రీనివాస్, వార్డు మెంబర్ మెగ్య బాబు క్యాంపు పంచాయతీ నర్సరీని పరిశీలించారు. నర్సరీలో విధి నిర్వహణ సక్రమంగా జరుగుతుందో లేదో వారు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ పరిశీలన ద్వారా పనుల పురోగతిని అంచనా వేయడం జరిగింది.

## పల్లే దవాఖాన సిబ్బంది సర్పంచ్, ఉపసర్పంచ్‌లకు ఘన సన్మానం

**కొత్తగూడెం, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** కొత్తగూడెం, చుంచుపల్లి మండలం, బాబు క్యాంపులో గురువారం ఉదయం పల్లే దవాఖాన సిబ్బంది, డాక్టర్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు కలిసి సర్పంచ్ నూనావత్ కుమారి, ఉపసర్పంచ్ పోలమూరి శ్రీనివాస్‌లను సాల్వాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా వైద్య సేవల్లో వారి సహకారాన్ని అభినందించారు.

## చుంచుపల్లిలో సీపీఐ ఎన్నికల ప్రచారం జోరుగా సాగింది

**ఇల్లందు, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** చుంచుపల్లిలోని 19వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా విద్యానగర్ సర్పంచ్ భూక్యా శాంతి శ్రీ, సీపీఐ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ఈ ప్రచారంలో 19వ డివిజన్ అభ్యర్థి శ్రీను అన్న, విద్యానగర్ వార్డు సభ్యులు శంకర్ కూడా పాల్గొన్నారు. సీపీఐ కార్యకర్తలు, నాయకులు ఎన్నికల ప్రచారంలో చురుగ్గా పాల్గొని, తమ అభ్యర్థికి మద్దతుగా విస్తృతంగా ప్రచారం నిర్వహించారు.

## మున్సిపల్ ఎన్నికలు.. అన్నదమ్ముల మధ్య పోటీ

**నర్సంపేట, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** మున్సిపల్ ఎన్నికల్లో ఒకే కుటుంబం నుంచి అన్నదమ్ములు పోటీ పడుతున్నారు. నర్సంపేట మున్సిపాలిటీ నాలుగో వార్డు జనరల్ కు రిజర్వ్ కాగా.. ఆ వార్డు నుంచి బీఆర్ఎస్ తరపున అన్న బీరం నాగిరెడ్డి, కాంగ్రెస్ తరపున తమ్ముడు బీరం భరత్‌రెడ్డి బరిలో నిలిచారు. అయితే ఈ నెల 11న జరిగే ఎన్నికల్లో అన్నదమ్ములిద్దరిలో ఎవరు గెలుస్తారోనని ఉత్కంఠ నెలకొంది.

## నాలుగో వార్డులో యుగంధర్ గెలుపునకు బీజేపీ ప్రచారం



**భూపాలపల్లి, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** భూపాలపల్లి మునిసిపాలిటీ నాలుగో వార్డులో బీజేపీ అభ్యర్థి కన్నం యుగంధర్ గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు గడపగడపకు ప్రచారం నిర్వహించారు. ప్రజలు తమ ప్రేమ, గత అభివృద్ధిని గుర్తుచేసుకుని, యుగంధర్ ను మళ్ళీ గెలిపించుకుంటామని, నిత్యం అందుబాటులో ఉండే నాయకుడే తమకు కావాలని బలంగా వినిపించారు. అభ్యర్థి యుగంధర్ మాట్లాడుతూ, మళ్ళీ అవకాశం ఇస్తే సేవకుడిగా పని చేస్తానని, గతంలో ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించానని, నాలుగో వార్డు ఓటర్లను మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## వరంగల్‌లో గణేష్‌కి రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో గుర్తింపు

**జనగామ, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** వరంగల్‌లోని ఎన్.ఐ.టి.లో జరిగిన నేషనల్ మిషన్ ఫర్ మెంటరింగ్ రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో వెల్ది మోడల్ స్కూల్ ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు గణేష్ కందగట్ల గురువారం పాల్గొన్నారు. జాతీయ విద్యా విధానం 2020 అమలులో భాగంగా ఉపాధ్యాయులకు మెంటర్‌గా పనిచేసే అవకాశాన్ని ఈ శిక్షణ కల్పిస్తుంది. జనగామ జిల్లా నుండి ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఏకైక ఉపాధ్యాయుడు గణేష్ కావడం విశేషం. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పాలకుర్తి శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ గడ్డం జయశ్రీ, ఉపాధ్యాయులు గణేష్‌ను అభినందించారు. గణేష్ తనపై చూపిస్తున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు.

## వండర్ హాట్ కి రికార్డ్ ధర నమోదు

**స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** వరంగల్ ఏనుమాముల మార్కెట్లో మిర్చి ధరలు వరుసగా రెండు రోజులుగా రికార్డు స్థాయికి చేరుకున్నాయి. ముఖ్యంగా వండర్ హాట్, 341 రకాల మిర్చి సాగు చేసిన రైతులకు మంచి లాభాలు దక్కుతున్నాయి. మార్కెట్లోకి మిర్చి రాకడ తగ్గడం కూడా ధరలు పెరగడానికి ఒక కారణంగా తెలుస్తోంది. గరిష్ట ధర ?37,100 ఉండగా, గురువారం ?900 పెరిగి ?38,000కు చేరడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.

# బెల్లంపల్లిలో కాంగ్రెస్ అభ్యర్థికి గడ్డం వినోద్ ఆదేశాలతో ప్రచారం



**బెల్లంపల్లి, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** మంచిర్యాల జిల్లా, బెల్లంపల్లి పట్టణంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో, 6వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి దుబాసి వరలక్ష్మి, వెంకటస్వామి మరియు వార్డు ప్రజలు కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డు సమస్యలను తెలుసుకున్నారు. శాసన సభ్యులు గడ్డం వినోద్ ఆదేశాల మేరకు ఈ ప్రచారం జరిగింది.

## పదేండ్ల అభివృద్ధిని చూసి ఓటు వేయండి

**మంచిర్యాల, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** బెల్లంపల్లి మున్సిపాలిటీలో గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధిని చూసి తమకు ఓటు వేయాలని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రజలకు సూచించారు. గురువారం బెల్లంపల్లి పట్టణంలోని 31వ వార్డులో మున్సిపల్ రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు రవీందర్ రెడ్డి, నగేష్ లతో కలిసి ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రజల ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు.

## కరెంట్ షాక్ తో వ్యక్తి మృతి

**చెన్నూరు, ఫిబ్రవరి 5 పెన్ పవర్: :** కరెంట్ షాక్ తో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గౌరపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దానోరా గ్రామానికి చెందిన మదినే అక్షయ్ ( 30) గ్రామ శివారు వ్యవసాయ పొలంలో గత కొన్ని రోజులుగా బెల్ట్ షాప్ నిర్వహిస్తున్నాడు. మధ్యాహ్నం పొలంలోన 11 కేవీ లైన్ కు కరెంట్ తీగలు పెట్టి కరెంటు తీసుకోవాలని ప్రయత్నించగా.. అకస్మాత్తుగా కరెంట్ షాక్ తగిలి చనిపోయాడు. మృతునికి భార్య తో పాటు ఇద్దరు కొడుకులు ఉన్నారు. అన్న మదినే సంతోష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు.

# బంబారాలో ఉచిత కిడ్నీ పరీక్షలు, డయాలసిస్ సెంటర్ ప్రారంభం

**సిర్పూర్, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** వాంకిడి మండలంలోని బంబారా గ్రామపంచాయతీలో ప్రముఖ వైద్యులు డాక్టర్ రాకేష్ చెన్నా ఆధ్వర్యంలో ఉచిత కిడ్నీ పరీక్షలు మరియు డయాలసిస్ సెంటర్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ ఏర్పాటు జరిగింది. సర్పంచ్ బెండారె కృష్ణాజీ, ఉప సర్పంచ్ సంతోష్, పంచాయతీ కార్యదర్శి ధరయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. డాక్టర్ రాకేష్ చెన్నా మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో పెరుగుతున్న కిడ్నీ వ్యాధుల నేపథ్యంలో ముందస్తు పరీక్షలు, ఉచిత వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగకరమని, భవిష్యత్తులోనూ ఇలాంటి సేవలు కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం లేకుండా వైద్యం అందడంతో గ్రామస్తులు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.

## కాగజ్‌నగర్‌లో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్ల పరిశీలన

**ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** కాగజ్‌నగర్ పట్టణంలోని డి. ఏ. వి పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాళ్లను అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) దీపక్ తివారి, సబ్ కలెక్టర్ శ్రద్ధా శు క్ల పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాలు, విద్యుత్ సరఫరా, తాగునీరు, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలను సమీక్షించారు. మున్సిపల్ కమిషనర్, డిప్యూటీ ఈఈ రామాదేవి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. శంకర్ కూడా ఈ పరిశీలనలో పాల్గొన్నారు. అధికారులు అన్ని ఏర్పాట్లు సమగ్రంగా ఉండేలా తగిన సూచనలు చేశారు.

## కరీంనగర్ లో ఆగని దొంగతనాల పరంపర

**పెద్దపల్లి, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** శంకరపట్నం మండలంలో ఎస్సారెస్పీ ప్రధాన కాలువకు అమర్చుకున్న వ్యవసాయ పంప్ సెట్లు వరుసగా చోరీకి గురవుతున్నాయి. ఆదివారం నుంచి గురువారం వరకు ఈ దొంగతనాలు కొనసాగుతున్నాయి. రైతులు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కరీంపేట గ్రామానికి చెందిన ఐదుగురు రైతుల మోటార్లు అర్ధరాత్రి దొంగిలించబడ్డాయని అనుమానిస్తున్నారు. దొంగిలించబడిన మోటార్ల విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని రైతులు తెలిపారు. పోలీసులు గస్తీ పెంచి దొంగతనాలను అరికట్టాలని రైతులు కోరుతున్నారు. ఏఎస్ఐ సంపత్ రెడ్డి చోరీ జరిగిన ప్రాంతానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

## కరీంనగర్ పురపోరులో 'రెబల్' సెగ

**కోరుట్ల, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** కరీంనగర్ నగరపాలక ఎన్నికల్లో టికెట్ దక్కని ఆశావహులు స్వతంత్రులుగా బరిలోకి దిగడంతో ప్రధాన పార్టీలకు 'రెబల్స్' సవాల్ విసురుతున్నారు. అధిష్ఠానాల బుజ్జగింపులు ఫలించకపోవడంతో పలు డివిజన్లలో రెబల్స్ పోటీలో నిలిచారు. గ్రూపు రాజకీయాల నేపథ్యంలో సొంత పార్టీ నేతలే గోతులు తవ్వుతారేమోనని, ఓట్లు చీలిపోతాయేమోనని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. నగరాభివృద్ధిపై భరోసా కల్పించాల్సిన వేళ ఈ రెబల్స్ ప్రధాన పార్టీలకు పెద్ద తలనొప్పిగా మారారు.

# పెద్దపల్లి జిల్లాలో ఎన్నికల సిబ్బంది టీమ్ ఫార్మేషన్ పూర్తి

**రామగుండం, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** పెద్దపల్లి జిల్లాలో 05.02.2026న మధ్యాహ్నం 1.00 గంటలకు కలెక్టర్ శ్రీ కోయ శ్రీ హర్ష ఆదేశాల మేరకు సమీకృత జిల్లా అధికారుల సముదాయంలో ఎన్నికల పర్యవేక్షురాలు సమక్షంలో రెండవ రాండామైజేషన్ పూర్తయింది. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బంది టీమ్ ఫార్మేషన్ జరిగింది. ఒక్కో పోలింగ్ బూత్‌కు 5 గురు చొప్పున రామగుండం, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని నియోజకవర్గాలకు టీమ్‌లను కేటాయించారు. ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు.


## అభివృద్ధి పనులను పరిశీలించిన సర్పంచ్

**మంథని, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** చిల్లపల్లి గ్రామ సర్పంచ్ గోపు సంతోష్ కుమార్ గ్రామంలో జరుగుతున్న రోడ్డుపక్కన పొదల తొలగింపు, సర్కార్ తుమ్మ చెట్ల శుభ్రత, 8వ వార్డ్ లో హ్యాండ్‌పంప్ వద్ద సోక్‌పిట్ నిర్మాణ పనులను పరిశీలించారు. గ్రామంలో తాగునీటి సౌకర్యాలు, రోడ్ల అభివృద్ధి, పరిశుభ్రతను మెరుగుపరచడమే లక్ష్యంగా ఈ పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామ్‌కిషోర్, గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు వేల్పుల నరేష్, అక్కపాక లింగయ్య, గ్రామ యువకులు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ



**జగిత్యాల, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** జగిత్యాల రూరల్ మండలం సంగంపల్లి గ్రామంలో రూ. 10 లక్షలతో, కల్లెడ గ్రామంలో రూ. 20 లక్షలతో రెండు మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ గురువారం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, ఎమ్మార్వో, ఎంపీడీవో, డీఈ, ఎంపీవోలు పాల్గొన్నారు. ఈ భవనాల నిర్మాణం మహిళా సంఘాల కార్యకలాపాలకు ఊతమిస్తుందని భావిస్తున్నారు.



# కాంగ్రెస్ పాలనకు రిఫరెండం...

**హైదరాబాద్, ఫిబ్రవరి 5, పెన్ పవర్:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు కనిపిస్తున్నాయి. అధికార కాంగ్రెస్, దూకుడు మీదున్న బీజేపీ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అగ్రనేతలను రంగంలోకి దించగా,ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ మాత్రం స్థానిక నేతలకే బాధ్యత వదిలేసింది. తెలంగాణలోని 123 మున్సిపల్ , 7 కార్పొరేషన్లకు జరుగుతున్న ఈ ఎన్నికలను అధికార కాంగ్రెస్ పార్టీ తన పాలనకు ఒక రెఫరెండంగాభావిస్తోంది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాల్లో పర్యటిస్తూ ప్రచారాన్ని హోరెత్తించాలని నిర్ణయించారు. పట్టణ ఓటర్లను ఆకట్టుకునేందుకు వరాల జల్లు కురిపిస్తూ, మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించడంద్వారా తన పట్టును నిరూపించుకోవాలని చూస్తున్నారు. కేడర్‌లో ఉత్సాహం నింపేలా ప్రతి మున్సిపాలిటీకి మంత్రులను ఇన్-ఛార్జులుగా నియమించి క్షేత్రస్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. బీజేపీ సైతం ఏమాత్రంతగ్గడం లేదు. జాతీయ అధ్యక్షుడు స్వయంగా ప్రచారానికి వస్తుండటమే కాకుండా, కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ వంటి వారు గల్లీ గల్లీ తిరుగుతున్నారు. వీటికి అదనంగా, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ రెండు రోజుల పాటు తెలంగాణలో బీజేపీ అభ్యర్థుల తరపున ప్రచారం చేయనుండటం ఆ పార్టీకి పెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. జనసేన మద్దతుతో సెటిలర్ల ఓట్లను, యువత ఓట్లను గంపగుత్తగా కొల్లగొట్టాలన్నదిబీజేపీ వ్యూహం. ఇంతటి భారీ యంత్రాంగాన్ని దింపడం ద్వారా రాష్ట్రంలో తామే ప్రత్యామ్నాయం అనే సంకేతాన్ని ఆ పార్టీ పంపిస్తోంది. ఈ హడావుడి మధ్య బీఆర్ఎస్ తీరు రాజకీయ వర్గాలను విస్మయానికి గురిచేస్తోంది. గతంలో ప్రతి చిన్న ఎన్నికనూ ప్రతిష్ఠాత్మకంగా తీసుకునే అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు ఈసారి ప్రచారానికి దూరంగా ఉంటున్నారు. కేవలం ప్రెస్ మీట్లకే పరిమితమవుతూ, క్షేత్రస్థాయి ప్రచార బాధ్యతలనుస్థానిక ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్-ఛార్జులకే వదిలేశారు. అభ్యర్థుల ఎంపిక కూడా వారికే ఇచ్చారు. దీనివల్ల పార్టీ శ్రేణుల్లో ఒక రకమైన స్తబ్దత నెలకొంది. బీఆర్ఎస్ ఈ ఎన్నికలను లైట్ తీసుకోవడం వెనుక లోతైనరాజకీయ కారణాలు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఒకవేళ ఎన్నికల్లో ఫలితాలు తారుమారైతే, ఆ ఓటమి బాధ్యతను తమపై వేసుకోకుండా తప్పించుకోవడానికే అగ్రనేతలు దూరంగా ఉంటున్నారన్న వాదనబలంగా వినిపిస్తోంది. ఎమ్మెల్యేలకు బాధ్యతలు అప్పగించడం ద్వారా.. ఫలితాలు బాగుంటే పార్టీ పుంజుకుందన్న ప్రచారం, తేడా వస్తే స్థానిక నేతల వైఫల్యంగా చూపించే వీలుంటుందని పార్టీ పెద్దలు భావిస్తున్నట్లుసమాచారం. అయితే, ఇది కార్యకర్తలను నిరుత్సాహానికి గురిచేస్తోంది. కాంగ్రెస్ తన అధికారాన్ని నిలబెట్టుకోవడానికి, బీజేపీ తన బలాన్ని నిరూపించుకోవడానికి సర్వశక్తులు ఒడ్డుతుంటే.. బీఆర్ఎస్ మాత్రం డిఫెన్సివ్ మోడ్‌లో కనిపిస్తోంది.

# పక్కా ప్లాన్ తో గులాబీ వ్యూహం




**హైదరాబాద్, ఫిబ్రవరి 5, పెన్ పవర్:** పురపోరుతో మళ్లీ గాడిన పడి పూర్వవైభవం దిశగా సాగాలని భారత రాష్ట్ర సమితి ఆశాభావంగా వెళ్తోంది. సర్పంచ్ ఎన్నికల ఫలితాల స్ఫూర్తితో పార్టీ గుర్తులతో జరిగే మున్సిపల్ ఎన్నికల్లో మెరుగైన స్థానాలు దక్కించుకోవాలని గులాబీ పార్టీ భావిస్తోంది. బాకీ కార్డుల ద్వారా కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్తూనే పదేళ్ల కేసీఆర్ హయాంలో చేసిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఇందుకోసం మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు పార్టీ తరపున సమన్వయకర్తలను కూడా నియమించారు. పెద్దపెద్ద సమావేశాలు, రోడ్ షోలు లేకుండా స్థానికంగానే ప్రచారం నిర్వహించాలని బీఆర్ఎస్ నిర్ణయించింది. వరుస ఎన్నికల్లో ఓటమితో ఇబ్బంది పడుతున్న భారత రాష్ట్ర సమితి ఇటీవలి పంచాయతీ ఎన్నికల ఫలితాలతో కాస్త హుషారుగా కనిపిస్తోంది. సర్పంచ్ ఎన్నికల్లో నాలుగు వేలకు పైచిలుకు స్థానాలు పార్టీ మద్దతు దారులు గెలుపు పొందారని అంటున్న బీఆర్ఎస్ అదే ఉత్సాహంతో పట్టణ ప్రాంత స్థానిక సంస్థల ఎన్నికల బరిలో దిగుతోంది. ఎన్నికలు జరుగుతున్న 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లలో మెరుగైన సంఖ్యలో స్థానాలే లక్ష్యంగా ముందుకెళ్తోంది. ఎన్నికల సన్నాహకాల్లో భాగంగా ఉమ్మడి జిల్లాల వారీగా ప్రజాప్రతినిధులు, ఇన్చార్జులు పార్టీ జిల్లా అధ్యక్షులతో హరీశ్ రావు, కేటీఆర్లు సమావేశమయ్యారు. ఆయా పట్టణ ప్రాంతాల్లో ఎన్నికల సన్నద్ధతను సమీక్షించి నేతలకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల్లో గెలుపు ఆవశ్యకత గురించి వారికి పూర్తిస్థాయిలో వివరించారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు పంచాయతీ ఎన్నికలే నిదర్శనంగా బీఆర్ఎస్ అభివర్ణిస్తోంది. మున్సిపల్ ఎన్నికల్లో పరిస్థితి మరింత ఆశాజనకంగా ఉంటుందని సద్వినియోగం చేసుకుని పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని భావిస్తోంది. మున్సిపల్ ఎన్నికల వేళ చేరికలపై కూడా గులాబీ పార్టీ దృష్టి సారించింది. స్థానికంగా మంచి పేరు, రాజకీయంగా బలం ఉన్న నేతలను పార్టీలో చేర్చుకుంటున్నార లోక్సభ ఎన్నికలకు ముందు పార్టీని వీడి బీజేపీలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ మళ్లీ సొంతగూటికి వచ్చారు. బీఆర్ఎస్ అభ్యర్థి ప్రతి ఒక్క వార్డులోనూ బరిలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఎట్టి పరిస్థితుల్లోనూ అధికార పార్టీ ఒక్క వార్డును కూడా ఏకగ్రీవం చేసుకోకుండా చూడాలనిఅధిష్టానం స్పష్టం చేస్తోంది. అభ్యర్థిత్వాల ఎంపిక విషయంలోనూ పూర్తి జాగ్రత్తగా ఉండాలని గెలుపే ప్రాతిపదికన ఖరారు చేయాలని దిశానిర్దేశం చేస్తోంది. ఒకరి కంటే ఎక్కువ సంఖ్యలో ఆశావహులు ఉన్నచోట అవకాశంరాని వారిని బుజ్జగించి, రెబెల్స్కు ఆస్కారం లేకుండా చూసేందుకు ప్రణాళికలు వేస్తోందిఎన్నికలు జరుగుతున్న పురపాలికల్లో ప్రత్యేకంగా సమన్వయకర్తలను పార్టీ నియమించింది. ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ వారి సమన్వయంతో జరిగేలా, క్షేత్రస్థాయి పరిస్థితులను ఎప్పటికప్పుడు అధిష్టానానికి చేరవేసేలా ఈ ఏర్పాటు చేశారు. స్థానిక నేతలను సమన్వయం చేయడంతోపాటు అభ్యర్థుల ఎంపిక, నామినేషన్లు, ప్రచారం, వ్యూహంలాంటి వాటిలో సమన్వయకర్తలు కీలకంగా వ్యవహరించాల్సి ఉంటుంది. బాకీ కార్డుల ద్వారా మున్సిపల్ ఎన్నికల ప్రచారం కొనసాగించాలని బీఆర్ఎస్ తీర్మానించింది. ఇందులోభాగంగా శాసనసభ ఎన్నికల వేళ కాంగ్రెస్ఇచ్చిన హామీల అమల్లో వైఫల్యాలు ప్రశ్నిస్తూ ఇంటింటికీ బాకీ కార్డులు పంపిణీ చేయనున్నారు. 25 నెలల కాంగ్రెస్ పాలనలో ఎవరికి ఎంత బాకీ పడ్డారో అందులో ముద్రించారుఇదే సమయంలో పదేళ్ల కేసీఆర్‌హయాంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరిస్తూనే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు నాయకత్వం సూచించింది. పూర్తిగా జిల్లాస్థాయిలో ప్రచార కార్యక్రమాలుచేపట్టనున్నారు. పెద్దపెద్ద సభలు, సమావేశాలు, రోడ్ షోలు లేకుండా ప్రతి ఓటరును కలిసేలా ఇంటింటి ప్రచారం నిర్వహించేలా వ్యూహాలు రచిస్తున్నారు. ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు సాధించడం ద్వారా రానున్నశాసనసభ ఎన్నికలకు మార్గం సుగమమం చేసుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోంది. కేసీఆర్ను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలన్న లక్ష్యాన్ని నెరవేర్చుకోవాలంటే ఈ ఎన్నికల్లో మంచి ఫలితాలు రాబట్టాలని లక్ష్యంగాపెట్టుకొంది.

# తెలుగు రాష్ట్రాల్లో ఎయిడ్స్ మరణాలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 5 పెన్ పవర్:** లుగు రాష్ట్రాల్లో హెచ్ఐవీ డేంజర్ బెల్స్ మోగిస్తోంది. గతంలో కేసులు తగ్గినా.. ఇటీవలికాలంలో విపరీతంగా పెరుగుతున్నాయి. దీంతో మరణాలు పెరుగుతున్నాయి. కేంద్రం ప్రకారం, 202024 మధ్య ఆంధ్రప్రదేశ్‌లో 32,642 మంది, తెలంగాణలో 11,498 మంది హెచ్ఐవీతో మరణించారు. మొత్తం 44,140 మరణాలు రికార్డు అయ్యాయి. ఏపీలో హెచ్ఐవీ మరణాల సంఖ్య గణనీయంగా పెరిగింది. గ్రామీణ ప్రాంతాల్లో టెస్టింగ్, చికిత్స సౌకర్యాల కొరత, అవగాహన లోపం కారణంగా వ్యాధి బాధితులు మరణిస్తున్నారు. రాష్ట్ర వైద్య శాఖ ఈ ట్రెండ్‌ను అరికట్టే చర్యలు చేపట్టాలి. తెలంగాణలో 11,498 మరణాలు రికార్డయ్యాయి. నగరాల్లో ఏఆర్‌టి సౌకర్యాలు మెరుగ్గా ఉన్నప్పటికీ, గ్రామాల్లో వ్యాప్తి, టెస్టింగ్ లోపాలు సమస్య. యువతలో వ్యాప్తి పెరుగుతోంది. వైరస్ గుర్తింపులో జాప్యం కారణంగా మరణాలు జరుగుతున్నాయి. వైద్య సేవల ఆలస్యం, స్టిగ్మా, టెస్టింగ్‌లో భయం మరణాలకు దారితీస్తున్నాయి. రెండు రాష్ట్రాల్లో గ్రామీణ ప్రాంతాలు ఎక్కువగా ప్రభావితమవుతున్నాయిహెచ్ఐవీ మరణాలు రెండు రాష్ట్రాల వైద్య వ్యవస్థల్లో లోపాలను సూచిస్తున్నాయి. ఉచిత టెస్టింగ్, ఏఆర్‌టీ మందులు, అవగాహన కార్యక్రమాలు పెంచాలి. యువతపై దృష్టి పెట్టి, స్క్రీనింగ్ క్యాంపులు ఏర్పాటు చేస్తే మరణాలు తగ్గుతాయి. కేంద్ర, రాష్ట్రాలు కలిసి చర్యలు తీసుకోవాలి.

# రాజ్యసభకు చిరంజీవి...?



**విజయవాడ, ఫిబ్రవరి 5, పెన్ పవర్:** ఏపీలో రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. కూటమి 20 నెలల పాలన పూర్తి చేసుకుంది. ప్రజల్లో ఒక రకమైన సంతృప్తి కనిపిస్తోంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలం పుంజుకునేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఈ క్రమంలో దూకుడుగా వ్యవహరిస్తోంది. అయితే టిడిపి శ్రేణులు గట్టిగానే ఢీకొడుతున్నాయి. వారితో పోల్చుకుంటే జనసేన నేతలు స్పందించడం లేదు. దీనిపైనే చర్చ నడుస్తుండగా పార్టీ శ్రేణులకు గట్టి సంకేతాలు పంపారు పవన్ కళ్యాణ్. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని గట్టిగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఇటువంటి పరిస్థితుల్లో ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ భేటీ అయ్యారు. వారిద్దరి మధ్య కీలక రాజకీయ చర్చలు జరిగాయి. లడ్డూ వివాదం నేపథ్యంలో.. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విషయంలో అనుసరించాల్సిన అంశాలపై వారిద్దరి మధ్య చర్చ సాగింది. సహజంగానే ఇద్దరు నేతల ఏకాంత భేటీ అంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ గురించి అయి ఉంటుంది. మరోవైపు ఇటీవల పవన్ ఢిల్లీ వెళ్లి వచ్చారు. దీంతో ఇద్దరి భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. తిరుమల లడ్డూ తయారీకి సంబంధించి వాడిన నెయ్యిలో వైసిపి హయాంలో జంతు కొవ్వు కలిసిందన్నది ప్రధాన ఆరోపణ. సుప్రీంకోర్టు ఆదేశాలతో ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం గత కొద్ది నెలలుగా విచారణ చేపట్టింది. ఇటీవల కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది. మరోవైపు సిబిఐ ల్యాబ్ నిర్ధారణ అంటూ ఒక విషయం బయటపడింది. ఆ నెయ్యిలో జంతు కొవ్వు కలపలేదన్నది ఒక వాదన. వాడినది మాత్రం ఆవు పాలతో తయారు చేసిన నెయ్యి కాదని.. కొన్ని రసాయనాల మిశ్రమాలతో తయారు చేసింది అంటూ మరో వాదన. ఈ విషయంలో అధికార విపక్షాల మధ్య గట్టి ఫైట్ నడుస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు వెలిసాయి. దానికి వ్యతిరేకంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పాప ప్రక్షాళన యాత్ర చేపట్టింది. అందులో భాగంగా మాజీమంత్రి అంబటి రాంబాబును టిడిపి శ్రేణులు అడ్డగించాయి. ఈ క్రమంలో ఆయన సీఎం చంద్రబాబుపై బూతు వ్యాఖ్యలు చేశారు. ఆయన అరెస్టు జరిగింది. ఈరోజు అంబటి కుటుంబ సభ్యులను జగన్మోహన్ రెడ్డి పరామర్శించారు. అయితే ఈ ఎపిసోడ్ నేపథ్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే ఇటీవల ఢిల్లీ వెళ్లి వచ్చారు పవన్ కళ్యాణ్. కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్రంలో పెండింగ్ ప్రాజెక్టులపై చర్చించారు. అయితే హోం శాఖ మంత్రి అమిత్ షాను కలవడం మాత్రం కొత్త చర్చకు దారితీసింది. రాజ్యసభ పదవి కోసమే పవన్ ఢిల్లీ వెళ్లారని ప్రచారం జరిగింది. ఈ ఏడాది జూన్లో ఏపీ నుంచి నలుగురు రాజ్యసభ సభ్యులు పదవీ విరమణ చేయనున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, పరిమళ్ నత్వాని.. టిడిపికి చెందిన సానా సతీష్ పదవీ విరమణ చేయనున్నారు. గతంలో నాలుగు రాజ్యసభ పదవులకు గాను.. బిజెపి, టిడిపి రెండు పదవులు చొప్పున తీసుకున్నాయి. జనసేనకు రాజ్యసభలో ఇంతవరకు ప్రాతినిధ్యం లేదు. అందుకే ఈసారి తమకు చాన్స్ ఇవ్వాలని కోరేందుకు పవన్ కళ్యాణ్ ఢిల్లీ వెళ్లినట్లు ఒక ప్రచారం అయితే మాత్రం జరిగింది. అయితే ఈరోజు సీఎం చంద్రబాబుతో పవన్ కళ్యాణ్ భేటీ రాజ్యసభ పదవుల కోసమేనన్న చర్చ నడుస్తోంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో జనసేనకు ఒక రాజ్యసభ పదవి ఖాయమని తెలుస్తోంది. ప్రధానంగా లింగమనేని రమేష్ పేరు ప్రముఖంగా

వినిపిస్తోంది. కానీ ఇప్పుడు పవన్ కళ్యాణ్ చిరంజీవి పేరు తెరపైకి తెస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. చిరంజీవిని రాజ్యసభకు పంపితే జరిగే లాభనష్టాలు గురించి వారిద్దరూ చర్చించుకున్నట్లు కూడా టాక్ నడుస్తోంది. గతంలో కూడా చిరంజీవి విషయంలో రకరకాల ప్రచారాలు జరిగాయి. వైసిపి కూడా చిరంజీవిని రాజ్యసభకు ప్రమోట్ చేయాలని ప్రయత్నించినట్లు ఊహాగానాలు వచ్చాయి. అయితే ఇప్పుడు మరోసారి పవన్ చిరంజీవిని రాజ్యసభకు పంపిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన చేస్తున్నట్లు సమాచారం. అయితే రాజకీయాలకు దూరంగా.. సినిమాల్లో బిజీగా ఉన్నారు చిరంజీవి. అందుకే ఈ ప్రచారంలో ఎంత వాస్తవం ఉందనేది తెలియాలి.

# పిపిపి విధానంలో కుంకుమసాగు

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 5, పెన్ పవర్:** పిపిపి మోడల్ కింద లంబసింగిలో పెద్ద ఎత్తున కుంకుమ పువ్వును పండించడానికి కంపెనీలకు అనుమతించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్ చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయం, అనుబంధ రంగాల పనితీరును సమీక్షించిన ముఖ్యమంత్రి చంద్రబాబు, స్థానిక గిరిజన వర్గాల భాగస్వామ్యంతో కుంకుమ పువ్వు సాగుకు పిలుపునిచ్చారు. "స్థానిక గిరిజన వర్గాల భాగస్వామ్యంతో పిపిపి (పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్షిప్) మోడల్ కింద లంబసింగిలో పెద్ద ఎత్తున కుంకుమ సాగును చేపట్టడానికి సిద్ధంగా ఉన్న కంపెనీలకు అనుమతి ఉంటుంది" అని చంద్రబాబు ప్రకటనలో తెలిపారు. ఆంధ్రా కశ్మీర్గా పిలుచుకునే లంబసింగి, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని చింతపల్లి మండలంలోని ఒక చిన్న గ్రామం. లంబసింగి ఇప్పటికే కాఫీ, మిరియాలు మరియు స్ట్రాబెర్రీ పంటలను పండిస్తోంది. ఏలూరు జిల్లాలో 500 ఎకరాల్లో కోకో సాగును అభివృద్ధి చేయాలని, అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం సాగు, ప్రాసెసింగ్, మార్కెటింగ్ సౌకర్యాలతో పాటు అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. అరటి ఉత్పత్తిలో దక్షిణాది రాష్ట్రం దేశంలో రెండో స్థానంలో ఉన్నప్పటికీ, ఎగుమతుల్లో లోపం ఉందని ముఖ్యమంత్రి గమనించారు. దానిపై ప్రధానంగా దృష్టి పెట్టి ఎగుమతులను పెంచాలని అధికారులకు సూచించారు. ఆక్వాకల్చర్ గురించి ఆలోచిస్తూ, ఆక్వాకల్చర్ కార్యకలాపాల నమోదు తప్పనిసరి చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ను దేశంలోనే అతిపెద్ద సహజ వ్యవసాయ కేంద్రంగా మార్చడానికి చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. త్వరలోనే మామిడి ప్రాసెసింగ్ పరిశ్రమల యజమానులతో సమావేశం ఉంటుందని, వారి సమస్యల పరిష్కారం కోసం కూడా ప్రభుత్వం ఆలోచిస్తోందని తెలిపారు. విజయవాడలో పీపీపీ విధానంలో పూల మార్కెట్ నిర్మించడానికి కూడా చంద్రబాబు ఓకే చెప్పారు. డిజి రైతుబజార్ యాప్, వ్యవసాయ యంత్ర పరికరాలు అందించేందుకు ఏపీ ఏఐఎంఎస్ యాప్, కిసాన్ డ్రోన్ యాప్లను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. రాష్ట్రాన్ని ప్రకృతి వ్యవసాయ క్షేత్రంగా మార్చే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభిస్తామన్నారు సీఎం చంద్రబాబు. ఇప్పుడు 18 లక్షల మందికిపైగా రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేందుకు ముందుకు వచ్చారని దాన్ని నాలుగేళ్లలో 50 లక్షలకు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రకృతి ఉత్పత్తులకు సర్టిఫికేషన్, ట్రేస్బిలిటీ సౌకర్యాలు పూర్తి చేయాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంపై సుభాష్ పాలేకర్తో శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని అధికారులు తెలిపారు. రసాయన ఎరువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని, దీంతో రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గి, పంట ఉత్పత్తులకు అధిక ధర లభిస్తుందన్నారు చంద్రబాబు. ఏఐ ఆధారిత క్రాప్ అడ్వయిజరీ 'భారత్ విస్తార్' వంటి వాటిని రాష్ట్రంలోనూ వినియోగించుకోవాలన్నారు. యూఎస్, ఈయూతో ట్రేడ్ ఒప్పందం వేళ రాష్ట్రం నుంచి రొయ్యలు, ఎండుమిర్చి, మామిడి, వరి, ప్రాసెస్డ్ ఫుడ్ ఎగుమతులు పెంచుకునేందుకు మరింత అవకాశం కలిగిందని అధికారులు వివరించగా, అయితే నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటించేలా చూడాలని సీఎం అన్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాలకు సంబంధించి కేంద్ర పాలసీలకు అనుగుణంగా రాష్ట్ర పాలసీలు ఉండాలని చెప్పారు.

# లాభాల్లోకి వైజాగ్ స్టీల్ ప్లాంట్

**విశాఖపట్టణం, ఫిబ్రవరి 5, పెన్ పవర్:** విశాఖ ఉక్కు మళ్లీ లాభాల్లోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం అందించిన ఊతం విశాఖ స్టీల్ ప్లాంట్ ను లాభాల దిశగా పయనింప చేసేందుకు దోహదపడింది. ఏడాదిన్నరలో అనూహ్య ప్రగతి సాధించిన రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ 2026 జనవరిలో యాభై నాలుగు కోట్ల లాభాన్ని ఆర్జించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిరంతరం అందిన సహకారంతో గతంలో ఎదుర్కొన్న నష్టాల నుంచి బయటపడిన విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రస్తుతం రోజుకు 19,401 టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేస్తోందని ఆ ప్లాంట్ సీఎండీ ముఖ్యమంత్రికి వివరించారు. 2024-25 రెండో త్రైమాసికంలో రోజుకు కేవలం 9,215 టన్నుల హాట్ మెటల్ ను మాత్రమే ఉత్పత్తి చేయగలిగామని తెలిపారు. ప్రస్తుతం మూడు బ్లాస్ట్ ఫర్నెస్ లు పూర్తిగా పని చేస్తుండటంతో ఉత్పత్తి భారీగా పెరిగిందని అధికారులు సీఎంకు తెలియచేశారు. స్టీల్ ప్లాంట్ కెపాసిటీ యుటిలైజేషన్ లో రికార్డు స్థాయిలో 94 శాతానికి చేరుకుందని తెలిపారు. గత ఏడాది 45 శాతం మాత్రమే ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేయగలిగామని అన్నారు. పన్నులు, విద్యుత్ బకాయిలు, నీటి సరఫరా లాంటి వేర్వేరు అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందించిన సహకారంతో ఆర్థికంగా నష్టాల నుంచి




విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల దశకు చేరుకుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ. 11,440 కోట్ల సాయంతో స్టీల్ ప్లాంట్ నిలదొక్కుకుని మంచి ఫలితాలు సాధిస్తుందని చెప్పారు. 2026 జనవరిలో రూ. 54 కోట్ల లాభాన్ని ఆర్జించగలిగామని తెలియచేశారు. ప్రస్తుతం ఆర్ఐఎన్ఎల్ కు క్రెడిట్ రేటింగ్ కూడా పెరిగినట్టు స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి అన్ని విభాగాల్లోనూ నూతన విధానాలను ప్రవేశపెట్టి స్టీల్ ప్లాంట్ ను మరింత బలోపేతం

చేయాలని అధికారులకు సూచించారు. కార్మికుల, ఉద్యోగులు, అధికారులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే ఈ విజయం సాధ్యం అయ్యింది అన్నారు. విశాఖ స్టీల్ అంటే ప్రసిద్ధి అని దానిని కాపాడుకునేందుకు అవసరమైన చర్యలు ప్రభుత్వంతో పాటు ఉద్యోగులు కూడా తీసుకోవాలని సూచించారు.

## అరవ బలిపశువు అయ్యారా...

**కడప, ఫిబ్రవరి 5, పెన్ పవర్:** రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యవహారం వెనక కుట్ర జరిగిందన్న ప్రచారం జరుగుతుంది. అరవశ్రీధర్ చేసింది తప్పే. వివాహిత మహిళతో సంబంధాన్ని కొనసాగించడాన్ని ఎవరూ అంగీకరించరు. అలాగే మహిళ కూడా ఎమ్మెల్యే కావడంతో అరవ శ్రీధర్ అంటే ఇష్టపడి దగ్గరయ్యారు. అయితే వీరు విడిపోవడానికి అనేక కారణాలు వినిపిస్తున్నాయి. అరవ శ్రీధర్ వ్యవహారంపై లైంగిక వేధింపులు రావడంతో జనసేన పార్టీ వెంటనే త్రిసభ్య కమిటీని నియమించింది. నిన్న విచారణ కూడా పూర్తి చేసింది. నివేదిక ఏమిస్తుందన్నది చూడాలి. అయితే అరవ శ్రీధర్ వ్యవహారంలో కొత్త కోణం బయటపడుతుంది. ఎస్సీ యువకుడు కావడంతో కొందరు కావాలనే తమ పట్టు నుంచి జారి పోతారని భావించి ఇద్దరి మధ్య గ్యాప్ క్రియేట్ చేశారంటున్నారు. జనసేన నేత, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ పై పోలీసు కేసు కూడా నమోదయింది. ఓ మహిళా ఉద్యోగి లైంగిక వేధింపుల ఆరోపణలు చేయడం సంచలనం కలిగించింది. మరొకవైపు అరవ శ్రీధర్ ను సదరు మహిళ పాతిక కోట్ల రూపాయలు డిమాండ్ చేసి బెదిరించిందని ఆరోపణలు కూడా వినిపించాయి. ఓ మహిళ మీడియా ముందుకు వచ్చి ఆరోపణలు చేసినా అరవ శ్రీధర్ పై కేసు నమోదు చేయలేదని విమర్శలు వచ్చాయి. ఈ క్రమంలోనే ఎట్టకేలకు అరవ శ్రీధర్ పై కేసు నమోదైంది. తిరుపతి జిల్లా ఎస్పీకి ఆ మహిళ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కూడా ఈ కేసులో దర్యాప్తును వేగంగా కొనసాగించి వాస్తవాలు బయటకు తీసుకు వచ్చే అవకాశాలున్నాయి. అయితే సాధారణంగా ఎస్సీ నియోజకవర్గం అంటే అగ్ర కులాల పెత్తనం ఉంటుంది. దాదాపు అన్ని ఎస్సీ నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ అదే పరిస్థితి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలోనూ ఎస్సీ ఎమ్మెల్యేలపై అగ్రవర్ణాల నేతల పెత్తనం ఎక్కువగా కనపడేది. కొందరు ధైర్యంగా ఎదురుతిరుగుతారు. చాలా మంది ఎమ్మెల్యే పదవి చాలు అని మౌనంగా ఉంటారు. అరవ శ్రీధర్ కు రైల్వే కోడూరులో అసలు పనే లేదట. ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ అసలు పెత్తనం చేసేది మాత్రం టీడీపీకి చెందిన నేతగా చెబుతున్నారు. అతని కనుసన్నల్లోనే ఈ వ్యవహారం సాగుతుంది. ఇద్దరు కలసి ఉండాలని భావించినా ఆ మహిళ అరవ శ్రీధర్ కు తోడుగా ఉంటే తమ పనులు చెల్లుబాటు కావని భావించి ఇద్దరినీ దూరం చేశారంటున్నారు. తొలి నుంచి అరవ శ్రీధర్ ఆ కుటుంబానికి సేవకుడిగానే ఉంటున్నారన్నది టాక్. గత ఎన్నికల్లో జనసేన అధినేత పవన్ కల్యాణ్ రైల్వే కోడూరు నియోజకవర్గం అభ్యర్థిగా యనమల భాస్కరరావును బహిరంగంగానే ప్రకటించారు. యనమల భాస్కర్ రావు స్వతంత్రంగా ఆలోచించే వ్యక్తి కావడంతో అతను ఎమ్మెల్యే అయితే తమ పనులు సాగవని భావించి టీడీపీ నేత ఒకరు చక్రం తిప్పి చివరి నిమిషంలో వైసీపీలో ఉన్న అరవ శ్రీధర్ ను జనసేనలోకి చేర్పించి టిక్కెట్ ఇప్పించారంటున్నారు. అరవ శ్రీధర్ ఏ ప్రారంభోత్సవం, శంకుస్థాపన, ప్రభుత్వ కార్యక్రమాల్లోనైనా నాలుగో స్థానంలోనే ఉంటారని చెబుతున్నారు. ఆ టీడీపీ నేత కుటుంబంలోని ముగ్గురు ముందు వరసలో ఉంటారు. పనిపాటా లేక ఈ యువతికి దగ్గరయ్యారన్నది అందుతున్న సమాచారం మేరకు తెలుస్తోంది. ఆ యువతి చదువుకున్నది కావడంతో తమకు ఇబ్బందిగా మారుతుందని భావించి టీడీపీ నేత ఇద్దరినీ దూరం చేయడంతోనే ఈ వివాదం రచ్చకెక్కిందంటున్నారు.

## పార్టీ నిర్మాణంపై ఫోకస్



**విజయవాడ, ఫిబ్రవరి 5, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గత పాలనలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకునే ప్రయత్నంలో పడ్డారు. పార్టీ నిర్మాణం పై ఆయన ఫోకస్ పెట్టినట్లు పార్టీలో ప్రచారం జరుగుతుంది. గత ఎన్నికలలో ఓటమి పాలయి పదకొండు సీట్లకు పరిమితమయిన నాటి నుంచి జగన్ నోట కార్యకర్తల మాట పదే పదే వినిపిస్తుంది. ఒకరకంగా జగన్‌కు జ్ఞానోదయం అయింది. నియోజకవర్గాల వారీగా నేతలు అనుసరిస్తున్న తీరును ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్న జగన్ త్వరలోనే నియోజకవర్గానికి కార్యకర్తలతో కమిటీలు వేయాలని నిర్ణయించారని తెలిసింది. కార్యకర్తలకు ఇక ఐడి కార్డు, ఇన్స్యూరెన్స్ కల్పించనున్నారు. కార్యకర్తల్లో ఉన్న నిరాశను పారదోలాలంటే కార్యకర్తలను దగ్గరకు తీసుకునే ప్రయత్నాన్ని మొదలు పెట్టారన్నారు. వైఎస్ జగన్ ఎప్పుడూ తన బొమ్మతోనే గెలవాలని భావిస్తుంటారు. తన వల్లనే అధికారంలోకి రావాలని కోరుకుంటారు. 2019 ఎన్నికలలో పాదయాత్రతో అది జరిగినా, 2024 ఎన్నికల్లోనూ అదే మైండ్ సెట్ తో వెళ్లడంతో దారుణ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. అధికారంలో ఉన్నప్పుడు ఏ రోజు కూడా కార్యకర్తల సమాశాలను జరిపింది లేదు. ప్లీనరీ ఏదో ఒకసారి తప్పించి అసలు నిర్వహించలేదు. క్యాడర్ తో కలవడం, వారితో కలసి భోం చేయడం వంటి పనులకు దూరంగా ఉన్నారు. టీడీపీ మహానాడు నిర్వహించేది కార్కకర్తల్లో ఉత్సాహం నింపడానికే. జెండా పట్టుకునే వారికి కనీసం ఏడాదికి ఒకసారి అయినా పలకరించాలన్న ధ్యాసను జగన్ మర్చిపోవడం వల్లనే మొన్నటి ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద నిలబడే వారు లేకపోయారుఇక అధికారంలో ఉన్న ఐదేళ్లు పార్టీ కార్యాలయం వైపు కన్నెత్తి కూడా చూడలేదు. ఓటమి తర్వాత గ్రౌండ్ లెవెల్ లో పరిస్థితి అర్థమయింది. నేతలు బయటకు రావడం లేదు. ధైర్యంగా వచ్చే కార్యకర్తలు సయితం నిర్లక్ష్యానికి గురి కావడంతో దూరంగా ఉన్నారు. వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకున్న జగన్ ఇక కార్యకర్తలకు పెద్దపీట వేయాలని నిర్ణయించారు. పోలింగ్ బూత్ లను కార్యకర్తలతోనే నియమించాలని నిర్ణయించారు. వారికి అన్ని రకాల సదుపాయాలను పార్టీ పరంగా కల్పించాలని డిసైడ్ చేసినట్లు తెలిసింది. ఇక మరొకవైపు అభ్యర్థుల ఎంపికపై కూడా టీడీపీ తరహాలోనే తన నిర్ణయం కాకుండా కార్యకర్తలు, ఐవీఆర్ఎస్ ద్వారా జనాభిప్రాయాన్ని తీసుకోవాలని జగన్ నిర్ణయించినట్లు సమాచారం. మొత్తం మీద జగన్ కార్యకర్తలకు చేరువయ్యే ప్రయత్నాలు ఎంత వరకూ ఫలిస్తాయన్నది మాత్రం కాలమే సమాధానం చెబుతుంది.

## అంబటి అరెస్ట్ - వైసీపీ ప్లాన్ బి?

**గుంటూరు, ఫిబ్రవరి 5, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు ఇప్పుడు ఎవరికీ అర్థం కానంత గజిబిజిగా మారాయి. కొద్ది రోజులుగా తిరుమల లడ్డూ కల్తీ అంశంపై సిట్ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడం, అసలు నెయ్యే వాడలేదని చెప్పడం, మాజీ టీటీడీ అధికారుల పేర్లు బయటకు రావడం వైసీపీని డిఫెన్స్‌లో పడేసింది. అదే సమయంలో జంతువుల కొవ్వులేదన్న అంశం ఆధారంగా ఎదురుదాడి ప్రారంభించింది. ఈ సమయంలో హఠాత్తుగా రాజకీయం మారిపోయింది. మాజీ మంత్రి అంబటి రాంబాబు వంటి నేతలు ఉద్దేశపూర్వకంగా అత్యంత అసభ్యకరమైన పదజాలాన్ని ఉపయోగించడం ప్రారంభించారు. ఇదంతా ఓ డైవర్షన్ గేమ్‌గా కనిపిస్తోంది. అంబటి రాంబాబు కారులో కూర్చుని మీడియా ప్రతినిధిని పిలిపించుకుని మరీ బూతులు తిట్టడం యథాలాపంగా జరిగింది కాదని స్పష్టమవుతోంది. ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రభుత్వం కచ్చితంగా స్పందిస్తుందని, అరెస్టులు జరుగుతాయని వారికి ముందే తెలుసు. అరెస్టు జరిగినప్పుడు దాన్ని రాజకీయ కక్ష గా చిత్రించడం, కాపు సామాజికవర్గ కార్డును వాడటం ద్వారా వైసీపీ తన క్యాడర్‌లో మళ్లీ ఊపు తీసుకురావాలని చూస్తోంది. అంబటిని 14 రోజుల రిమాండ్‌కు పంపడం, ఆయనపై 16కు పైగా కేసులు నమోదు కావడం ద్వారా ఒక రకమైన పొలిటికల్ విక్టిమైజేషన్ ఇమేజ్‌ను సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోంది. వైసీపీ నేతలు సృష్టించిన ఈ బూతుల డైవర్షన్ ట్రాప్‌లో పడకుండా కూటమి ప్రభుత్వం అప్రమత్తమైంది. అరెస్టులు, దాడుల వల్ల టాపిక్ మారుతోందని గమనించిన చంద్రబాబు నాయుడు, వెంటనే తన నేతలను అలర్ట్ చేశారు. చర్చను మళ్లీ లడ్డూ అంశంపైకే తీసుకువచ్చేలా మంగళవారం కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కేవలం సిట్ నివేదికకే పరిమితం కాకుండా, అందులోని లోపాలను , అసలు సూత్రధారులను పట్టుకోవడానికి ఒక ప్రత్యేక విచారణ కమిషన్‌ను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీని ద్వారా వైసీపీ బూతుల డైవర్షన్ ప్లాన్‌ను చెక్ పెట్టి, మళ్లీ లడ్డూ అస్త్రంతోనే వారిని డిఫెన్స్‌లోకి నెట్టింది. ఏపీ రాజకీయాల్లో ఈ మలుపులు అంతా ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారమే సాగుతున్నట్లు కనిపిస్తోంది. వైసీపీ తరపున ప్లాన్ చేస్తున్నది ఎవరో కానీ.. చర్చను లడ్డూ కల్తీ వంటి సెంటిమెంట్ ఇష్యూ నుంచి రాజకీయ ప్రతీకారం ఇష్యూలోకి మార్చడంలో కొంతవరకు సక్సెస్ అయ్యారు. అయితే, చంద్రబాబు తన అనుభవాన్ని రంగరించి, కేబినెట్ నిర్ణయాల ద్వారా మళ్లీ బంతిని వైసీపీ కోర్టులోకి విసిరారు. ముఖ్యంగా పయ్యావుల కేశవ్ వంటి మంత్రులు ఈ కమిషన్ కేవలం విచారణే కాకుండా, సిస్టమ్‌లోని లోపాలను సరిదిద్దేందుకే అని చెప్పడం ద్వారా ప్రభుత్వానికి ఉన్న క్లీన్ ఇంటెన్షన్ ను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయ పార్టీలు తమ వ్యూహాల కోసం టాపిక్స్‌ను డైవర్ట్ చేస్తున్నా, ప్రజలు మాత్రం లడ్డూ కల్తీ వ్యవహారంలో దోషులు ఎవరో తెలియాలని బలంగా కోరుకుంటున్నారు. బూతులు మాట్లాడే నేతలకు చట్టం పవర్ చూపించడం ఒక ఎత్తు అయితే, భక్తుల మనోభావాలను దెబ్బతీసిన వారిని శిక్షించడం మరో ఎత్తు. వైసీపీ నేతలు సానుభూతి కోసం ప్రయత్నిస్తుంటే, కూటమి ప్రభుత్వం న్యాయం కోసం విచారణ కమిషన్‌ను నమ్ముకుంది. ఈ డైవర్షన్ గేమ్ లో అంతిమంగా ఎవరిది పైచేయి అవుతుందన్నది ముందు ముందు తెలియనుంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## గడాఫీ కుమారుడి దారుణ హత్య

**హైదరాబాద్ పెన్ పవర్:** లిబియా నియంత ముమ్మార్ గడాఫీ కుమారుడు సయిఫ్ అల్ ఇస్లాం గడాఫీని (56) దారుణ హత్యకు గురయ్యారు. జింటాన్ నగరంలోని ఆయన ఇంట్లోకి చొరబడి గడాఫీని సాయుధ దుండగులు హత్య చేసినట్టు లిబియన్ భద్రత అధికారులు తెలిపారు. అయితే హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని వెల్లడించారు. సయిఫ్ మరణాన్ని ఆయన రాజకీయ సలహాదారు అబ్దుల్లా ఉస్మాన్ అబ్దు రహీం అధికారికంగా ధ్రువీకరించారు. ఈ మేరకు ఫేస్‌బుక్‌లో పోస్ట్ చేశారు. ఈ ఘటన ప్రణాళిక ప్రకారమే జరిగినట్టు పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో నలుగురు వ్యక్తులు ముసుగు వేసుకుని జింటాన్ నగరంలోని సయిఫ్ ఇంట్లోకి చొరబడినట్టు తెలిపారు. వెంటనే ఇంట్లోని సీసీటీవీ కెమెరాలను ధ్వంసం చేసి, ఆ తర్వాత తుపాకులతో ఆయనను కాల్చి చంపినట్టు తెలిపారు. అయితే హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని వెల్లడించారు. తన భద్రత గురించి సయిఫ్ తన స్నేహితుడి వద్ద ఆందోళన వ్యక్తం చేసినట్టుగా సమాచారం. ఈ నేపథ్యంలోనే గడాఫీ తెగకు చెందిన పెద్దలు ఆయనకు అదనపు భద్రతను పంపిస్తామని ప్రతిపాదించినప్పటికీ, సయిఫ్ దానిని తిరస్కరించినట్టు తెలుస్తోంది.

## ఎన్నికల నేపథ్యంలో నేపాల్ వ్యాప్తంగా 3లక్షల మంది భద్రతా సిబ్బంది మోహరింపు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎన్నికల నేపథ్యంలో భద్రతను పెంపొందించే నిమిత్తం నేపాల్ వ్యాప్తంగా వేలాదిగా బలగాలను మోహరించారు. మార్చి 5న జరిగే ఎన్నికలకుగానూ ముందస్తుగా మొత్తంగా మూడు లక్షల మంది భద్రతా సిబ్బందిని మోహరించారు. ఎన్నికల కోసం తాత్కాలికంగా బరిలోకి దింపిన పోలీసులను కూడా పలు ప్రాంతాల్లో నియమించారు. వేలాదిమంది యువకులను తాత్కాలికంగా పోలీసింగ్ విధుల కోసం నియమించారు. గతేడాది తీవ్రంగా చెలరేగిన నిరసనలతో అప్పటి ప్రభుత్వం కూలిపోయిన తర్వాత మొదటగా జరుగుతున్న ఎన్నికలు ఇవే. రాబోయే ఎన్నికలు మరింత స్వేచ్ఛగా, భద్రతా వాతావరణంలో జరిగేలా చూసేందుకు గానూ భద్రతా ఏర్పాట్లను అత్యంత కట్టుదిట్టంగా చేస్తున్నామని హోం శాఖ ప్రతినిధి ఆనందా కాఫ్లె చెప్పారు. అనుకున్న ప్రకారం ఎన్నికలు నిర్వహించడానికి తాము కూడా సిద్ధంగా వున్నామని నేపాల్ ఎన్నికల కమిషన్ ప్రకటించింది. గత సెప్టెంబరులో అవినీతి వ్యతిరేక నిరసనలు చెలరేగడంతో అప్పటి ప్రధాని కె.పి.శర్మ ఓలి రాజీనామా చేశారు. దాంతో అప్పటి నుంచి తాత్కాలిక ప్రభుత్వమే కొనసాగుతోంది. 77మంది మరణించగా, వేలాదిగా భవనాలు, ఇళ్ళు కూల్చివేశారు. ప్రభుత్వ ఆస్తులకు తీవ్రంగా నష్టం వాటిల్లింది.

## నేను పశ్చాత్తాపం వ్యక్తంచేస్తున్నా: ఎప్‌స్టీన్ కుంభకోణంపై బిల్‌గేట్స్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఆ వ్యవహారంలో మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్‌గేట్స్‌కు సంబంధించిన పలు విషయాలు వెల్లడయ్యాయి. దీనిపై తాజాగా గేట్స్ స్పందించారు. అతడితో ఉన్న ప్రతీ క్షణానికి చింతిస్తున్నానని చెప్పారు. ఈ మేరకు ఆస్ట్రేలియా మీడియా సంస్థతో మాట్లాడారు. "ఎప్‌స్టీన్ కోసం కేటాయించిన ప్రతీ క్షణానికి ఇప్పుడు నేను చింతిస్తున్నాను. అందుకు క్షమాపణలు కోరుతున్నాను. అయితే ఆ ఈ-మెయిల్‌లో ఉన్నది నిజం కాదు. అప్పుడు అతడి ఆలోచన ఏంటో నాకు తెలియదు. ఏదోఒక రూపంలో అతడు నన్ను టార్గెట్ చేయాలని ప్రయత్నించాడా..?" అని వ్యాఖ్యలు చేశారు. ఆ సెక్స్ కుంభకోణం దర్యాప్తునకు సంబంధించి 30 లక్షల పేజీల (ఇజూబబివతిని టతిశ్రీవబ)ను అమెరికా న్యాయశాఖ ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇందులో గేట్స్‌కు సంబంధించిన ఓ విషయం వెలుగులోకి వచ్చింది. ఆయన రష్యన్ మహిళలతో లైంగిక సంబంధాలు నెరిపాడని.. అందువల్లే ఆయన సుఖవ్యాధుల బారినపడ్డారని ఎప్‌స్టీన్ ఆరోపణలు చేశాడు. 2013లో తనకి తాను రాసుకున్న ఈ-మెయిల్‌లో అతడు ఈ విషయాలు ప్రస్తావించాడు. ఆ విషయం బయటపడకుండా ఉండేందుకు ఆయన మిలిందా (గేట్స్ మాజీ భార్య) (ఓవశ్రీతినిటజీ ఉజీబివబ)కు రహస్యంగా ఇచ్చేందుకు యాంటీబయాటిక్స్‌ను అడిగారని రాసుకొచ్చాడు. ఆ పరిణామాల తర్వాత తనతో ఉన్న ఆరేళ్ల స్నేహాన్ని గేట్స్ తెంచుకున్నాడని ఎప్‌స్టీన్ వెల్లడించాడు. అయితే ఈ-మెయిల్‌లోని అంశాలను గేట్స్ బృందం ఖండించింది. ఇదిలాఉంటే.. ఈ ఫైళ్ల విడుదల తర్వాత మిలిందా స్పందించిన సంగతి తెలిసిందే. "నా వివాహంలో ఎంతో బాధించే కొన్ని విషయాలు ఉన్నాయి. ఇప్పుడు బయటకు వచ్చిన వాటిపై సమాధానం ఇవ్వాల్సింది బిల్‌గేట్స్.. నేను కాదు. బాధిత మహిళలకు న్యాయం లభిస్తుందని ఆశిస్తున్నా" అని పేర్కొన్నారు.

## పుతిన్, ట్రంప్‌లకు జిన్‌పింగ్ ఫోన్

**హైదరాబాద్ పెన్ పవర్:** చైనా అధినేత షీ జిన్‌పింగ్.. బుధవారం రష్యా, అమెరికా అధ్యక్షులు పుతిన్, ట్రంప్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. పుతిన్‌తో మాట్లాడిన కొద్ది గంటల్లోనే ఆయన ట్రంప్‌తోనూ మాట్లాడటం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇలా ఒకే రోజు కొద్ది గంటల వ్యవధిలో జిన్‌పింగ్ ఇద్దరు అగ్ర నేతలతో మాట్లాడటం అరుదు. రష్యా, చైనాల మధ్య బంధాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి ప్రయత్నిస్తున్న నేపథ్యంలో పుతిన్‌తో చర్చలు జరిపినట్లు సమాచారం. రెండు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి భారీ ప్రణాళిక అవసరమని పుతిన్‌తో జిన్‌పింగ్ అన్నారు. అలాగే జపాన్‌తో సంబంధాలు దెబ్బతిన్న నేపథ్యంలో ట్రంప్‌తో జిన్‌పింగ్ మాట్లాడినట్లు భావిస్తున్నారు. కాగా ఇరాన్ అంశంపై జిన్‌పింగ్‌తో చర్చించానని ట్రంప్ తెలిపారు. తైవాన్‌పైనా, ఏప్రిల్‌లో తన చైనా పర్యటనపైనా చర్చించామని వెల్లడించారు. వాణిజ్య అంశాలూ చర్చకు వచ్చాయని తెలిపారు. ఇరాన్ విషయంలో తమకు సహకరించాలని జిన్‌పింగ్‌ను ట్రంప్ కోరినట్లు తెలిసింది. అమెరికాతో రష్యా 'స్టార్ట్' అణు ఒప్పందం గడువు తీరిపోతున్న నేపథ్యంలోనూ ఈ చర్చలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. కొత్త ఒప్పందంలో చేరాలని చైనాను అమెరికా కోరుతోంది. అయితే తమవద్ద రష్యా మాదిరిగా భారీ అణ్వాయుధాలు లేవని, అందుకే ఒప్పందంలో భాగం కాబోమని చైనా స్పష్టంచేస్తోంది.

## వాషింగ్టన్ పోస్టు దినపత్రికలో ఉద్యోగం కోల్పోయిన శశిథరూర్ కుమారుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ కుమారుడు ఇషాన్ థరూర్‌ను ఉద్యోగం నుంచి తొలగించారు. అమెరికాకు చెందిన ద వాషింగ్టన్ పోస్టు దినపత్రికలో ఇషాన్ థరూర్ జర్నలిస్టుగా చేస్తున్నారు. ఆ సంస్థలో తాజాగా ఉద్యోగుల్ని తొలగించారు. మూడో వంతు అంటే సుమారు 300 మందిపై వేటు వేశారు. ఎడిటోరియల్ సిబ్బందికి చెందిన మూడో వంతు మందిని తొలగించడంతో ఆ సంస్థపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. జర్నలిజం భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారినట్లు ఆందోళనకు గురవుతున్నారు. వాషింగ్టన్ పోస్టు పత్రికకు చెందిన విదేశీ బ్యూరో, లోకల్ రిపోర్టింగ్ బృందాలు, స్పోర్ట్స్ డెస్క్, బిజినెస్ డివిజన్‌లో చాలా మంది ఉద్యోగాలు కోల్పోయారు. ఎంపీ శశిథరూర్ కుమారుడు ఇషాన్ థరూర్.. ఆ పత్రికకు చెందిన అంతర్జాతీయ వ్యవహారాల్లో సీనియర్ కాలమిస్టుగా ఉన్నారు. తన ఉద్యోగం కోల్పోయిన విషయాన్ని ఇషాన తన ఎక్స్ అకౌంట్లో షేర్ చేశారు. చీకట్లో ప్రజాస్వామ్యం మరణిస్తుందని తన పోస్టుకు క్యాప్షన్ ఇచ్చారు. అయితే ఆ పోస్టును శశిథరూర్ మళ్లీ షేర్ చేశారు. బ్యాడ్ డే అంటూ పేర్కొన్నారు.

## దాడులపై ఎన్‌హెచ్‌ఆర్‌సికి వైసిపి ఎంపీల ఫిర్యాదు

**హైదరాబాద్ పెన్ పవర్:** తమ నేతలపై టిడిపి చేస్తున్న దాడులపై దర్యాప్తు చేయాలని వైసిపి డిమాండ్ చేసింది. బుధవారం నాడిక్కడ జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సి), జాతీయ ఎస్‌సి కమిషన్‌ను వైసిపి ఎంపిలు వైవి సుబ్బారెడ్డి, మిథున్‌రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, గొల్ల బాబూరావు, మేడా రఘునాథ్ రెడ్డి, అయోధ్య రామిరెడ్డి, తనూజ రాణి, మాజీ మంత్రులు, ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కూడిన బృందం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ.. టిడిపి చేస్తున్న దాడులపై దర్యాప్తు చేయాలని కోరినట్లు చెప్పారు. దర్యాప్తు చేసేందుకు ఎన్‌హెచ్‌ఆర్‌సి ఛైర్మన్ అంగీకరించారని అన్నారు. డిజిపి ద్వారా నివేదిక తీసుకుంటామని చెప్పారన్నారు. త్వరలోనే దర్యాప్తు కమిటీ రాష్ట్రానికి వస్తుందని భావిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి మేరుగ నాగార్జున మాట్లాడుతూ.. రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిగిపోయాయని, దాడులు, హత్యలను మానవ హక్కుల సంఘానికి వివరించామని అన్నారు.

# దేశ రక్షణ పరిశోధనలో ఆద్యుడు

**హైదరాబాద్ పెన్ పవర్:** సూరి భగవంతం (అక్టోబరు 14, 1909 – ఫిబ్రవరి 6, 1989) (వయసు 79) ప్రముఖ శాస్త్రవేత్త. దేశ రక్షణకు సంబంధించిన పరిశోధనల్లో ఆద్యుడు. ఆయన కృష్ణా జిల్లా ఆగిరిపల్లి గ్రామంలో అక్టోబరు 14, 1909 న జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసం అనంతరం హైదరాబాదు నిజాం కళాశాలలో డిగ్రీ (బి.ఎస్సీ) చదువు పూర్తిచేసి, మద్రాసు యూనివర్సిటీ నుండి బి.ఎస్.సి (భౌతిక శాస్త్రము) డిగ్రీని ప్రథమ శ్రేణిలో ప్రథముడుగా అందు కున్నారు. ఈ సందర్భంగా అనేక పతకాలను అందుకున్న విద్యార్థిగా కలకత్తాలో సర్ సి.వి.రామన్ దగ్గర రీసెర్చ్ స్కాలర్ గా చేరారు. ఆయన తన మేథో సంపత్తితో, శాస్త్రీయ దృక్పథంతో, ఆలోచనా సరళితో, ప్రయోగ శీలతతో సి.వి.రామన్ అభిమానాన్ని చూరగొని ప్రియ శిష్యుడయ్యారు. అక్కడే మద్రాసు విశ్వ విద్యాలయం నుండి ఎం.ఎస్సీ. పట్టాను సంపాదించారు. ఆయన 1932లో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో భౌతిక శాస్త్ర విభాగంలో అధ్యాపకుడుగా చేరారు. 1938లో ప్రొఫెసర్ గా పదోన్నతి పొందారు. బోధనా విధానంలో వీరిది చాలా సులభ శైలి. స్పష్టమైన వ్యక్తీకరణ, విశేషమైన ఆలోచన, కచ్చితమైన అనువర్తన, సమగ్రమైన దృష్టి, అద్భుతమైన ప్రతిభ లన్నీ కలగలిపి అయన బోధనా విధానాన్ని ఇతర శాఖల అధ్యాపకులు కూడా నేర్చుకునే వారని చెబుతారు. తన 28 వ యేటనే యింతటి ఉన్నత పదవిని అదిష్టించటం విశేషం. దీనికి కొద్ది కాలం ముందే యూనివర్సిటీ ఆయనకు డి.ఎస్‌సి డిగ్రీ ప్రదానం చేసింది. ఈయన 1948 వరకు ఈ పదవిలోనే ఉన్నారు. భగవంతం 1941లో కళాశాల ప్రిన్సిపాల్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. స్వాతంత్ర్యోద్యమ సమయంలో తన పరిపాలనా కౌశలం చూపి కళాశాలను విజయ వంతంగా నడిపారు. 1948-49 మధ్య లండన్ లోని భారత రాయబారి వి.కె. కృష్ణ మీనన్ కార్యాలయంలో వైజ్ఞానిక సలహాదారుగా పని చేశారు. చాలా ఐరోపా దేశాల్లో పర్యటించి వివిధ విజ్ఞాన విషయాల మీద ప్రసంగాలు చేశారు. 1949లో స్వదేశం తిరిగి వచ్చి ఉస్మానియా విశ్వ విద్యాలయంలో భౌతిక శాఖాధిపతిగా పదవీ బాధ్యతలు స్వీకరించారు. పరిశోధన వైపు దృష్టి కేంద్రికరించి 12 మంది డాక్టరేట్ లను తయారు చేశారు. తరువాత 1952లో విశ్వవిద్యాలయ ఉప కులపతిగా పదవిని చేపట్టారు. 1957లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఓ) సారథిగా బాధ్యతలు స్వీకరించినప్పుడు ప్రొఫెసర్ సూరి భగవంతం బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ డైరెక్టర్‌గా ఉన్నారు. అక్కడ పని చేస్తుండగా కృష్ణ మీనన్ ఒత్తిడి మీద 1961లో రక్షణ శాఖ పరిశోధనా సంస్థకు అధిపతిగాను, తనకు వైజ్ఞానిక సలహాదారుగా చేరారు. ఆ సమయంలో ప్రొఫెసర్ భగవంతం రక్షణ అవసరాలను తీర్చడానికి అనువర్తిత పరిశోధన, అభివృద్ధి దిశలో డీఆర్డీఓ ను నైపుణ్యంగా నడిపించారు. సుమారు ఎనిమిది సంవత్సరాలు డిఆర్‌డిఓ హెడ్‌గా పనిచేశారు. అక్టోబర్ 1969 లో తన పదవి నుండి పదవీ విరమణ చేసే సమయానికి, సంస్థ అనేక రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించింది. 1962 చైనా-భారత్ యుద్ధం తర్వాత వై. బి. చవాన్ రక్షణ మంత్రిగా ఉన్నప్పుడు ఆయన డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్ మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఒ.) అధిపతిగా చేరి ఎంతో ప్రగతి సాధించారు. భారత దేశమంతా ఇరవైకి పైగా ప్రయోగ శాలలను ప్రారంభించి యుద్ధ రంగానికి అవసరమైన క్షిపణులు, విమానాలు, ట్యాంకులు, రాడార్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు మొదలైన అనేక విషయాలలో విజయం సాధించారు. 1969లో పదవీ విరమణ చేశారు. ఆయన 300 పైగా పరిశోధన వ్యాసాలు ప్రచురించారు. ఇవి కాక గ్రూపు థియరీ, రామన్ ఎఫెక్ట్, క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్ అనే మూడు గ్రంథాలు రచించారు. 1961 జూలైలో కేంద్ర ప్రభుత్వ సర్వీస్ లో ప్రవేశించిన ప్రొఫెసర్ భగవంతం రక్షణ మంత్రికి సైంటిఫిక్ అడ్వయిజర్ గా నియమితు లైనప్పటికీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డి.ఆర్.డి.ఓ) కు డైరక్టర్ జనరల్ గా కూడా వ్యవహరించారు. భూతలం మీద, సముద్ర జలాల మీద, గాలిలో దేశ పోరాట శక్తులను అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బలోపేతం చేయటానికి డి.ఆర్.డి.ఓని ఒక సమర్థవంతమైన పనిముట్టుగా రూపొందించారు. శక్తివంతమైన అయుధంగా మలిచారు. ఆర్.డి.ఓను పటిష్ఠ పరచడంలో ఈయన చేసిన కృషి అసమానం. ఆర్గనైజేషన్ బ్రహ్మాండమైన ఎదుగుదలను సాధించింది. అనేకానేక ల్యాబరేటరిలను, సుశిక్షితులను రూపొందించారు. రక్షణ శాఖ పరిశోధనలలో అనేక మంది శాస్త్రవేత్తలకు ప్రవేశం కల్పించి, వారి మేధస్సుకు పదును పెట్టారు. డి.ఆర్.డి.ఓకు నేతృత్వం వహించిన 9 సంవత్సరాల వ్యవధిలో మిస్సైల్స్, ఎయిర్ క్రాఫ్ట్, ఏరో ఇంజన్స్, కొంబాట్ వెహికల్స్ (ట్యాంకులు మొదలైనవి) ఎలక్ట్రానిక్ వార్ ఫేర్ సిస్టమ్స్, హై ఎక్స్‌ప్లోజివ్స్, అండర్ వాటర్ వెపన్స్ మొదలగు వాటిని అభివృద్ధి చేయటానికి ల్యాబరేటరీలను స్థాపించారు. ఆధునిక యుద్ధ తంత్ర సాంకేతిక నైపుణ్య రంగంలో ఉన్న ఉద్యోగులకు శిక్షణ ఇప్పించారు. వారికి అవసరమైన సౌకర్యాలను కల్పించారు. దేశ రక్షణ శాఖకు అద్వితీయమైన సేవలు అందిస్తూనే మరోపక్క అవాంఛనీయ పోకడలను గమనిస్తూనే ఉన్నారు. ఒకసారి నోబెల్ బహుమతి గ్రహీత, భారత మిత్రుడు ప్రొఫెసర్ పి.ఎం.ఎస్.బ్లాకెట్ ప్రధాని నెహ్రూకు ఒక సలహా యిచ్చారు. దేశ రక్షణ శాఖ అభివృద్ధి చెందడానికి దేశీయ ఉత్పత్తుల రూపకల్పనను మినహాయించి ప్రత్యామ్నాయంగా దిగుమతులు చేసుకోవలసినదని, రాడార్స్, మిస్సైల్స్, యుద్ధ ట్యాంకుల కోసం దిగుమతుల మీద ఆధారపడటం ఉత్తమమని సలహా యిచ్చారు. ఈ సలహాను పూర్తిగా నిర్లక్ష్య పరిచేలా చేసిన ప్రొఫెసర్ భగవంతం మన దేశం

సర్వదా కృతజ్ఞతగా ఉండాలి. కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖకు శాస్త్ర సలహాదారునిగా విశేష కృషి చేసి, జాతీయ భావాలకు పరిపుష్టి కల్పించి అఖండ పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. భౌతిక శాస్త్ర రంగంలో మూడు ప్రామాణిక గ్రంథాలను, అనేక పరిశోధనా పత్రాలను వెలువరించారు. రామన్ ఎఫెక్ట్ అంశం మీద వివిధ కోణాలలో అధ్యయనం చేశారు. పునః పరిశోధనలు జరిపారు. "మాలిక్యులర్ లాటిస్ వైబ్రేషన్" అంశం మీద గ్రూప్ థియరిటికల్ అప్లికేషన్స్, వాయువుల గూర్చి రామన్ ఎఫెక్ట్ కు సంబంధించిన పరిశోధనలు మీద సునిశిత కృషి జరిపారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ లలో ఫెలోషిప్ మీద పరిశోధనలు నిర్వహించారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ అసోషియేషన్ వారి భౌతిక శాస్త్ర విభాగానికి అధ్యక్షులుగా (1946) వ్యవహరించారు. "1961 లో క్రిస్టల్ సిమెట్రీ అండ్ ఫిజికల్ ప్రాపర్టీస్" అనే బృహత్తర గ్రంథ రచన చేసి అంతర్జాతీయ ఖ్యాతిని పొందారు. కమిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ద డెవలపింగ్ కంట్రీస్ అధ్యక్షులుగా సి.వి.రామన్ పరిశోధించిన రామన్ ఎఫెక్టు అంశం మీద ప్రామాణిక పరిశోధనలు చేసిన అద్వితీయ శాస్త్రవేత్తగా కీర్తి గడించారు. రామన్ ఎఫెక్ట్, క్రిష్టల్ స్ట్రక్చర్ మొదలగు అంశాల మీద అవిశ్రాంత పరిశోధనలు జరిపి గ్రంథ రచనలు చేశారు. ఆయన 300 పైగా పరిశోధనా పత్రాలను వెలువరించారు. గ్రూప్ థీరీ, రామన్ ఎఫెక్టు అనే రెండు ఉత్తమ గ్రంథాలను కూడా చేశారు. ఇవి ప్రామాణిక గ్రంథాలుగా అంతర్జాతీయ ఖ్యాతిని పొంది, అనేక భాషలలోకి అనువదించటం జరిగింది. జాతీయ అంతర్జాతీయ ప్రతిష్ఠాత్మక సైంటిఫిక్, ప్రొఫెషనల్ సంస్థలు అనేకంలో ఆయన ఎలెక్టెడ్ ఫెలోగా ఉన్నారు. పలు యూనివర్సిటీలు గౌరవ డాక్టరేట్లతో సత్కరించాయి. సి.వి.రామన్ అనుంగు శిష్యునిగా, దేశ రక్షణ శాఖను బలోపేతం చేసిన దేశభక్తునిగా పేరొందిన ప్రొఫెసర్ భగవంతం తన 80 వ యేట 1989, ఫిబ్రవరి 6 వ తేదీన మరణించారు.

# అహింసా వాది సరిహద్దు గాంధీ

**హైదరాబాద్ పెన్ పవర్:** మహాత్మా గాంధీజీ లాగే ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్ అహింసా వాది. జాతిపిత గాంధీ అహింసా మార్గంలో అడుగులు వేసి బ్రిటీష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన స్వాతంత్ర్య సమరయోధుడు. అందుకే అయన సరిహద్దు గాంధీగా పేరెన్నిక గన్నాడు. ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్.... ఈ పేరును ఈ తరానికి చెందిన చాలా మంది విని ఉండక పోవచ్చు. కాని సరిహద్దు గాంధీ అంటే కొంత మందికి అయినా గుర్తుకు రావచ్చు. పాకిస్థాన్‌లోని పంఖ్తూన్ రాష్ట్రంలో ఒక పఠాన్‌గా జన్మించాడు. "ఆయుధం పట్టుకొని యుద్ధం చేసే పఠాన్ కన్నా అహింసా మార్గమే ఆయుధంగా ధరించిన పఠాన్ ప్రమాద కరమైన వ్యక్తి" అని బ్రిటీష్ పాలకులతో అనిపించుకున్న గొప్ప ధీరుడు. "నేను ఎట్టి పరిస్థితుల్లో అహింసా మార్గాన్ని వీడను. పగ, ప్రతీకారం జోలికి వెళ్లను. నన్ను అణచివేసిన, హింసించిన వ్యక్తులను కూడా క్షమిస్తాను" అన్న ప్రతిజ్ఞతో 'కుదాయ్ కిద్మత్ గర్' పేరిట భారత స్వాతంత్ర్య పోరాటానికి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసిన శాంతి కాముకుడు సరిహద్దు గాంధీ. "బాద్షా ఖాన్" గా కూడా సరిహద్దు గాంధీ పేరుగాంచాడు. స్వాతంత్ర్య సమర యోధుడు, గాంధేయవాది. భారతరత్న పురస్కారాన్ని పొందిన తొలి భారతీయేతరుడు. "ఎర్రచొక్కాల ఉద్యమం" ప్రారంభించిన ప్రముఖుడు. ఆయన అనుచరులను "ఖుదాయీ ఖిద్మత్‌గార్" (భగవత్సేవకులు) అని పిలిచేవారు. అయన పష్తో లేదా పక్తూనిస్తాన్ కు చెందిన రాజకీయ, ధార్మిక నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ భారత దేశంలో బ్రిటిష్ ఆక్రమణకు వ్యతిరేకంగా పోరాడిన స్వాతంత్ర్య యోధుడు. 'బచా ఖాన్' గా ప్రసిద్ధి చెందిన అయన మహాత్మా గాంధీకి చాలా సన్నిహితుడు, మిత్రుడు, ఆయన భారత దేశంలో సరిహద్దు గాంధీగా, పాకిస్తాన్లో బచా ఖాన్ గా సుపరిచితులు. జనవరి 30, 1948 న మహాత్మా గాంధీ హత్యకు 40 సంవత్సరాల తరువాత జనవరి 20, 1988 న మరణించాడు. ఇస్లాం యొక్క గొప్ప అహింసా సైనికుడు. వేలాది అహింసా పఠాన్‌ల విధేయతను పొందిన గొప్ప జాతీయవాద నాయకుడు. అబ్దుల్ గఫర్ ఖాన్ 1890 ఫిబ్రవరి 6 న నాటి అవిభక్త భారత దేశంలోని, నేటి పాకిస్తాన్లో ఉన్న వాయువ్య సరిహద్దు నగరమైన ఉత్మాన్జైలో జన్మించాడు. 1910 లో, 20 సంవత్సరాల వయస్సులో, బెచే ఉత్మాన్జై లోని ఒక మసీదులో ఒక పాఠశాలను స్థాపించాడు. 1921 లో 'అంజుమాన్-ఇ ఇస్లా-ఇ అఫ్ఘనియా' (అఫ్ఘన్ రిఫార్మ్ సొసైటీ), అలాగే 1927 లో యువత ఉద్యమమైన 'పాక్తున్ జిర్గా' స్థాపించాడు. మే 1928 లో, బచా ఖాన్ తీర్థయాత్ర నుండి మక్కాకు తిరిగి వచ్చిన తరువాత, పాష్టో భాషలో నెలవారీ రాజకీయ పత్రిక 'పాక్తున్' (పాష్తున్) ను స్థాపించాడు. భారత స్వాతంత్ర్యం కోసం ఖాన్, ఐక్య, లౌకిక, స్వతంత్ర దేశం లక్ష్యాన్ని సాధించగల ఏకైక స్థిరమైన మార్గం... గాంధీ 'సత్యాగ్రహం' సూత్రాలను గట్టిగా అవలంబించడం

ద్వారా మాత్రమే, అని నిర్ధారణకు వచ్చాడు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమం ఊపందుకుంది. ఆయన 1920 లలో 'ఖుదై ఖిద్మత్గర్' (దేవుని సేవకులు) ను స్థాపించాడు. 1928 లో ఖాన్ మొట్టమొదటి సారిగా మహాత్మా గాంధీని కలుసు కున్నాడు. భారత కాంగ్రెస్ పార్టీతో సంబంధం కలిగి ఉన్నాడు. అతి త్వరలో ఆయన గాంధీకి అత్యంత సన్నిహితుడు అయ్యాడు. స్వతంత్ర, అవిభక్త, లౌకిక... హిందువులు, ముస్లింలు కలిసి శాంతితో జీవించే భారతదేశం గురించి కలలు కన్నాడు. 1931 లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవి వరించినా, "నేను ఒక సాధారణ సైనికుడిని, ఖుదై ఖిద్మత్గర్... అల్లా సేవకునిగా మాత్రమే నేను సేవ చేయాలను కుంటున్నాను" అని చెప్పి సున్నితంగా తిరస్కరించాడు. అయన చాలాకాలం కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ కమిటీలో సభ్యుడిగా మాత్రం ఉన్నాడు. భారత భూభాగంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా మహాత్మా గాంధీ పోరాడు తుండగా, అప్పటి వాయువ్య సరిహద్దు ప్రావిన్స్ అని పిలువబడే ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్లో భాగమైన ఆ దేశంలోని వాయువ్య ప్రాంతంలో లక్ష మందిని తుపాకులు వాడడానికి, బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా అహింసాత్మకంగా పోరాడడానికి ప్రతిజ్ఞ చేయడానికి ఒప్పించాడు. ఆ సైన్యాన్ని అల్లాహ్ సేవకులు ఖుదై ఖిద్మత్గర్ అని పిలిచాడు. లక్ష మంది ముస్లింలు అయన "ఖుదై ఖిద్మత్గర్" లేదా "అల్లాహ్ యొక్క సేవకులు" ఉద్యమంలో చేరారు. మహాత్మా గాంధీ తత్వాన్ని అనుసరించాల్సిన అవసరాన్ని ఖాన్ వారికి వివరించి ఒప్పించాడు. బ్రిటిష్ పాలన ముగిసిన తరువాత భారత దేశాన్ని విభజించ కూడదని డిమాండ్ చేయడం ద్వారా, ఖాన్ ముస్లింలలో చాలా మందికి శత్రువుగా మారాడు. తన ప్రజల హక్కుల కోసం నిరంతరం ఆయుధాలు ఎత్తకుండా కష్టపడ్డాడు. గాంధీ మాదిరిగానే, గఫర్ ఖాన్ తన ప్రజల అభ్యున్నతి స్వాతంత్ర్య సాధన ద్వారానే సాధ్య మని నిజాయితీగా నమ్మాడు. ఖాన్ ప్రావిన్స్ లో పాఠశాలలను తెరిచాడు. మహిళలను సమాజ ప్రధాన స్రవంతిలోకి తీసుకు రావడానికి కృషి చేశాడు. తన అహింసా సైనికులను రోజుకు కనీసం రెండు గంటల సామాజిక పని చేయమని ప్రోత్సహించాడు. భారత విభజనకు తీవ్రంగా వ్యతిరేకించిన ఆయన భారత రాజకీయ నాయకులతో కలసి స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నాడు. భారతదేశ రాజకీయ నాయకులతో మరీ ముఖ్యంగా గాంధీ నెహ్రూ, కాంగ్రెస్ పార్టీతో కలసి పోరాటం సలిపాడు. సరిహద్దు ప్రాంతపు ముస్లిం లీడర్లు, ఆయన ముస్లింల ద్రోహి అని 1946 లో హత్యా ప్రయత్నం చేసారు. మొదటి నుంచి దేశ విభజనను వ్యతిరేకిస్తూ వచ్చిన ఖాన్ చివరకు నిర్ణయాన్ని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీకే వదిలేశాడు. ఆ సమావేశం అత్యధిక మెజారిటీతో దేశ విభజన తీర్మానాన్ని ఆమోదించింది. ఆ సమావేశంలో గఫర్ ఖాన్‌తో పాటు మహాత్మాగాంధీ, రామ్ మనోహర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్‌లు పాల్గొనలేదు.

'మీకు అండగా నిలబడ్డాం. మీతో పాటు పఠాన్లు దేశ స్వాతంత్ర్యం కోసం ఎన్నో త్యాగాలు చేశారు. సరిహద్దు ప్రాంత వాసులకు ద్వేషిగా మారాడు. దేశ విభజన ఆగలేదు. అబ్దుల్ గఫార్ ఖాన్ పరిస్థితి అగమ్యగోచరమయ్యింది. బాద్షా ఖాన్, అనుయాయులు, భారత పాకిస్తాన్ నాయకులు తీవ్రంగా ద్రోహం చేశారని భావించారు. కాంగ్రెస్ పార్టీని, భారత రాజకీయ నాయకులను ఉద్దేశించి బాద్షాహ్ ఖాన్ అన్న ఆఖరి మాటలు, "మీరు మమ్మల్ని తోడేళ్ళ ముందు విసిరేసారు". అల్లర్లు, హింసతో ఏమీ సాధించలేమని, శాంతి, సౌభ్రాతృత్వాలతో సంపాదించింది శాశ్వతంగా మిగిలి పోతుందని పిలుపు నిచ్చాడు. ఇటు బ్రిటీష్ ఇండియాలో, అటు పాకిస్థాన్‌లో 27 ఏళ్లపాటు జైలు జీవితాన్ని అనుభవించిన సరిహద్దు గాంధీ అఫ్ఘానిస్థాన్‌లోని కాబూల్ నగరానికి వెళ్లి ప్రవాస జీవితం గడిపాడు. 1969లో మహాత్మాగాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా గఫర్ ఖాన్ భారత్‌కు వచ్చాడు. ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఢిల్లీకి వచ్చి అంతర్జాతీయ అవగాహన కింద ఇచ్చే 'జవహర్ లాల్ నెహ్రూ అవార్డు' అందుకున్నాడు. పార్లమెంట్ సంయుక్త సమావేశంలో మాట్లాడుతూ 'మీరు బుద్ధుడిని మరచి పోయినట్లు గానే గాంధీని మరచి పోతున్నారు' అంటూ ఆవేదన వ్యక్తం చేశాడు. తుది శ్వాస విడిచేంత వరకు నమ్ముకున్న సిద్ధాంతానికే కట్టుబడి జీవించిన గఫర్ ఖాన్ పాకిస్థాన్‌లోని పెషావర్‌లో 1988, జనవరి 20వ తేదీన ఆయన మరణించారు.

# పెరుగుతున్న ప్రయివేట్ పాఠశాలలు

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రయివేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు విస్తరిస్తున్నప్పటికీ, దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల సంఖ్యలో స్థిరమైన క్షీణతను కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఇది భారతదేశ ప్రభుత్వ విద్యా వ్యవస్థ యొక్క మారుతున్న స్వభావంపై ఆందోళనలను రేకెత్తిస్తోంది. ఎంపీ డాక్టర్ జాన్ బ్రిట్టాస్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా రాజ్యసభలో ఈ విషయాన్ని వెల్లడించారు. యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ (యూడీఐఎస్‌ఈ) నుంచి వచ్చిన అధికారిక డేటా ప్రకారం? దేశంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 2020-21 విద్యా సంవత్సరంలో 10,32,049 నుంచి 2024-250 10,13,3225 ?? ఐదేండ్లలో దేశవ్యాప్తంగా నికరంగా 18,727 ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి. దీనికి విరుద్ధంగా.. ప్రయివేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలల సంఖ్యలో గణనీయమైన పెరుగుదల కనిపించింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, వాటి సంఖ్య 2023-24లో 3,31,108 20 2024-250 3,39,5836 పెరిగింది. కేవలం ఒక్క సంవత్సరంలోనే 8,475 ప్రయివేట్ పాఠశాలలు అదనంగా చేరాయి. రాష్ట్రాల వారీగా డేటా గణనీయమైన ప్రాంతీయ వ్యత్యాసాలను హైలైట్ చేస్తుంది.



2023-24, 2024-25 మధ్య ప్రభుత్వ పాఠశాలల సంఖ్యలో అత్యధిక తగ్గింపు బీహార్ లో నమోదైంది. అక్కడ 1,800 పాఠశాలలు మూతపడ్డాయి. హిమాచల్ ప్రదేశ్లో 492 పాఠశాలలు, కర్నాటకలో 462 పాఠశాలలు తగ్గాయి. గణనీయమైన తగ్గుదలలను చూసిన ఇతర రాష్ట్రాలలో అరుణాచల్ ప్రదేశ్ (289), మహారాష్ట్ర (273), అసోం (267), మధ్యప్రదేశ్ (189) ఉన్నాయి. అదే సమయంలో, ఉత్తరప్రదేశ్ ప్రయివేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల సంఖ్యలో అత్యధిక పెరుగుదలను నమోదు చేసిన రాష్ట్రంగా నిలిచింది. ఒక్క సంవత్సరంలోనే 7,873 అటువంటి సంస్థలు అదనంగా చేరాయి. బీహార్ లో 2,107 ప్రయివేట్ పాఠశాలలు, ఆ (755), (348), ఆంధ్రప్రదేశ్ (241), మహారాష్ట్ర (104) త్రిపుర (90) పెరిగాయి. ఈ గణాంకాలు ప్రయివేట్ విద్యపై ఆధారపడటాన్ని ప్రభుత్వ విద్యా వ్యవస్థ సంకోచాన్ని నొక్కి చెబుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల మూసివేత, ముఖ్యంగా అణగారిన, గ్రామీణ వర్గాలకు చెందిన విద్యార్థులకు సరసమైన, సమానమైన విద్యను పొందే అవకాశాన్ని ప్రతికూలంగా ప్రభావితం చేయవచ్చు.

# భారత్ ఎక్కడి నుంచైనా చమురు కొనుగోలు చేయవచ్చు




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్, అమెరికా మధ్య నిర్ణయాత్మకమైన ట్రేడ్ డీల్ జరగడం కీలక పరిణామంగా మారిన విషయం తెలిసిందే. ఇరు దేశాల మధ్య కుదిరిన ఈ ఒప్పందంతో భారత్ నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై అమెరికా సుంకాలను 25 శాతం నుంచి 18 శాతానికి తగ్గించింది. అయితే ఒప్పందం నేపథ్యంలో భారత్ రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే అంశంపై అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. భారతదేశం తన చమురు అవసరాల కోసం ఏ దేశం నుంచి అయినా ముడి చమురు కొనుగోలు చేసే స్వేచ్ఛను కలిగి ఉందని రష్యా స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ ఈ మేరకు స్పందించారు. రష్యాతో చమురు కొనుగోళ్లను నిలిపివేసి, అమెరికా, వెనిజులా నుంచి చమురును కొనుగోలు చేసేందుకు ప్రధాని నరేంద్ర మోడీ అంగీకరించారని, తద్వారా భారత్‌పై సుంకాలను తగ్గిస్తున్నట్లు ట్రంప్ ప్రకటించారు. ఈ ఒప్పందం వల్ల ఉక్రెయిన్ యుద్ధం ముగియడానికి సహాయపడుతుందని ట్రంప్ పేర్కొన్నారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలపై స్పందిస్తూ, "భారత్ తన చమురు సరఫరాదారులను వైవిధ్య పరచుకోవడంలో మాకు కొత్తేమీ కనిపించడం లేదు" అని పెస్కోవ్ అన్నారు. "భారత్‌కు రష్యా మాత్రమే ఏకైక చమురు సరఫరాదారు కాదని ప్రపంచ ఇంధన నిపుణులందరికీ తెలుసు. భారత్ ఎప్పుడూ వివిధ దేశాల నుంచి చమురును కొనుగోలు చేస్తూనే ఉంటుంది, కాబట్టి ఇందులో వింతేమీ లేదు" అని ఆయన వివరించారు.

## ఎయిర్ ఇండియా 'నమస్తే వరల్డ్' ఆఫర్లు




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. 'నమస్తే వరల్డ్' పేరుతో తీసుకొచ్చిన ఈ ఆఫర్ల కింద విమాన టికెట్‌పై 20 శాతం తగ్గింపు ధరతో విక్రయిస్తున్నది. దీంతో దేశీయంగా ప్రారంభ విమాన టికెట్ ధర రూ.1,499గా నిర్ణయించిన సంస్థ..అంతర్జాతీయ రూట్‌లో రూ.5,033కి విక్రయించనున్నది. ఉత్తర అమెరికా, యూరప్, బ్రిటన్, ఆస్ట్రేలియా దేశాల మధ్య నడిచే విమాన సర్వీసులకు ఈ ఆఫర్ వర్తించనున్నది. గురువారం అర్ధరాత్రి లోపు బుకింగ్ చేసుకోనున్న ప్రయాణికులు ఈ నెల 11 నుంచి డిసెంబర్ 31లోగా ఎప్పుడైనా ప్రయాణించవచ్చునని తెలిపింది. బుకింగ్ చేసుకున్న తేదీని మార్చుకునే అవకాశం కూడా ప్రయాణికులకు కల్పించింది. జీతితీతినిటతిజీ.ఇనీఎ, కంపెనీ మొబైల్ యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న వారికి మాత్రమే ఈ ఆఫర్ వర్తించనున్నది. అలాగే ఎస్బీఐ క్రెడిట్ కార్డుతో బుకింగ్ చేసుకున్నవారికి రూ.10 వేల వరకు రాయితీ లభించనున్నది.

# ఉద్యోగులకు కాగ్నిజెంట్ గుడ్‌న్యూస్




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రముఖ ఐటీ సేవల సంస్థ కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ తమ ఉద్యోగులకు గుడ్‌న్యూస్ చెప్పింది. 2025 సంవత్సరానికి గానూ 100శాతం బోనస్ ప్రకటించింది. రెండేళ్లకు ముందే కంపెనీ తన లక్ష్యాలను చేరినందుకు గానూ ఈ బోనస్ చెల్లింపులు చేయనున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ మేరకు కాగ్నిజెంట్ సీఈఓ ఎస్.రవికుమార్ ఉద్యోగులకు పంపిన ఈ-మెయిల్ సందేశంలో పేర్కొన్నారు. "ఉద్యోగుల క్రమశిక్షణ, పనితీరు, కాగ్నిజెంట్‌పై మన క్లయింట్ల నిబద్ధతకు 2025లో కంపెనీ సాధించిన ఫలితాలే ప్రత్యక్ష ఉదాహరణ. ఉద్యోగుల కృషికి గుర్తింపుగా.. 100శాతం బోనస్ ప్రోగ్రామ్‌ను అమలుచేస్తాం" అని రవికుమార్ తన సందేశంలో తెలిపారు. ఆదాయ వృద్ధి, లాభాలు వంటి అంశాల ఆధారంగా ప్రపంచవ్యాప్తంగా అత్యుత్తమ పనితీరు కనబరిచిన అగ్రశ్రేణి సంస్థల జాబితాలో కాగ్నిజెంట్ చేరింది. 'విన్నర్స్ సర్కిల్'గా అభివర్ణించే ఈ జాబితాలో 2027 నాటికి చేరాలని కాగ్నిజెంట్ లక్ష్యంగా పెట్టుకోగా.. 2025లోనే కంపెనీ దాన్ని సాధించగలిగింది. 2025 మొత్తానికి కాగ్నిజెంట్ ఆదాయం 7% పెరిగి 21.10 బిలియన్ డాలర్ల (సుమారు రూ.1.90 లక్షల కోట్ల)కు చేరింది. జనవరి-డిసెంబరును ఆర్థిక సంవత్సరంగా ఈ కంపెనీ పరిగణిస్తుంటుంది. అమెరికా కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఈ సంస్థకు ప్రపంచవ్యాప్తంగా మొత్తం 3.50 లక్షల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో మెజార్టీ ఉద్యోగులు భారత్‌లోనే పని చేస్తున్నారు.

# 400 బిలియన్ డాలర్ల ఆదాయంతో గూగుల్ సరికొత్త రికార్డు



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ భారీ ఆదాయంతో సరికొత్త రికార్డు సృష్టించింది. 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కళ్ళు చెదిరే ఫలితాలను ప్రకటించింది. కంపెనీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా వార్షిక ఆదాయం ఐ400 బిలియన్ల (దాదాపు 33 లక్షల కోట్లు) మార్కును అధిగమించి సరికొత్త రికార్డును నెలకొల్పింది. ఈ మేరకు గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్ ఎక్స్ వేదికగా పూర్తి గణాంకాలతో ఆసక్తికరమైన పోస్టును పెట్టారు. అందులో ఈ అద్భుత విజయానికి ప్రధాన కారణం గూగుల్ ప్రవేశపెట్టిన సరికొత్త ఏఐ మోడల్ 'ఉవఎతినితి 3' అని సీఈఓ సుందర్ పిచాయ్ పేర్కొన్నారు. కంపెనీ చరిత్రలో మరే మోడల్‌కు లేనంత వేగంగా జెమిని 3ని వినియోగదారులు ఆదరిస్తున్నారని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఏఐ ప్రపంచానికి పోటీగా గూగుల్ తీసుకొచ్చిన జెమిని యాప్‌ను నెలకు 750 మిలియన్ల మంది యాక్టివ్ యూజర్లు ఉపయోగిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. దీంతో గూగుల్ క్లౌడ్ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 48% పెరిగి, ఏడాదికి ఐ70 బిలియన్ల రన్-రేట్‌కు చేరుకుంది. అలాగే యూట్యూబ్ యాడ్స్, సబ్‌స్క్రిప్షన్ల ద్వారా 2025లో ఐ60 బిలియన్లకు పైగా ఆదాయం సమకూరినట్లు తెలిపారు. గూగుల్ సెర్చ్ విభాగం ఆదాయంలో 17% వృద్ధి నమోదు చేసింది. గూగుల్ వన్, యూట్యూబ్ ప్రీమియం వంటి పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ల సంఖ్య 325 మిలియన్లు దాటడటంతో భారీగా ఆదాయం సమకూరింది. డైరెక్ట్ ఏఐ వినియోగం ద్వారా నిమిషానికి 10 బిలియన్లకు పైగా టోకెన్లను జెమిని ప్రాసెస్ చేస్తోంది. 2025 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గూగుల్ కళ్ళు చెదిరే ఫలితాలను సాధించడంతో పాటు భారీగా ఆదాయాన్ని సమకూర్చుకుంది. దీంతో 2026 ఆర్థిక సంవత్సరంపై సుందర్ పిచాయ్ ధీమా వ్యక్తం చేశారు.

"మా పూర్తి స్థాయి ఏఐ స్టాక్ మా పురోగతికి ఇంధనంగా పనిచేస్తోంది. 2026లోకి మేము మరింత ఉత్సాహంగా, బలమైన స్థితిలో అడుగుపెడుతున్నాము. రాబోయే రోజుల్లో మరిన్ని అద్భుతాలు చూడబోతున్నారు" అని సుందర్ పిచాయ్ తన ప్రకటనలో తెలిపారు. దీంతో కేవలం సెర్చ్ ఇంజిన్‌గానే కాకుండా, ఏఐ, క్లౌడ్ రంగాల్లో కూడా గూగుల్ తిరుగులేని శక్తిగా ఎదుగుతోందని ఈ గణాంకాలు నిరూపిస్తున్నాయి.

# ఎంసీఎక్స్‌లో వెండి ధర 6 శాతం పతనం

# ఇన్వెస్టర్లలో మొదలైన గుబులు




**హైదరాబాద్ పెన్ పవర్:** హద్దులు లేకుండా దూసుకుపోయిన వెండి ధరలు ఒక్కసారిగా కుప్పకూలాయి. ఎంసీఎక్స్ మార్కెట్‌లో వెండి ధరలు ఒకే రోజు సుమారు 6 శాతానికి పతనమై అందరినీ ఆశ్చర్యపోయేలా చేస్తున్నాయి. దీంతో కిలో వెండి ధర తన రికార్డు స్థాయి నుంచి భారీగా దిగిరావడంతో ఇన్వెస్టర్లలో గుబులు మొదలైంది. జనవరిలో రూ.4.20 లక్షల గరిష్ట స్థాయిని తాకిన వెండి, ఫిబ్రవరి మొదటి వారంలో ఏకంగా రూ.1.94 లక్షల వరకు పడిపోయింది. అమ్మకాల ఒత్తిడి ఎంత తీవ్రంగా ఉందంటే, మార్కెట్‌లో వెండి ఫ్యూచర్స్ లోయర్ సర్క్యూట్‌ను తాకాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ కొత్త చైర్మన్‌గా కెవిన్ వార్ష్ నియామకం జరిగే అవకాశం ఉందన్న వార్తలతో డాలర్ ఇండెక్స్ బలపడింది. ఇది బంగారం, వెండి ధరలపై తీవ్ర ఒత్తిడిని పెంచింది. గత నెలలో వెండి ధరలు 150 శాతానికి పైగా పెరగడంతో ఇన్వెస్టర్లు ఒక్కసారిగా లాభాలను స్వీకరించడం ప్రారంభించారు. అదేవిధంగా మరోవైపు 2026 కేంద్ర బడ్జెట్‌లో దిగుమతి సుంకాలపై వచ్చిన ఊహాగానాలు కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. అంతర్జాతీయ ఎక్స్ఛేంజీలు వెండిపై మార్జిన్ అవసరాలను పెంచడంతో ట్రేడర్లు తమ వద్ద ఉన్న నిల్వలను విక్రయించాల్సి వచ్చింది. ఇంత భారీ పతనం సంభవించినప్పటికీ ఆర్థిక నిపుణులు మాత్రం ఈ పరిణామాన్ని హెల్తీ కరెక్షన్‌గా పేర్కొనడం గమనార్హం.

# మళ్లీ బంగారం, వెండి ధరలు ధమాల్



**హైదరాబాద్ పెన్ పవర్:** పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తున్న వేళ పేద, మధ్య తరగతి కుటుంబాలకు బంగారం, వెండి ధరలు అమాంతం దిగి వస్తున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో నేడు 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం10 గ్రాములపై ఏకంగా రూ.5,020 తగ్గి, ప్రస్తుతం రూ. 1,54,420 వద్ద కొనసాగుతోంది. అదేవిధంగా ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములపై రూ.4,600 మేర పడిపోయింది. దీంతో నేటి ధర రూ.1,41,550కు చేరింది. అదేవిధంగా బంగారంతో పాటే వెండి ధర కూడా నేలచూపులు చూసింది. కేవలం ఒక్కరోజు వ్యవధిలోనే వెండి ధర భారీగా పతనమైంది. నిన్నటి ధరతో పోలిస్తే ఏకంగా రూ.20 వేలు తగ్గి,

ప్రస్తుతం రూ.3 లక్షల వద్దకు చేరుకుంది. అయితే, గత ఐదు రోజులుగా వరుసగా తగ్గుతూ వచ్చిన ధరలు, నిన్నటి రోజున స్వల్పంగా పెరిగిన విషయం తెలిసిందే. అయితే, ఆ సంతోషం ఎంతోసేపు నిలవలేదు. అంతర్జాతీయ మార్కెట్లలో చోటుచేసుకున్న పరిణామాలు, డాలర్ విలువలో మార్పుల కారణంగా ఒక్క రోజులోనే ధరలు మళ్లీ భారీగా పతనమయ్యాయి. ఈ తగ్గుదల ఇలాగే కొనసాగుతుందా లేదా మళ్లీ పుంజుకుంటుందా అనేది మార్కెట్ నిపుణుల విశ్లేషణపై ఆధారపడి ఉంటుంది.

## అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గిందా?

**హైదరాబాద్ పెన్ పవర్:** వాణిజ్య ఒప్పందంలో అమెరికా ఒత్తిడికి భారత్ తలొగ్గిందా అని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. పార్లమెంటు జరుగుతున్న సమయంలో ఈ ప్రకటన రావడం అనుమానాలకు తావిస్తోందని వ్యాఖ్యానించారు. అమెరికా ఉత్పత్తులపై సున్నా సుంకాలకు భారత్ అంగీకరించిందా అని నిలదీశారు. రైతులకు రక్షణ కల్పించే చర్యలున్నాయా అని బుధవారం ఎక్స్‌లో ఖర్గే ప్రశ్నించారు. 'మన్మోహన్ సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలో అమెరికాతో కుదిరిన అణు ఒప్పందం ద్వారా రెండు దేశాల మధ్య సంబంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నామని యూపీఏ ప్రభుత్వం నిరూపించింది. అంతేకాకుండా కీలకమైన ఆ డీల్‌కు సంబంధించిన పలు ఒప్పందాల విషయంలో పార్లమెంటు అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్నాం. కానీ ప్రస్తుత ఒప్పందం గురించి దేశంలో ఎవరికీ ఏమీ తెలియదు. ఏకంగా అమెరికా అధ్యక్షుడు ఏకపక్షంగా ప్రకటన చేశారు. పార్లమెంటు జరుగుతున్న సమయంలో బయట ప్రకటన రావడం తగదు' అని ఖర్గే వ్యాఖ్యానించారు.

## ముంబయిలో లిఫ్ట్‌లో గ్యాస్ బెలూన్లు పేలి మంటలు..

**హైదరాబాద్ పెన్ పవర్:** ముంబయిలో గ్యాస్‌తో నింపిన బెలూన్లు ఒక్కసారిగా పేలి లిఫ్ట్‌లో మంటలు చెలరేగిన ఘటన కలకలం రేపింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ముంబయి గోరెగావ్ (వెస్ట్) ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో బెలూన్లు డెలివరీ చేసేందుకు రాజ్‌కుమార్ మహతో అనే వ్యక్తి లిఫ్ట్‌లోకి ఎక్కాడు. అదే సమయంలో వైద్య విద్యార్థిని హిమానీతో పాటు మరో యువకుడు కూడా లిఫ్ట్‌లోకి వచ్చారు. లిఫ్ట్ కదలకముందే బెలూన్లు ఒక్కసారిగా పేలిపోవడంతో భారీగా మంటలు చెలరేగాయి. దీంతో భయంతో ముగ్గురూ వెంటనే లిఫ్ట్

## ప్రజాస్వామ్యాన్ని రక్షించండి: మమత

**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమ బెంగాల్‌లో కొనసాగుతున్న ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై జోక్యం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని రక్షించాలని సుప్రీంకోర్టుకు ఆ రాష్ట్ర సీఎం మమతా బెనర్జీ విజ్ఞప్తి చేశారు. తమ రాష్ట్రాన్ని లక్ష్యంగా చేసుకున్నారని, అర్హులైన ప్రజలను ఓటర్ల జాబితాల్లో చేర్చడం లేదని ఆరోపించారు. సర్ కసరత్తును వ్యతిరేకిస్తూ దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కోర్టులో బుధవారం ఆమె స్వయంగా వాదనలు వినిపించారు. ఈ ధర్మాసనంలో జస్టిస్ జోయ్‌మల్యాబాగ్చి, జస్టిస్ విపుల్ ఎం పంచోలి కూడా సభ్యులుగా ఉన్నారు. ఎన్నికల సంఘానికి ఇప్పటికే ఆరు లేఖలు రాశానని, తమకు ఎక్కడా న్యాయం జరగలేదని త్రిసభ్య ధర్మాసనానికి మమతా బెనర్జీ తెలిపారు.

సుప్రీంకోర్టు న్యాయం చేయాలని అభ్యర్థించారు. సర్ కసరత్తును భాజపా పాలిత అస్సాంలో ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. వాదనల అనంతరం ఎన్నికల సంఘంతో పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్య ఎన్నికల అధికారికి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. ఈ నెల 9వ తేదీకల్లా సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ అదే రోజుకు కేసు విచారణను వాయిదా వేసింది. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్‌దివాన్ కూడా వాదనలు వినిపించారు.

## మోదీని చుట్టుముట్టిన మహిళా ఎంపీలు

**హైదరాబాద్ పెన్ పవర్:** విపక్ష మహిళా ఎంపీలు లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీతోసహా అధికార పక్ష ఎంపీల సీట్లను అడ్డుగా నిలుచోవడంతో సభలో కొద్దిసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై మాట్లాడవలసి ఉన్న ప్రధాని మోదీ తన ప్రసంగాన్ని రద్దు చేసుకోవలసి వచ్చింది. 8 మంది విపక్ష ఎంపీలను మంగళవారం సస్పెండ్ చేయడం, ఆర్మీ మాజీ చీఫ్ జనరల్ ఎంఎం నరవణేకి చెందిన అముద్రిత పుస్తకం నుంచి చైనాకు సంబంధించిన కొన్ని అంశాలను ఉటంకించడానికి ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని అనుమతించకపోవడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్‌సహా విపక్ష పార్టీల ఎంపీలు బుధవారం లోక్‌సభలో అలజడి సృష్టించారు. వాయిదా అనంతరం సాయంత్రం 5 గంటలకు సభా కార్యకలాపాలు తిరిగి ప్రారంభం

కాగానే ప్రధాని మోదీ ఇక ప్రసంగిస్తారని భావిస్తున్న సమయంలో అనూహ్యంగా వర్షా గైక్వాడ్, జ్యోతిమణిసహాం విపక్షానికి చెందిన కొందరు మహిళా ఎంపీలు మోదీతోసహా అధికార పక్షానికి చెందిన ఎంపీల సీట్లను అడ్డుకున్నారు. 'ఏది సరైనదో అదే చేయండి' అన్న అక్షరాలు రాసిన పెద్ద బ్యానర్‌ను పట్టుకుని వారు నిరసన తెలిపారు. 8 మంది విపక్ష ఎంపీల సస్పెన్షన్‌ను వారు తీవ్రంగా ఖండించారు. ఇంతలో స్పీకర్ స్థానంలో ఉన్న సంధ్యా రాయ్ సభను వాయిదా వేశారు.


# ఆముదం తీసుకుంటే మలబద్ధకం, గ్యాస్ నయమవుతాయా?

పేగులకు సంబంధించిన సమస్యలను వదిలించుకోవడానికి ఆముదం భలేగా ఉపయోగపడుతుందని చాలా మంది నమ్ముతుంటారు. శరీరం నుంచి వ్యర్థాలను తొలగించడంలో పేగులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయని అనుకుంటారు. నిజానికి పేగులు సరిగ్గా పనిచేయకపోతే మలబద్ధకం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు తలెత్తుతాయి. ఆముదం నూనెను చాలా కాలంగా ఇంటి వైద్యంలో భాగంగా ఉపయోగిస్తున్న సంగతి తెలిసిందే. ఇది చర్మం, జుట్టు, జీర్ణ సమస్యలకు ప్రయోజనకరంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు సైతం అంటున్నారు. ఆముదంలోని పోషకాలు శరీరాన్ని వివిధ మార్గాల్లో ప్రభావితం చేస్తాయి. అందుకే చాలా మంది దీనిని తమ జీవనశైలిలో భాగంగా క్రమం తప్పకుండా ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా పేగులకు సంబంధించిన సమస్యలను వదిలించుకోవడానికి ఆముదం భలేగా ఉపయోగపడుతుంది. శరీరం నుంచి వ్యర్థాలను తొలగించడంలో పేగులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పేగులు సరిగ్గా పనిచేయకపోతే మలబద్ధకం, గ్యాస్, అజీర్ణం వంటి సమస్యలు తలెత్తుతాయి. అలాంటి సందర్భాలలో చాలా మంది ఆముదం నూనెను ఉపయోగిస్తారు. కానీ ఈ నూనె ప్రభావం అందరికీ ఒకేలా ఉండదు. నూనెను అధికంగా లేదా సరైన విధంగా ఉపయోగించకపోతే సమస్య తగ్గకపోవడానికి బదులుగా మరింత తీవ్రతరం అవుతుంది. ఆముదం నూనెలో ప్రధానంగా రిసినోలిక్ ఆమ్లం ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థను ప్రభావితం చేస్తుంది.



అంతేకాదు, ఇది పేగు కండరాలను సక్రియం చేయడానికి కూడా సహాయపడుతుంది. ఆముదం నూనెను తీసుకున్న తర్వాత ప్రేగుల కదలికలు పెరుగుతాయి. ఇది కడుపును శుభ్రపరచడాన్ని సులభతరం చేస్తుంది. అంతేకాకుండా ఇందులో ఉన్న కొవ్వు ఆమ్లాలు జీర్ణ రసాలను సక్రియం చేస్తాయి. అందుకే కొంతమంది దీనిని మలబద్ధకం సమస్యలకు ఉపయోగిస్తారు. కానీ మోతాదు, సరైన పద్ధతిపై శ్రద్ధ చూపడం కూడా చాలా ముఖ్యం. నిపుణుల సలహా లేకుండా దీన్ని ఎక్కువగా తీసుకోవడం వల్ల కడుపు తిమ్మిరి, బలహీనత కూడా వస్తుంది. ఈ నూనెను మలబద్ధకం కోసం ఉపయోగిస్తారు. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. కడుపు భారాన్ని తగ్గిస్తుంది. కొంతమంది దీనిని గ్యాస్, ఉబ్బరం నుంచి ఉపశమనం పొందటానికి కూడా ఉపయోగిస్తారు. బాహ్యంగా ఇది కీళ్ల నొప్పులు,పొడి చర్మానికి ఉపయోగిస్తారు. జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడానికి, పోషణకు ఆముదం నూనె మంచిది. అయితే దీని నుండి లభించే ఫలితాలు ప్రతి సమస్యకు ఒకేలా ఉండవు. కాబట్టి ఆముదం ఉపయోగించే ముందు వైద్యుడిని సంప్రదించడం చాలా మంచిది.

# రోజూ 15 నిమిషాలు ఇలా చేస్తే.. ఒంట్లో కొవ్వు మంచులా కరగాల్సిందే!



ఆరోగ్యంగా ఉండటానికి రోజూ కొద్ది నిమిషాలైనా శారీరక శ్రమలో పాల్గొనడం చాలా ముఖ్యం. కానీ దానికి సమయం లేని వారు ప్రతిరోజూ 15 నిమిషాలు స్కిప్పింగ్ (జంపింగ్ రోప్) చేయవచ్చని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. నేటి బిజీ జీవనశైలిలో మన ఆరోగ్య నాణ్యత రోజురోజుకూ దారుణంగా క్షీణిస్తోంది. వేళకు భోజనం చేయకపోవడం, తగినంత నిద్ర లేకపోవడం, వ్యాయామం లేకపోవడం వంటి అనేక ఆరోగ్య సమస్యలకు దారితీస్తున్నాయి. అంతే కాదు ఈ అంశాలన్నీ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల ఆరోగ్యంగా ఉండటానికి శారీరక శ్రమలో పాల్గొనడం చాలా ముఖ్యం. కానీ దానికి సమయం లేని వారు ప్రతిరోజూ 15 నిమిషాలు స్కిప్పింగ్ (జంపింగ్ రోప్) చేయవచ్చని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. స్కిప్పింగ్ అనేది గుండెను బలోపేతం చేసే, రక్త ప్రసరణను మెరుగుపరిచే గొప్ప కార్డియో వ్యాయామం. అంతే కాదు ఇది గుండెపోటు, అధిక రక్తపోటు వంటి సమస్యల ప్రమాదాన్ని కూడా తగ్గిస్తుంది. త్వరగా బరువు తగ్గాలనుకునే వారు ప్రతిరోజూ 15 నిమిషాలు స్కిప్పింగ్ చేయాలి. ఇది కేలరీలను త్వరగా బర్న్ చేయడానికి మీకు సహాయపడుతుంది. ఇది మీ జీవక్రియను కూడా పెంచుతుంది. త్వరగా బరువు తగ్గడానికి స్కిప్పింగ్ సహాయపడుతుంది.

ప్రతిరోజూ 15 నిమిషాలు స్కిప్పింగ్ చేయడం వల్ల కాళ్ళు, తొడలు, చేతులు, భుజాలలోని కండరాలు బలపడతాయి. ఇది ఆస్టియోపోరోసిస్, పగుళ్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. బలహీనమైన కండరాలు ఉన్నవారికి స్కిప్పింగ్ ప్రయోజనకరంగా ఉంటుంది.స్కిప్పింగ్ రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది టైప్ 2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతే కాదు, నిద్రలేమితో బాధపడేవారు ప్రతిరోజూ 15 నిమిషాలు స్కిప్ చేయాలి. ఇది శరీరం విశ్రాంతి తీసుకోవడానికి,బాగా నిద్రపోవడానికి సహాయపడుతుంది. మీరు కూడా చిన్న చిన్న విషయాలకే ఒత్తిడికి గురైతే ప్రతిరోజూ 15 నిమిషాలు స్కిప్పింగ్ చేయడానికి ప్రయత్నించండి. ఈ వ్యాయామం ఎండార్ఫిన్‌లను విడుదల చేస్తుంది. అంతేకాకుండా ఇది మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. మనస్సును ప్రశాంతపరుస్తుంది. ఒత్తిడి, ఆందోళనను తగ్గిస్తుంది. సహనం, ఓర్పును పెంచుతుంది. ఇది రోజంతా శక్తి, వంతంగా ఉండటానికి, అలసటను తగ్గించడానికి సహాయపడుతుంది.

## ఫిబ్రవరిలో పుట్టిన వారు ఎలా ఉంటారు.. ఈ సీక్రెట్స్ తెలిస్తే అవాక్కవడం పక్కా..




ప్రతి మనిషి పుట్టుక వెనుక ఒక రహస్యం ఉంటుంది.. కానీ ఫిబ్రవరి నెలలో జన్మించిన వారి వ్యక్తిత్వం వెనుక ఒక మర్మమైన ఆకర్షణ దాగి ఉంటుందని జ్యోతిష్య నిపుణులు చెబుతుంటారు. గాలిలో ప్రేమ నిండి ఉండే ఈ నెలలో పుట్టిన వారు రొమాంటిక్‌గా ఉంటారా? తెలివితేటలతో ఇతరులను మంత్రముగ్ధులను చేస్తారా? ప్రతి వ్యక్తి స్వభావం వారు పుట్టిన తేదీ, వారం, నెలపై ఆధారపడి ఉంటుందని జ్యోతిష్య శాస్త్రం చెబుతోంది. ఫిబ్రవరి నెలలో జన్మించిన వారు మిగతా వారితో పోలిస్తే భిన్నమైన, ఆకర్షణీయమైన వ్యక్తిత్వాన్ని కలిగి ఉంటారు. ఫిబ్రవరిలో జన్మించిన వారికి ఇతరులను ఇట్టే ఆకర్షించే శక్తి ఉంటుంది. వీరు చాలా తెలివైన వారు, తమ మాటలతో ఎదుటివారిని సులభంగా గెలుచుకుంటారు. వీరు చాలా సామాజికంగా ఉంటారు. త్వరగా స్నేహితులను చేసుకుంటారు. వీరు ఎప్పుడూ కొత్త విషయాలను నేర్చుకోవడానికి ఉత్సాహం చూపిస్తారు. పరిశోధనల ప్రకారం.. ఈ నెలలో పుట్టిన వారు చాలా రొమాంటిక్ స్వభావం కలిగి ఉంటారు. జీవితంలో స్వేచ్ఛగా ఉండాలని కోరుకుంటారు. ఎప్పుడూ సంతోషంగా ఉండటానికి ప్రయత్నిస్తారు. తమ మనసులోని భావాలను వ్యక్తపరచడంలో వీరు చాలా వినూత్నంగా ఉంటారు. ముఖ్యంగా ఫిబ్రవరిలో జన్మించిన అమ్మాయిలకు ఆత్మగౌరవం చాలా ఎక్కువ. వీరు ఎవరి దగ్గరా, చివరికి తమ భాగస్వామి దగ్గర కూడా తలవంచడానికి ఇష్టపడరు. అలాగే వీరు అంత త్వరగా ఇతరులను నమ్మరు. ప్రతి విషయంలోనూ సొంతంగా ఆలోచించి నిర్ణయాలు తీసుకుంటారు.ఫిబ్రవరిలో జన్మించిన వారు సృజనాత్మకత, దార్శనికత కలిగిన వారు. వీరు కళలు, సాహిత్యం, సైన్స్, టెక్నాలజీ, పాలనా విభాగాలు వంటి రంగాలలో అద్భుతంగా రాణిస్తారు. వీరు తమ కష్టార్జితంతో ధనవంతులు అవుతారు. అయితే కొన్నిసార్లు ఎక్కువ భావోద్వేగానికి లోనవుతుంటారు. ఇది వారి కెరీర్‌లో అడ్డంకులు సృష్టించవచ్చు. కానీ, లక్ష్యంపై దృష్టి పెడితే వీరు తిరుగులేని విజయాన్ని సాధిస్తారు.


## నాన్నతో కలిసి డిన్నర్ చేయడం.. పిల్లల చదువు, భవిష్యత్తును మార్చేస్తుందా?



పేరెంట్స్‌కు పిల్లలపై ఉండే ప్రేమ ఎంత గొప్పదో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వారు ఏం చేసినా పిల్లల ఆనందం కోసం, ఆరోగ్యం కోసం, వారి క్షేమం కోసం, మెరుగైన భవిష్యత్తుకోసం చేస్తుంటారు. ఎన్ని కష్టాలకైనా ఎదురొడ్డి పిల్లలే సర్వస్వంగా బతికేస్తుంటారు.

అయితే ఇటీవల ఫ్లోరిడా యూనివర్సిటీ నిర్వహించిన తాజా అధ్యయనం మాత్రం మరో ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఏంటంటే.. తండ్రితో కలిసి డిన్నర్ చేసే పిల్లలు అకడమిక్‌గా మెరుగైన పనితీరు కనబరిచే అవకాశం ఎక్కువ. చదువులో, పలు ఇతర విషయాల్లో మంచి సామర్థ్యాన్ని కనబరుస్తారు. ఆత్మ విశ్వాసాన్ని కలిగి ఉంటారు.భాషా నైపుణ్యాలు కూడా..నాన్నతో కలిసి తరచుగా లేదా కనీసం వారానికి నాలుగుసార్లు రాత్రి భోజనం చేసే పిల్లల్లో, అలా చేయనివారితో పోలిస్తే మెరుగైన అకడమిక్ తెలివితేటలు ఉంటాయని అధ్యయనం పేర్కొన్నది. అయితే ఇది గ్రేడ్స్‌తో సంబంధం లేకుండా కాగ్నిటివ్ అండ్ ఎమోషనల్ డెవలప్‌మెంట్‌కు సంబంధించినదని నిపుణులు పేర్కొంటున్నారు. నాన్నతో కలిసి డిన్నర్ చేసే అలవాటు పిల్లల్లో మెరుగైన వోకాబ్యులరీ, భావోద్వేగ నియంత్రణ (వఎనీబితినీనిజీశ్రీ తీవణబీశ్రీజీబితినీని) సామర్థ్యాలను పెంచుతుంది. ప్రవర్తనా పరమైన లోపాలను నివారిస్తుంది. అంతేకాకుండా డిన్నర్ చేసే సమయంలో సంభాషణలు పిల్లల భాషా నైపుణ్యాలను పెంచుతాయి. రీడింగ్, మ్యాథ్, సైన్స్‌లలో మెరుగైన సామర్థ్యాన్ని కనబర్చడంలోనూ ఇది పరోక్షంగా మేలు చేస్తున్నదని అధ్యయం స్పష్టం చేసింది. ఫ్లోరిడా విశ్వవిద్యాలయానికి చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ అండ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ద్వారా వెలువడిన అధ్యయనాలు కూడా ఫ్యామిలీ మీల్స్ లేదా ఫ్యామిలీ డిన్నర్లు పిల్లల అకడమిక్ పనితీరును మెరుగు పరుస్తాయని, హోమ్‌వర్క్‌పై ఫోకస్, రీడింగ్ ఇంట్రెస్ట్‌ను పెంచుతాయని చెబుతున్నాయి. ముఖ్యంగా తండ్రి సమక్షంలో ఉండటం, మాట్లాడటం, మోటివేషన్ పొందడం వంటివి పిల్లల భావోద్వేగ అభివృద్ధిలో కీ రోల్ పోషిస్తాయి. ఇది వారి అకడమిక్ ప్రతిభకు, భావోద్వేగ స్థిరత్వానికి, మానసిక వికాసానికి సహాయపడుతుంది. అయితే అధ్యయనం కేవలం తండ్రితో కలిసి డిన్నర్ చేసే సంతానంపై ఫోకస్ చేసింది. కానీ తల్లి సమక్షంలో లేదా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులందరి సమక్షంలో కలిసి డిన్నర్ చేయడం కూడా పిల్లల్లో మెరుగైన భావోద్వేగ సామర్థ్యాన్ని, తెలివితేటలను పెంచుతాయని నిపుణులు అంటున్నారు.

## మహిళల కంటే మగవాళ్లే ఎందుకు గురక పెడతారు?




నిద్రలో గురక పెట్టడం అనేది చాలా మంది దృష్టిలో ఒక సాధారణ విషయం. కానీ వైద్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ శబ్దం మీ గుండె ఆరోగ్యం ప్రమాదంలో ఉందనే దానికి ముందస్తు సంకేతం కావచ్చు. ముఖ్యంగా 40 ఏళ్లు పైబడిన పురుషుల్లో ఈ సమస్య ఎందుకు ఎక్కువగా కనిపిస్తుంది? అసలు గురక ఎందుకు వస్తుంది? రాత్రిపూట గాఢ నిద్రలో ఉన్నప్పుడు వచ్చే గురక శబ్దం వినడానికి సామాన్యంగా అనిపించినా దాని వెనుక అనేక ఆరోగ్య రహస్యాలు దాగి ఉన్నాయి. ముఖ్యంగా 40 ఏళ్లు పైబడిన వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. అయితే మహిళల కంటే పురుషులే ఎక్కువగా గురక పెట్టడానికి గల కారణాలను వైద్య నిపుణులు శాస్త్రీయంగా వివరిస్తున్నారు. నిద్రపోతున్నప్పుడు ముక్కు, గొంతులోని వాయుమార్గం పూర్తిగా తెరుచుకోకపోవడం వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడుతుంది. ఆ సమయంలో గాలి లోపలికి వెళ్లేటప్పుడు గొంతులోని కణజాలాలు కంపనానికి గురవుతాయి. ఈ కంపనమే మనకు గురక శబ్దంగా వినిపిస్తుంది. ఢిల్లీలోని మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజీ ఇఎెంటి విభాగం అధిపతి డాక్టర్ రవి మహర్ ప్రకారం.. మహిళల కంటే పురుషుల గొంతులోని వాయుమార్గం సహజంగానే ఇరుకైనది. ఇది నిద్రలో ఎక్కువ కంపనాన్ని కలిగిస్తుంది. మహిళల్లో ఉండే ఈస్ట్రోజెన్, ప్రొజెస్టెరాన్ హార్మోన్లు వాయుమార్గ కండరాలను బలంగా ఉంచుతాయి. పురుషులకు ఈ హార్మోన్ రక్షణ తక్కువగా ఉంటుంది. పురుషులకు గొంతు, మెడ చుట్టూ కొవ్వు చేరే అవకాశం ఎక్కువ. ఇది శ్వాస నాళంపై ఒత్తిడి తెచ్చి గురకకు దారితీస్తుంది. తేలికపాటి గురక సాధారణమే అయినా అది తీవ్రమైతే స్లీప్ అప్నియా అనే ప్రమాదకర పరిస్థితికి దారితీస్తుంది. ఇందులో నిద్రలో కొన్ని సెకన్ల పాటు శ్వాస ఆగిపోతుంది. దీనివల్ల రక్తంలో ఆక్సిజన్ తగ్గి, గుండె జబ్బులు, అధిక రక్తపోటు వచ్చే ప్రమాదం ఉంది. శరీర బరువును, ముఖ్యంగా మెడ చుట్టూ ఉండే కొవ్వును తగ్గించుకోవాలి. పడుకునే ముందు ధూమపానం, మద్యపానానికి దూరంగా ఉండాలి. వెల్లకిలా పడుకోకుండా ఒక పక్కకు తిరిగి పడుకోవడం వల్ల వాయుమార్గంపై ఒత్తిడి తగ్గుతుంది. గురకతో పాటు నిద్రలో ఆయాసం రావడం లేదా పగటిపూట విపరీతమైన నీరసంగా అనిపిస్తే వెంటనే డాక్టర్‌ని సంప్రదించాలి.

## పళ్లకు ఏ బ్రష్ మంచిది..



మనం రోజూ ఉదయాన్నే చేసే మొదటి పని పళ్లు తోముకోవడం. అయితే మీరు వాడుతున్న టూత్ బ్రష్ మీ దంతాలను శుభ్రపరుస్తోందా లేక పాడు చేస్తోందా..? చాలామంది బ్రష్ అరిగిపోయి పీచులా మారే వరకు దానిని వాడుతుంటారు. మనం రోజూ ఉదయాన్నే చేసే మొదటి పని పళ్లు తోముకోవడం. అయితే మీరు వాడుతున్న బ్రష్ సరైనదేనా? దంతాల మధ్య ఇరుక్కున్న వ్యర్థాలను అది నిజంగా తొలగిస్తోందా? అంటే చాలామంది దగ్గర సమాధానం లేదు. ఒక సాధారణ టూత్ బ్రష్ ఎంపికలో మనం చేసే చిన్న పొరపాట్లు చిగుళ్ల వ్యాధులకు, పళ్లు పుచ్చిపోవడానికి కారణమవుతున్నాయి. చాలామంది సమానంగా, గట్టిగా ఉండే బ్రిస్టల్స్ ఉన్న బ్రష్‌లను ఎంచుకుంటారు. కానీ వైద్యుల ప్రకారం.. జిగ్-జాగ్ లేదా ఉంగరాల ఆకారంలో ఉండే మృదువైన బ్రిస్టల్స్ మాత్రమే దంతాల మధ్య సందుల్లోకి వెళ్లి ఆహార కణాలను తొలగిస్తాయి. బ్రిస్టల్స్ మరీ గట్టిగా ఉంటే అవి పళ్లపై ఉండే ఎనామిల్‌ను అరిగిపోయేలా చేస్తాయి మరియు చిగుళ్ల నుండి రక్తం వచ్చేలా చేస్తాయి.టూత్ బ్రష్ కొనేటప్పుడు దాని తల భాగం ఎలా ఉందో గమనించాలి. జ-ఆకారపు తల ఉన్న బ్రష్ కంటే, ఎ-ఆకారంలో ఉండే బ్రష్ నోటి మూలల్లోకి, వెనుక పళ్ల వరకు సులభంగా చేరుతుంది. బ్రష్ హ్యాండిల్ నేరుగా ఉండటం కంటే కొంచెం వంపు తిరిగి ఉంటే వెనుక దవడ పళ్లను శుభ్రం చేయడం చాలా సులభం అవుతుంది. అలాగే హ్యాండిల్ పొడవుగా ఉంటే పట్టుకోవడానికి వీలుగా ఉంటుంది. చాలామంది బ్రష్ బ్రిస్టల్స్ అన్నీ పక్కకు వంగిపోయే వరకు వాడుతుంటారు. కానీ పరిశోధనలు.. మీ టూత్ బ్రష్‌ను కనీసం ప్రతి నాలుగు నెలలకు ఒకసారి కచ్చితంగా మార్చాలి. అరిగిపోయిన బ్రష్‌ను వాడటం వల్ల పళ్లు సరిగ్గా శుభ్రపడకపోగా, బ్యాక్టీరియా పేరుకుపోయే ప్రమాదం ఉంది.

## బాత్ రూమ్ టైల్స్ పై మరకలు పోగొట్టే చిట్కాలు!



బాత్రూమ్ టైల్స్‌పై పసుపు, నీటి మరకలు, సబ్బు మరకలు వంటి మొండి మరకలను తొలగించడానికి ఖరీదైన క్లీనర్లు అవసరం లేదు. బేకింగ్ సోడా, వెనిగర్ పేస్ట్, వెనిగర్-నీటి ద్రావణం, నిమ్మకాయ-ఉప్పు మిశ్రమం, బ్లీచ్ వంటి సహజ ఇంటి చిట్కాలతో టైల్స్‌ను సులభంగా శుభ్రం చేసి కొత్తవాటిలా మెరిపించవచ్చు. ఈ పద్ధతులు బాత్రూమ్‌ను పరిశుభ్రంగా ఉంచడంలో సహాయపడతాయి.?బాత్రూమ్ ఎంత శుభ్రంగా ఉంటే అంత మంచిది. లేదంటే అనారోగ్యాలు తప్పవు. అయితే బాత్రూమ్ లో ఇప్పుడు కాస్తంత మోడర్న్ గా కనబడాలన్న ఉద్దేశంతో అందరూ టైల్స్ వేయించుకుంటున్నారు. ఇవి వేయడం వల్ల పూర్తిగా లుక్ మారిపోతుంది. చూడడానికి బాగుంటుంది కానీ..వీటిని సరైన విధంగా మెయింటేన్ చేయకపోతే చాలా త్వరగా మురికిగా మారిపోతాయి. పైగా ఇవి మురికి అయితే హైజీన్ కూడా ఉండదు.

## పాక్ వచ్చినా రాకున్నా.. మేము కొలంబో వెళ్తున్నాం..

# సైలెన్స్ బ్రేక్ చేసిన టీమిండియా కెప్టెన్ సూర్య




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ లో ఇండియా, పాకిస్తాన్ మ్యాచ్ ల విషయంలో సస్పెన్స్ కొనసాగుతూనే ఉంది. పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని శ్రీలంకలో ఇండియా, పాక్ మ్యాచ్ లను షెడ్యూల్ చేసింది ఐసీసీ. అయినప్పటికీ.. తాము ఇండియాతో గేమ్ ను బాయ్ కాట్ చేస్తున్నట్లు పాక్ ప్రకటించడంతో అప్పటి నుంచి అనిశ్చితి కొనసాగుతూనే ఉంది. ఈ అంశంపై టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తొలిసారి స్పందించాడు. తాము ఆడటానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించాడు. టోర్నమెంట్ కు ముందు ఏర్పాటు చేసిన కెప్టెన్స్ మీట్ సందర్భంగా.. పాక్ తో ఆడటానికి తాము సిద్ధంగా ఉన్నామని చెప్పాడు. పాకిస్తాన్ ఆడటానికి సిద్ధంగా లేకున్నా తాము మాత్రం కొలంబో వెళ్తున్నట్లు స్పష్టం చేశాడు. అందుకోసం టికెట్లు కూడా బుక్ చేసుకున్నట్లు తెలిపాడు. మా మైండ్ సెట్ క్లియర్ గా ఉంది.. ఆడమని మేము చెప్పలేదు. అలా చెప్పింది వాళ్లు.. మా ఫ్లైట్స్ బుక్కయ్యాయి.. కొలంబో వెళ్తున్నాం.. ముందుగా యూఎస్ఏ, కెనడా తర్వాత కొలంబో కు వెళ్తాం.. అంటూ క్లారిటీ ఇచ్చాడు సూర్య. పాకిస్తాన్ జట్టు తమ షెడ్యూల్డ్ గ్రూప్ మ్యాచ్‌లో పాల్గొనడంపై అనిశ్చితి ఉన్నప్పటికీ, రాబోయే ౨20 ప్రపంచ కప్ 2026 కోసం తమ జట్టు సన్నాహాలు మారలేదని సూర్యకుమార్ యాదవ్ స్పష్టం చేశాడు. ఈ టోర్నమెంట్‌లో గ్రూప్ స్టేజ్ లో ఇండియా

నాలుగు మ్యాచ్‌లు ఆడుతుంది . 2026 ఫిబ్రవరి 7న ముంబైలో అమెరికాతో తమ ప్రచారాన్ని ప్రారంభిస్తుంది. ఆ తర్వాత ఫిబ్రవరి 12న న్యూఢిల్లీలో నమీబియాతో తలపడుతుంది. ఈ రెండు మ్యాచ్ లు తర్వాత.. అత్యంత ఆసక్తి కలిగిన మ్యాచ్.. ఫిబ్రవరి 15న కొలంబోలో పాకిస్తాన్‌తో జరగనుంది, ఫిబ్రవరి 18న అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌తో జరిగే మ్యాచ్ తో గ్రూప్ మ్యాచ్ లు ముగుస్తాయి. గ్రూప్ స్టేజ్ తర్వాత, ప్రతి గ్రూప్ నుండి అగ్రస్థానంలో నిలిచిన రెండు జట్లు సూపర్ 8 కు చేరుకుంటాయి, అక్కడ వాటిని నాలుగు గ్రూపులుగా విభజించారు. ఆ గ్రూపుల నుండి టాప్ లో నిలిచిన జట్లు సెమీ-ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. టోర్నమెంట్‌లో భారత్, పాకిస్తాన్ జట్లు రెండూ ముందుకు సాగితే, ఫైనల్‌లో తిరిగి మ్యాచ్ జరిగే అవకాశం ఉంది. అయితే, అలాంటి సందర్భంలో పాక్ పాల్గొంటుందా లేదా అనే దానిపై పాకిస్తాన్ వైఖరి ఇంకా అస్పష్టంగా ఉంది.

# టీ20 వరల్డ్ కప్ వివాదం... పాక్ ప్రధానికి థ్యాంక్స్ చెప్పిన బంగ్లాదేశ్ క్రీడా సలహాదారు

భారత్‌తో మ్యాచ్ బహిష్కరణ నిర్ణయంపై పాక్‌కు బంగ్లాదేశ్ ధన్యవాదాలు

బంగ్లాదేశ్‌కు మద్దతుగా భారత్‌తో మ్యాచ్ ఆడబోమని స్పష్టం చేసిన పాక్ ప్రధాని

టీ20 ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్‌ను తొలగించడాన్ని నిరసిస్తూ ఈ నిర్ణయం

పాకిస్థాన్ నిర్ణయంపై ఐసీసీ తీవ్ర హెచ్చరిక, పునరాలోచించుకోవాలని సూచన




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్‌ను తొలగించినందుకు నిరసనగా, భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరించాలని పాకిస్థాన్ తీసుకున్న నిర్ణయంపై బంగ్లాదేశ్ యువజన, క్రీడల సలహాదారు ఆసిఫ్ నజ్రుల్ హర్షం వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌కు సంఘీభావంగా ఈ నిర్ణయం తీసుకున్న పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు గురువారం ఫేస్‌బుక్‌లో ఆయన ఒక పోస్ట్ పెట్టారు.పాక్ ప్రధాని వ్యాఖ్యలను ఆసిఫ్ నజ్రుల్ తన పోస్ట్‌లో ఉటంకించారు. "టీ20 ప్రపంచకప్ నుంచి బంగ్లాదేశ్‌ను తొలగించినందుకు నిరసనగా భారత్‌తో మ్యాచ్‌ను బహిష్కరించాలని మా దేశం నిర్ణయించింది. క్రీడా మైదానంలో రాజకీయాలు ఉండకూడదు. మేం బంగ్లాదేశ్‌కు పూర్తిగా మద్దతుగా నిలవాలి" అని షెహబాజ్ షరీఫ్ బుధవారం ఇస్లామాబాద్‌లో జరిగిన కేబినెట్ సమావేశంలో అన్నట్లు నజ్రుల్ పేర్కొన్నారు.ఫిబ్రవరి 15న కొలంబోలోని ఆర్. ప్రేమదాస స్టేడియంలో భారత్‌తో జరగాల్సిన గ్రూప్-స్టేజ్ మ్యాచ్‌లో పాల్గొనబోమని పాకిస్థాన్ ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, పాక్ నిర్ణయంపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) తీవ్రంగా స్పందించింది. ఇలా ఎంపిక చేసిన మ్యాచ్‌లలో మాత్రమే పాల్గొనడం ప్రపంచ క్రీడా స్ఫూర్తికి విరుద్ధమని హెచ్చరించింది. ఈ నిర్ణయం పాకిస్థాన్ క్రికెట్‌పై దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందని, పీసీబీ పునరాలోచించుకోవాలని ఐసీసీ సూచించింది.భద్రతా కారణాల దృష్ట్యా తమ జట్టును భారత్‌కు పంపేందుకు బంగ్లాదేశ్ ప్రభుత్వం నిరాకరించడంతో, ఆ జట్టును టీ20 ప్రపంచకప్ నుంచి తప్పించారు. తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలన్న బంగ్లా విజ్ఞప్తిని ఐసీసీ తిరస్కరించింది. దీంతో బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌ను టోర్నీలోకి తీసుకున్నారు.

# బ్యాట్ పట్టుకోవటం తెలియని వాళ్లు క్రికెట్ కమిటీల్లో ఉంటారా.. ఉండాల్సింది మాజీ క్రికెటర్లు కదా



**హైదరాబాద్ పెన్ పవర్:** కనీస అనుభవం లేని వ్యక్తులు క్రీడా సంస్థలను నిర్వహించడంపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. అసలు బ్యాట్ ఎలా పట్టుకోవాలో తెలియని వారు కాకుండా రిటైర్డ్ క్రికెటర్లు, అనుభవం ఉన్న వారు క్రికెట్ కమిటీలకు నాయకత్వం వహించాలని దేశ సర్వోన్నత న్యాయస్థానం సూచించింది. 2026, జనవరి 6న జరగాల్సిన మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్ (ఎంసీఏ) ఎన్నికలపై బాంబే హైకోర్టు స్టే విధించింది. బంధుప్రీతి, తమకు అనుకూలంగా ఉన్నవారికే పదవులు కట్టబెడుతున్నారంటూ హైకోర్టు ఎన్నికలను నిలిపేసింది. దీంతో బాంబే హైకోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎంసీఏ, మరికొందరు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్లపై సీజేఐ సూర్యకాంత్, న్యాయమూర్తులు జోయ్‌మల్య బాగ్చి, విపుల్ ఎం పంచోలిలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ చేపట్టింది. బాంబే హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించేందుకు సుప్రీంకోర్టు ధర్మాసనం నిరాకరించింది. ఈ సందర్భంగా సీజేఐ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్ర క్రికెట్ అసోసియేషన్‌లో సభ్యుల సంఖ్యను ఎందుకు ఒకేసారి భారీగా పెంచారని ప్రశ్నించారు. ఎంసీఏ తన సభ్యత్వాన్ని 300కి విస్తరించాలనుకుంటే.. ఆ స్థానాల్లో అంతర్జాతీయ రిటైర్డ్ ఆటగాళ్ల, అనుభవజ్ఞులను నియమించాలని సూచించారు. ఆటగాళ్ల వల్లే క్రీడా సంఘాలు ఉన్నాయని.. నిర్వాహకుల వల్ల కాదని చురకలంటించారు. అసలు బ్యాట్ ఎలా పట్టుకోవాలో తెలియని వారు కాకుండా రిటైర్డ్ క్రికెటర్లు, అనుభవం ఉన్న వారు క్రికెట్ కమిటీలకు నాయకత్వం వహించాలని సూచించారు. పిటిషనర్లు తమ పిటిషన్లను ఉపసంహరించుకోవడానికి అనుమతించిన సుప్రీంకోర్టు.. బాంబే హైకోర్టులోనే ఈ కేసు తేల్చుకోవాలని సూచించింది.

**అసలు వివాదం ఇదే:**

2026 ప్రారంభంలో సుమారు 400 మంది కొత్త సభ్యులను ఎంసీఏ హడావిడిగా చేర్చుకున్నట్లు వార్తలు రావడంతో ఈ వివాదం మొదలైంది. ఎంసీఏ ఎన్నికలకు ముందు మోసపూరితంగా 400 మంది చేర్చుకున్నారని ఆరోపిస్తూ భారత మాజీ క్రికెటర్, బీజేపీ నాయకుడు కేదార్ జాదవ్ బాంబే హైకోర్టును ఆశ్రయించాడు. ఎంసీఏలో కొత్తగా చేరిన వారిలో చాలామంది ఎన్‌సిపి-ఎస్పీ ఎమ్మెల్యే రోహిత్ పవార్ దగ్గరి బంధువులు, వ్యాపార సహచరులు ఉన్నారని ఆరోపించారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టి బాంబే హైకోర్టు.. 2026, జనవరి 6న జరగనున్న ఎంసీఏ ఎన్నికలపై స్టే విధించింది.



నికితా శర్మ సొగసైన చీర లుక్ ఆన్‌లైన్‌లో హృదయాలను గెలుచుకుంది

# వారణాసి.. 'కుంభ' ఉద్దేశమేమిటి?



దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న వారణాసి మూవీలో మాలీవుడ్ స్టార్ యాక్టర్ పృథ్వీరాజ్ సుకుమారన్ యాక్ట్ చేస్తున్న విషయం తెలిసిందే. వారణాసిలో ఆయన కుంభ రోల్ లో కనిపించనున్నారు. ఇప్పటికే పృథ్వీరాజ్ కు సంబంధించిన ఫస్ట్ లుక్ ను మేకర్స్ రిలీజ్ చేయగా.. అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ఆయన రోల్ పై బజ్ కూడా క్రియేట్ అయింది.అయితే వారణాసి టీమ్ తో ఓ ఇంటర్వ్యూలో పాల్గొని పృథ్వీరాజ్ సుకుమారన్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. తన కెరీర్ లో కుంభ పాత్ర.. విభిన్నమైన రోల్ గా చెప్పారు. ఎవరూ అంచనా వేయలేనిదని పేర్కొన్నారు. పూర్తిగా గ్రే షేడ్స్ తో తన క్యారెక్టర్ సాగుతుందని చెప్పిన ఆయన.. సినిమాలో ఎప్పుడు ఏం చేస్తానో ప్రేక్షకులు ఊహించలేని విధంగా జక్కన్న పాత్రను డిజైన్ చేసినట్లు వెల్లడించారు.ఆ తర్వాత.. వారణాసి కాకుండా కెరీర్ లో ఎక్కువగా నేర్పిన సినిమా ఏది అని హోస్ట్ అడిగిన ప్రశ్నకు పృథ్వీరాజ్ వెంటనే.. ది గోట్ లైఫ్ మూవీ అని ఆన్సర్ ఇచ్చారు. ఆ సినిమా తనకు ఎంతో ప్రత్యేకమని చెప్పిన ఆయన.. నటుడిగా చాలా నేర్పిందని చెప్పారు. అదే పలుమార్లు రిపీట్ చేసిన పృథ్వీరాజ్.. ఆ చిత్రం ప్రస్తుతం నెట్ ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతోందని ప్రస్తావించారు. దీంతో ఒక్కసారిగా ఆ సినిమాపై నెట్టింట చర్చ మొదలైంది.నిజానికి.. పృథ్వీరాజ్ కెరీర్ లోనే ది గోట్ లైఫ్ అత్యంత ప్రతిష్టాత్మక చిత్రమని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. బెన్నీ డానియల్ (బెన్యామిన్) రాసిన గోట్ డేస్ నవల ఆధారంగా ఆ సినిమా తెరకెక్కింది. ఉత్తమ దర్శకుడిగా నేషనల్ అవార్డు అందుకున్న బ్లెస్సీ దర్శకత్వం వహించారు. అయితే సినిమా కోసం పృథ్వీరాజ్ సుకుమారన్ చాలా కష్టపడ్డారు. ఏకంగా 16 ఏళ్ల పాటు దీని కోసం శ్రమించారు.సినిమాలో నజీబ్ రోల్ లో ఒదిగిపోవడం కోసం ఏకంగా 31 కిలోల బరువు తగ్గారు. 72 గంటల పాటు భోజనం లేకుండా కేవలం మంచినీళ్లు మాత్రమే తాగి ఆయన షూట్ లో పాల్గొన్నారు. 2009లో ప్రకటించిన ఆ ప్రాజెక్ట్ 2018లో షూటింగ్ ప్రారంభమై, 2024లో థియేటర్లలో విడుదలైంది. దాదాపు 16 ఏళ్ల ప్రయాణం తర్వాత ప్రేక్షకుల ముందుకు వచ్చింది.సర్వైవల్ థ్రిల్లర్ గా రూపొందిన బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించి మంచి కలెక్షన్లు సాధించింది. పృథ్వీరాజ్ కష్టానికి ఫలితం దక్కిందని చెప్పాలి. అనేక మంది ఆయన యాక్టింగ్ పై ప్రశంసలు కురిపించారు. ఇప్పుడు హాలీవుడ్ మీడియా వేదికగా ది గోట్ లైఫ్ ఓటీటీలో పృథ్వీరాజ్ ఉందని చెప్పడం గమనార్హం కొంతమంది నెటిజన్లు దాన్ని ట్రోల్ చేస్తూ ప్రమోషన్ అంటున్నా.. మరికొందరు మాత్రం ఆయన కష్టానికి ఇది తగిన గుర్తింపును ప్రస్తావించారని అంటున్నారు. ఏదేమైనా కుంభ ఉద్దేశ్యం ఆయనకే తెలియాలి.



త్రిప్తి డిమ్రీ ఆరెంజ్ దుస్తులలో గ్రేస్‌ను ప్రసరిస్తుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965